ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
18-12-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 317 పేజీలు: 8+4 వెల: 6.50

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


బుధవారం క్రికెటర్ శ్రీచరణికి ప్రోత్సాహక చెక్కును అందజేస్తున్న మంత్రి లోకేష్

## క్రికెటర్ శ్రీచరణికి 2.5 కోట్ల నజరానా

### చెక్ అందజేసిన మంత్రి లోకేష్

### విశాఖలో 500 గజాల ఇంటి స్థలం కూడా

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరచిన క్రికెటర్ శ్రీచరణికి కూటమి ప్రభుత్వం రూ.2.50 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో క్రికెటర్ శ్రీచరణిని కలిసిన మంత్రి నారా లోకేష్ స్వయంగా ఆమెకు చెక్‌ను అందజేశారు. కడప జిల్లాకు చెందిన శ్రీచరణి అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనకనబరిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. రూ.2.50 కోట్ల >>2

## కలెక్టర్లే సర్కార్‌కు

# బ్రాండ్ అంబాసిడర్లు

స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ మన విధానం

నిత్య విద్యార్థుల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

పిపిపితోనే మెరుగైన వైద్య సేవలు

జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు


బుధవారం సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, సిఎస్ విజయానంద్ తదితరులు

**విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి అంబాసిడర్లుగా పనిచేయాలని, ప్రభుత్వంపై సానుకూలత రావాలంటే అధికారులదే కీలకపాత్రగా సిఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఎపి గురించే చర్చించుకునేలా.. ప్రభుత్వంపై ప్రజలకున్న విశ్వసనీ యత కొనసాగించేలా చూడాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. పొలిటికల్ గవర్నెన్సు అనేది కీలకమని... కలెక్టర్లు తమ ప్రతిభ ద్వారా కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా చూడాలని సీఎం చెప్పారు. ప్రతీ నిమిషం తనని తాను మరింత ఉన్నతంగా తీర్చిద్దుకుంటున్నాని అధికారులకు ముఖ్యమంత్రి వివరించారు.ఎపిలో ఇక నుంచి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఉండాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహా విధానాన్నే పరిపాలనలోనూ తెస్తున్నట్టు సీఎం ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరుగుతున్న 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో బుధవారం వివిధ అంశాలపై సీఎం జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, అధికారుల పనితీరును స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సే కొలమానంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాలు అనుసరించే బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు >>2

## ఇక జిల్లాల పర్యటనకు ముఖ్యమంత్రి 2లో

## హజ్ యాత్రికులకు లక్ష సాయం

### - జీవో విడుదల

**విజయవాడ, డిసెంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు కూటమి ప్రభుత్వ శుభవార్త చెప్పింది. వచ్చే ఏడాది (హజ్ 2026) హజ్ యాత్రకు విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి వెళ్లే హాజీలకు ఎపి ప్రభుత్వం ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించనుంది. ఈ ప్రోత్సాహకానికి సంబంధించిన జీవోను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదలచేశారు గతంలో హజ్ యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు వంటి ఇతర మెట్రో నగరాల నుంచి మక్కాకు తరలివెళ్లేవారు. ఇప్పుడు విజయవాడలో ఎంబార్కేషన్ సెంటర్ ఏర్పాటుతో భక్తులకు భారీ ఉపశమనం కలిగింది. ఈ సెంటర్ నుంచి వెళ్లేందుకు అదనపు ఖర్చు (రూ.68 వేల వరకు) భరించకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల సబ్సిడీ ఇస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 347 మంది అభ్యర్థులు విజయవాడ హజ్ ఎంబార్కేషన్ సెంటర్ ద్వారా >>2


బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారుల సమక్షంలో ఎడిటిఓతో ఎంవోయు కుదుర్చుకున్న మంత్రి దుర్గేష్

# పర్యాటకానికి కొత్త వెలుగులు

### ఫిబ్రవరి 13, 14న విశాఖలో టూరిజం మార్ట్

### ఎటిడిఓఐతో పర్యాటక శాఖ ఎంఓయు

### జాతీయ ఈవెంట్ నిర్వహించడం గర్వకారణం: మంత్రి దుర్గేష్

**విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని దేశీయంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా (ఎడిటిఓఐ) సహకారంతో 2026 ఫిబ్రవరి 13,14 తేదీల్లో విశాఖపట్నం వేదికగా 'ఎడిటిఓ' నేషనల్ టూరిజం మార్ట్ 2025' నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. బుధవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్‌లోని తన కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఎడిటిఓఐ ప్రతినిధులతో ఎంవోయూ (అవగాహనఒప్పందం) కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశీయ పర్యాటక రంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుతమైన తీరప్రాంతం, మెరుగైన మౌలిక వసతులు కలిగిన విశాఖ నగరం ఈ జాతీయ స్థాయి ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని కోస్టల్ టూరిజం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రకకట్టడాలు, ఎకోఅడ్వెంచర్ టూరిజం, ఏజెన్సీ ప్రాంతాల పర్యాటకాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి ఇది ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్ బీ2బీ నెట్‌వర్కింగ్ సెషన్లు, గమ్యస్థానాల ప్రదర్శ నలు, వ్యాపార సమావేశాలు, ప్యానెల్ చర్చలు, పర్యాటక ప్రాంతాల సందర్శనకార్యక్రమాలద్వారా స్థానిక పర్యాటక వాటాదారులకు జాతీయ స్థాయిలో వ్యాపార సంబంధాలు ఏర్పడతాయని తాము భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అపారమైన, వైవిధ్యభరితమైన పర్యాటక అవకాశాలను ప్రదర్శించడానికి ఇదొక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ చొరవ వల్ల రాష్ట్రానికి పర్యాటకుల రాక పెరగడమేకాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు, దీర్ఘకాలిక వ్యాపారసంబంధాలు మెరుగుపడతాయని,జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ.. దేశీయ పర్యాటకాన్ని బలోపేతం చేయడం, అంతగా ప్రాచుర్యంలేని పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడం, వెలుగులోకి తీసుకురావడం, స్థానిక వర్గాలకు స్థిరమైన పర్యాటక వృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించడం తమ అసోసియేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు పర్యాటక శాఖ కూడా బాధ్యతాయుతమైన, సమగ్రమైన పర్యాటక వృద్ధిని సాధించేందుకు జాతీయ సంఘాలతో కలిసి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

## మావోయిస్టు నేతల ఎన్‌కౌంటర్లపై హైకోర్టు విచారణ

**విజయవాడ, డిసెంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:** హిడ్మాతోపాటు ఇతరుల ఎన్‌కౌంటర్‌పై పీపుల్స్ యూనిటి ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షురాలు జయ వింధ్యాల హై కోర్టులో పిల్ దాఖలు చేశారు. మావోయిస్టు అగ్ర నేత హిడ్మా మరణం ఒక సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అయితే.. ఈ ఘటనపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సిట్టింగ్ జడ్జితో లేదా ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జయ వింధ్యాల దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా ఎపి అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచారు. మెజిస్టీరియల్ విచారణపై పిటిషనర్లకు అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జ లేదా మెజిస్ట్రేట్‌ని ఆశ్రయించాలని పేర్కొన్నారు. నేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేయడం కంటే, కింది కోర్టులో ఫిర్యాదుచేసివిచారణ కోరడం సరైన ప్రక్రియ అని ఆయన అభిప్రా >>2

## ఇక అమరావతిలోనే రిపబ్లిక్‌డే వేడుకలు!

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి రిపబ్లిక్ డే వేడుకలను రాష్ట్ర రాజధాని అయిన అమరావతిలోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ప్రతి ఏటా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే, ఈసారి మాత్రం రాజధాని అమరావతిలోనే రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రాయపూడి సిఆర్‌డిఎ ఆఫీసు సమీపంలో 20 ఎకరాల్లో రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సిఆర్‌డిఎకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

## ప్రైవేటు స్కూళ్లకు ఫైర్ ఎన్‌ఒసి తొలగింపు

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ విద్యాసంస్థలకు గత ప్రభుత్వం పెట్టిన నిబంధనలను కూటమి ప్రభుత్వంసడలించింది. మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా అగ్నిమాపక శాఖ నుంచి ఫైర్ ఎన్‌వోసీ తీసుకోవాలనే నియమాన్ని తొలగించి, ఈ రోజు జీవో జారీ చేసింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం 30 మీటర్ల వరకు ఎత్తు ఉన్న విద్యాసంస్థలు ప్రతి ఐదు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫైర్ ఎన్‌వోసి తీసుకోవాలి. పాఠశాలల రెన్యూవల్ (రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ) 10 ఏళ్లకు ఒకసారి చేయించుకోవడానికి అవకాశం కల్పించారు.

**ఎబిఎన్ ఛానల్ ఫాలో అవ్వండి**

గత ప్రభుత్వం పెట్టిన ఏటా ఎన్‌ఒసి తీసుకోవాలనే నిబంధన ప్రైవేట్ పాఠశాలలకు భారీ ఇబ్బంది కలిగించిందని, దీన్ని మార్చాలని టిడిపి ఎమ్మెల్యేసీలు మంత్రి లోకేష్‌ను కోరారు. వారి అభ్యర్థన మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం ఎపిలోని ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేసారు.

## ప్రధాని ఆవాస్ యోజన అమలు ఇలాగేనా?

### పథకం నిధుల వినియోగంలో నిర్లక్ష్యంపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

### జనవరి 15 లోపు నిధులు ఖర్చు చేయాలని కలెక్టర్లకు ఆదేశం

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకం అమలుపై సిఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకానికి కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో రాష్ట్రం వెనుకబడిందని తెలిపారు. కలెక్టర్లసదస్సులోభాగంగా సచివాలయంలో బుధవారం కేంద్ర ప్రాయోజిత పథకాలు అమలుపై సిఎం సమీక్షించారు. ఈ పథకాల అమలు తీరుపై ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోజ్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం 75 పథకాలకు రూ.15,173 కోట్లు కేటాయించిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.9,340 కోట్లు ఇస్తుందని రోనాల్డ్ తెలిపారు. పిఎంఎవై అర్బన్ పథకం కింద రూ.1,268 కోట్లుఉంటే ఇందులో కేవలం రూ.480కోట్లు (38శాతం) ఖర్చు అయినట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్షణకు రూ.1,363 కోట్లకు రూ.1,259 కోట్లు (92 శాతం) ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు రూ.1,018 కోట్లకు రూ.555 కోట్లు (55 శాతం) ఖర్చు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒకవైపు డబ్బు లేక ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు కేంద్రం నిధులను సరిగ్గా ఖర్చు చేయలేకపోతున్నామని చెప్పారు. ఈ నిధులు ఖర్చు చేస్తే కేంద్రం నుంచి మరో రూ.1,200 కోట్లువస్తాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ మంత్రితోపాటు కలెక్టర్లందరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను జనవరి 15వ తేదీలోపు ఖర్చు చేయాలని ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి రూపాయి ఖర్చు చేయాలని చెప్పారు. నిర్మాణ సంస్థలు, ఏజెన్సీలను 10 రోజులకోసారి పిలిచి సివిల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# అన్నీ ఇక ఇ-ఫైళ్లే..

### అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందించాలి

### మొదటి ప్రాధాన్యం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కే

### కలెక్టర్లకు ఐటి, ఆర్టీజీశాఖ కార్యదర్శి కాటంనేని సూచన

**విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాల్లోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ ఇకపై ప్రతి ఫైలు కూడా ఇ-ఫైలుగానే నిర్వహించాలని, జనవరి 15వ తేదీ తర్వాత ప్రజలకు అన్ని సేవలు ఆన్ లైన్‌లోనే అందించనున్నామని ఈ దిశగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఐటీ, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని సూచించారు. ఇ-ఆఫీసు, ఆర్టీజీ కార్యకలాపాలపైన ఆయన జిల్లా కలెక్టర్ల సదస్సులో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ప్రభుత్వంలో దాదాపుగా అన్ని ఫైళ్లు ఇ-ఫైలు రూపంలోనే నిర్వహిస్తున్నారని అయితే జిల్లాలో ఇప్పటికీ కొన్ని కార్యాలయాల్లో కొంతమంది ఫిజికల్ ఫైళ్లు నడుపుతున్నారని తెలిపారు. ఈ విధానానికి ఇక పూర్తిగా స్వస్తి పలకాలని ఇకపై అన్ని ఫైళ్లూ ఇ-ఫైళ్లగానే నిర్వహించాలని సూచించారు. జనవరి 15వ తేదీ నుంచి ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలన్నీ కూడా ఆన్‌లైన్‌లోనే అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ ఆన్‌లైన్‌లో అందించే సేవల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలందించడమే మన మొదటి ప్రాధాన్యం కావాలన్నారు. తమ పనుల కోసం ప్రజలెవ్వరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని సేవలూ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామన్నారు. మనమిత్రను ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకుని సులభంగా సేవలు పొందేలా చూడాలని చెప్పారు. మనమిత్రపై ప్రజల్లో అవగాహన కల్పించి దీని వినియోగం పెంచేలా జిల్లాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా శాఖల అధికారులు ఈ అవగాహన కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని ఆయా శాఖలకు సంబంధించి సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఎంత సుభంగా పొందవచ్చో ప్రజలకు వివరించాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై తమ తమ జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల సర్టిఫికెట్లు సులభంగా పొందవచ్చని, ప్రభుత్వానికి పన్నులు, బిల్లుల చెల్లింపు వరకు అన్నీ సులభంగా చేయొచ్చన్నారు.

**డిజీ వెరిఫై..**

ప్రభుత్వం ప్రత్యేకించి డిజీ వెరిఫై అందుబాటులోకి తెచ్చిందని దీన్ని అన్ని శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిజీ వెరిఫై ద్వారా ఇకపై సర్టిఫికెట్లను ఫిజికల్‌గా తనిఖీ చేయాల్సిన >>2


బుధవారం మస్కట్‌లో ఒమన్ సుల్తాన్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## భారత్, ఒమన్ మధ్య 7 దశాబ్దాల బంధం

### ఇంధన, భద్రత, టెక్నాలజీ, వ్యవసాయ రంగాలపై ఒమన్ సుల్తాన్‌తో ప్రధాని మోడీ చర్చలు

### గల్ఫ్ దేశంలో ప్రధానికి ప్రవాస భారతీయుల ఘనస్వాగతం

**మస్కట్(ఓమన్),డిసెంబరు 17:** భారత్ ఓమన్‌దేశాలమధ్య దశాబ్దాలుగా నెలకొన్న పరస్పర సహకారం ఇపుడు మరింత శక్తివంతం అవుతుందని, రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలపడి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టంచేస్తుందని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తంచేసారు. భారత్ ఓమన్ దేశాలమధ్య 70 యేళ్లుగాఉన్న దౌత్యబంధం మరింతముందుకు సాగుతోందని ఈ సందర్భంగా మోడీ ట్వీట్‌చేసారు. మోడీ తన పర్యటనలో ద్వైపాక్షికబంధంపై ఓమన్ సుల్తాన్‌తో సమగ్రచర్చలు జరిపారు. >>2

## 'అణుశక్తి'లోకి ఎఫ్‌డిఐలు

లోక్‌సభ ముందుకు బిల్లు

ప్రధాని మోడీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం

ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి వాయుకాలుష్యం

5లో



బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో రాష్ట్ర బిజెపి నేతలు

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో రాష్ట్ర బిజెపి నేతల భేటీ

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో ఏపి బిజెపి నేతలు భేటీ అయ్యారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్,రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయన్ను కలిశారు. సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఏపిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, అటల్ సందేశ్ యాత్ర వివరాలను నేతలు...అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. యాత్రలో టిడిపి,జనసేన నేతలు పాల్గొంటున్న విషయాన్ని తెలిపారు...మంచి పరిణామం అని ఆయన కితాబిచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలను భాజపా నేతలు అమిత్‌షాకు అందజేశారు.

# రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్లకు అభినందనలు

## - డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్లు అందరికీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు. 5 వ జిల్లా కలెక్టర్ల సదస్సులో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. 4 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేమామన్నారు. 1.20 లక్షల ఫాం పాండ్స్ తవ్వి లక్ష్యాలను చేరుకున్నామన్నారు. రూ. 4,330 కోట్ల మేర నిధులను వేతనాలుగా నరేగా నుంచి చెల్లించామని.. గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ ఆర్జనపై కూడా దృష్టి సారించామని చెప్పారు.గ్రామీణ స్థాయిలో పాలనా సామర్థ్యాల పెంపు కోసం కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

గిరిజన గ్రామాలకు వీలైనన్ని చోట్ల రహదారులు వేస్తున్నామన్న ఉపముఖ్యమంత్రి, గ్రామాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడం లక్ష్యమన్నారు. గ్రామపంచాయతీల్లో రెవెన్యూ ఆర్జనపైనా దృష్టి సారించామని మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపైనా కలెక్టర్లు దృష్టి పెట్టాలని పవన్‌కళ్యాణ్ అధికారులకు సూచించారు. కేంద్ర పథకాలు అమలులో వంద శాతం ఫలితాలు సాధించిన అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు.విజనరీ నేత చంద్రబాబు నేతృత్వంలో మన రాష్ట్రానికి ప్రత్యేకమైన ప్రాధాన్యతలను నిర్దేశించుకుని ముందుకు వెళ్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రతీ ప్రభుత్వ పాలసీ, నిర్ణయం ప్రజలను ప్రభావితం చేస్తుందని, అందుకే అత్యంత బాధ్యతాయుతమైన పాలన అందిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో వివిధ అంశాలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతీ జిల్లా జీఎస్డీపీ లక్ష్యాలను చేరుకుని ప్రగతి సాధించాలన్నారు.ఇకఉపముఖ్యమంత్రి వేరే రంగం నుంచి వచ్చినా పరిపాలనలో చక్కటి పనితీరు కనబరుస్తున్నారని ప్రశంసించారు. నియామకపత్రం తీసుకున్న ఓ కానిస్టేబుల్ తన ఊరికి రోడ్డు లేదని అడిగితే తన శాఖకు సమాచారం పంపి అదే వేదిక నుంచి ఆ రోడ్డుకు రూ.3.90 కోట్లు పవన్ మంజూరు చేయించారని తెలిపారు.

# బ్రాండ్ అంబాసిడర్లు

>> చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని అంశాల్లో ప్రజాప్రతినిధుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా నిత్య విద్యార్థిగానే ఉండాలని, నిరంతరం వివిధ అంశాలను తెలుసుకుంటూ అభివృద్ధిలో భాగస్వామి కావాలని చెప్పారు. కలెక్టర్ల సదస్సులో చర్చలు మొక్కుబడిగా సాగకుండా... అర్థవంతమైన సమీక్షలు, చర్చలు జరపాలన్నారు. ప్రజల్లో సంతృప్తిని పెంచేలా పౌరసేవలను అందించాలని కలెక్టర్లను కోరారు.

**ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం చూపాలి**

ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ప్రజా పాలనలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుగా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్సులను కూడా వేగంగా పరిష్కరించి పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచండి. లిటిగేషన్లపై ప్రజల్లో చైతన్యం పెంచి వాటిని పరిష్కరించుకునేలా అవగాహన పెంచుదాం. నీటి సమస్యలు, మద్దతు ధరలు లేకపోవటం, భూ వివాదాలు, విద్యుత్ బిల్లులు ఎక్కువ రావటం లాంటి సమస్యలు కూడా గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పెద్దఎత్తున వచ్చాయి. ఇప్పుడు మనం నీటి భద్రత తెచ్చాం, రైతులకు మెరుగైన ధరలు దక్కేలా చూస్తున్నాం.

విద్యుత్ ఛార్జీలు పెంచకపోగా... తగ్గించాం. వ్యవస్థలో ఉండే లోపాలను అడ్డుగా పెట్టుకుని కొందరు పనిచేయకుండా తప్పించుకుంటున్నారు. రెవెన్యూ శాఖలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఫైళ్లను పరిష్కరించుకుండా తమ వద్ద నుంచి వేరే వారికి పంపించేస్తున్నారు. ఇకపై ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం చూపాలి. డేటా డ్రివెన్ గవర్నెన్స్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతీ శాఖ ఆన్‌లైన్ ద్వారా ఫైళ్ల నడపాలి సేవలు అందించాలి. చేసిన పనిని సామాజిక మాధ్యమాల్లో అందరూ గొప్పగా చెప్పుకునే స్థాయిలో మన చర్యలు ఉండాలి" అని అన్నారు.

**పరిపాలనలో పవన్, లోకేష్ భేష్..**

ఇళ్లు లేని పేదలు, రైతులు, మహిళలు, చిన్నారులు, యువత ఇలా అన్ని వర్గాలకు మంచి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూలత వస్తుందని ముఖ్యమంత్రి సూచించారు. జీఎస్డీపీ, కేపీఐ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేలా చర్చించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల ద్వారా ఫలితాలు ఎలా వస్తున్నాయన్నదే ముఖ్యమని, మనం చక్కగా ప్రజలకు సేవలందిస్తున్నాం... కానీ మరింత సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. లోటుపాట్లను సవరించుకుంటేనే ప్రజల్లో సంతృప్తి వస్తుందన్నారు. 5,757 మందికి కానిస్టేబుళ్లుగా నియామక పత్రాలు ఇవ్వడం చాలా సంతోషమనిపించిందని సిఎం అన్నారు. ఉప ముఖ్యమంత్రి వేరే రంగం నుంచి వచ్చినా... పరిపాలనలో చక్కటి పనితీరు కనబరుస్తున్నారని, మంత్రి లోకేష్ గూగుల్ డేటా సెంటర్ విశాఖకు తీసుకువచ్చారని ప్రశంసించారు.

**సూపర్ సిక్స్... సూపర్ సక్సెస్..**

"సూపర్ సిక్స్‌ను సూపర్ సక్సెస్ చేశాం. పేదలకు ఆర్థికంగా అండగా ఉండేందుకే సూపర్ సిక్స్ పథకాలను తీసుకొచ్చాం. సామాజిక భద్రత పెన్షన్లను మొదటి తేదీనే అందిస్తున్నాం. తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రెండు విడతల్లో ఒక్కో రైతుకు రూ.14 వేలు ఇచ్చాం. దీపం2.0, స్త్రీశక్తి, మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాలు కూడా భర్తీ చేశాం. డ్వాక్రా, మెప్మాను ఇంటిగ్రేట్ చేస్తున్నాం. పెద్దఎత్తున గృహ నిర్మాణాలు చేపడుతున్నాం... అందరికీ ఇళ్లు అందేలా చేస్తున్నాం. పీ4 ద్వారా పేదలకు చేయూత అందించటమే లక్ష ్యం. ప్రివెంటివ్, క్యురేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్ మేనేజ్మెంట్ ద్వారా వైద్యారోగ్యాన్ని ప్రజలకు అందించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**వేగంగా అనుమతులు మన లక్ష్యం..**

విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అలాగే ఇప్పటివరకు రూ. 8.29 లక్షల కోట్ల పెట్టుబడులను ఎస్ఐపిబి ద్వారా ఆమోదించామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ పెట్టుబడులతో 23 లక్షలకు పైగా ఉద్యోగాలు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు. స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ హైడ్రోజన్ సిటీల ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని అన్నారు. వచ్చిన పెట్టుబడులకు అనుమతులు, భూ కేటాయింపుల విషయంలో కలెక్టర్లు కూడా వేగంగా స్పందించాలని సిఎం సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి సుస్థిరమైన పాలన అందిస్తున్నారని, ఇప్పుడు ప్రపంచం అంతా భారత్ గురించి ఆలోచన చేయకుండా ముందుకు వెళ్లటం లేదని సిఎం తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీకి వెన్నుముక ఐటీ రంగమని... ఇందుకు అవసరమైన ఐటీ నిపుణులకు రాష్ట్రంలో లోటు లేదన్నారు.

**పిపిపిలో నిర్మిస్తే ప్రైవేట్ పరం కాదు..**

జిల్లాల కలెక్టర్ల సమావేశంలో పిపిపి పద్దతిలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై సిఎం స్పష్టత ఇచ్చారు. పిపిపి ద్వారా వైద్య సేవలు మరింత మెరగవుతాయని అన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేసేశారని కొందరు మాట్లాడుతున్నారని... అయితే పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్నా... అవి ప్రభుత్వ కళాశాలల పేరుతోనే నడుస్తాయని చెప్పారు. మెడికల్ కాలేజీల నిబంధనలు కూడా రాష్ట్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుందని స్పష్టం చేశారు. 70 శాతం మందికి ఎన్టీఆర్ వైద్య సేవలు ఆయా కళాశాలల్లోనే అందుతున్నాయని, సీట్లు కూడా పెరిగినట్టు వివరించారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించి డబ్బులు వృధా చేశారని, అవే డబ్బులతో రెండు మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయి ఉండేదని చెప్పారు. రుషికొండ ప్యాలెస్ నిర్వహణ ఇప్పుడు ప్రభుత్వానికి భారంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పిపిపి కింద ప్రాజెక్టులు చేపడుతోందని అన్నారు. రోడ్లను పిపిపి ద్వారానే నిర్మిస్తున్నారని... అలాగని అది ప్రైవేటు వ్యక్తులది అయిపోతుందా అని సిఎం ప్రశ్నించారు. విమర్శలు చేస్తే భయపడేది లేదని, వాస్తవాలన్నీ ప్రజలకు తెలియ చేయాలన్నారు.

# అన్నీ ఇక ఇ-ఫైళ్లే..

>> అవసరం ఎంతమాత్రం లేదని భాస్కర్ కాటంనేని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రతి సర్టిఫికెట్‌ను బ్లాక్ చైన్ టెక్నాలజీతో తనిఖీ చేసి డిజీవెరిఫైలో పెట్టామన్నారు. ప్రజలైనా, అభ్యర్థులైన అప్‌లోడు చేసిన తమ సర్టిఫికెట్లను అధికారులు అప్పటికప్పుడే డిజీవెరిఫైలో బ్లాక్ చైన్ టెక్నాలజీలో సులభంగా తనిఖీ చేసుకోవచ్చని చెప్పారు. ప్రధానంగా ఏపీపీఎస్సీ, సంక్షేమ శాఖలు దీన్ని విస్తృతంగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ప్రతి సారీ సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులు, ప్రజలు ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని పాత మార్కుల జాబితాలను కూడా ఇప్పుడు స్కాన్ చేసి డిజిటలీకరణ చేస్తున్నామని చెప్పారు.

**డేటా లేక్ సిద్ధం..**

ఆర్టీజీఎస్‌లో డేటా లేక్ సిద్ధంగా ఉందని, ప్రభుత్వంలో వివిధ శాఖలు తమ పనితీరు మరింత సులభతరం చేసుకోవడానికి వీలుగా ప్రస్తుతం తాము 98 యూస్ కేసెస్ రూపొందించే ప్రయత్నం జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో రోజువారి పాలనకు సంబంధించి పలు సమస్యలను ఎదుర్కొంటుంటారని క్షేత్రస్థాయిలో రోజువారీ పాలన మరింత సులభతరం చేసేలా ఎలాంటి యూస్ కేసెస్ అవసరమని భావిస్తున్నారో ఆర్టీజీఎస్‌కు తెలియజేస్తే తాము ఆ దిశగా ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. అలాగే అవేర్‌ను ఇప్పుడు రియల్ టైమ్‌లో లైవ్‌లో ఉంచామని తెలిపారు. దీన్ని జిల్లా కలెక్టర్లు నిరంతరం పరిశీలించాలని, తమ తమ జిల్లాలో భూగర్భజలాల నుంచి నీటి లభ్యత, వాతావరణం మార్పులు, సాయిల్ హెల్త్, తదితర అన్ని విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తదనుగుణంగా వ్యవహరించాలని కోరారు.

# రాష్ట్రంలో 3వేల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

## విద్యార్థులందరికీ సకాలంలో హెల్త్ చెకప్‌లు చేయండి: కలెక్టర్లకు సూచించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** డ్వాక్రా గ్రూపుల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో కనీసం రూ.లక్ష కోట్ల మేర పెట్టుబడులు రావాలన్నారు. రూ. 20 లక్షలకోట్ల పెట్టుబడులు సాకారం అయితే... 22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి అన్నారు. దావోస్‌కు వెళ్లేముందుగా 538 ఎంఒయూలు, రూ.11.38 లక్షలకోట్ల పెట్టుబడులు గ్రౌండింగ్ ప్రాసెస్ మొదలు కావాలి అన్నారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు వస్తాయి. మంత్రులు, కలెక్టర్లు సంయుక్తంగా ఈ ప్రాజెక్టులను లాంచ్ చేసేలా కృషి చేయాలి అన్నారు. ఈ ప్రాజెక్టులన్నిటికీ భూసేకరణ అత్యంత కీలకం... మేం ప్రభుత్వంలో ఉండగా ఎప్పుడూ భూవివాదాలు రాలేదు. భూములిచ్చే వారు కూడా సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణలో ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. సేవల రంగం కూడా మరింతగా వృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. చాలా ప్రాంతాల్లో పర్యాటకం అభి వృద్ధి చెందాలంటే హోటళ్లు కూడా పెద్ద ఎత్తున నిర్మితం కావాలన్నారు. గిగ్ వర్కర్ల కోసం వర్క్ ఫ్రమ్ హోం సదుపాయాలు కల్పించేలా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగాల కల్పన ఎలా చేయగలం అనే అంశంపై యాక్షన్‌ప్లాన్ చేయండి... ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాప కుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మారకానికి మచిలీపట్నంలో 2 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు సమీపంలోనే టౌన్ షిప్ అభివృద్ధి చేయండి.ఇక సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమ లుకు సంబంధించి ఓ క్యాలెండర్ రూపొందించాలి. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజలు సంతృప్తిచెందాలి. పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగు తోన్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయండి. హాస్టళ్లలో విద్యార్థులకు ఏం జరిగినా ముందు సస్పెండ్ చేస్తాను,ఆ తర్వాత మాట్లాడ తాను. జిల్లా కలెక్టర్లు సంక్షేమహాస్టళ్లలో నిద్రచేయాలి. విద్యార్థులందరికీ హెల్త్ చెకప్‌చేయండి. రక్త హీనత సహా వేర్వేరు ఇబ్బందులు గుర్తించండి. 7,8,9,10, ఇంటర్ విద్యార్థులకువారిలో ఒత్తిడిని తగ్గించేందుకు వీలుగా యోగా, ధ్యానం వంటి వాటిని అమలుచేయండి. పాఠశాలల్లో క్రీడలు తప్పనిసరి. రోజూవారిని ఆడించేలా చర్యలు తీసుకోవాలి. గిరిజన విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీలకు ఎంపికయ్యారు. సంక్షేమ శాఖల ద్వారా వెనుకబడిన విద్యా ర్థుల కెరీర్ ప్లానింగ్ చేస్తే విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. ప్రకృతితో మమేకం కావడానికి గిరిజన సంప్రదాయా లను చూసేందుకు పర్యాటకం పెరిగే అవకాశం. బ్రాహ్మణ కార్పోరేషన్‌లోనూ మంచి ప్రయోగం చేశారు అన్నారు.

# భారత్, ఒమన్ మధ్య 7 దశాబ్దాల బంధం

>> వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, రక్షణరంగం, భద్రత, టెక్నాలజీ, వ్యవసాయం, సాంస్కృతికరంగాల్లో పరస్పరసహకారం వంటివాటిపై ఇరువురునేతలు విస్తృత చర్చలుజరిపారు. మూడుదేశాలపర్యటనల్లో ప్రధానిమోడీ జోర్డాన్, ఇథియోపియాల్లో తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని గల్ఫ్‌దేశం ఒమన్‌కు చేరారు. ఒమన్ డిప్యూటి ప్రధాని రక్షణ మంత్రి సయ్యిద్ షిహాబ్ బిన్ తారిక్ అల్‌సైద్ ప్రధానిని సాదరంగా స్వాగతం పలికి తోడ్కొనివెళ్లారు. మస్కట్‌ఎయిర్‌పోర్టులోనే ప్రధానిమోడీ గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా మోడీ తన సోషల్‌మీడియాలో భారత్‌లో చరిత్రాత్మక సంబంధాలు కలిగి ఉన్న గల్ఫ్‌దేశంలో పర్యటించడం ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొంటూ రెండుదేశాల భాగస్వామ్యం సరికొత్త దిశలను నిర్దేశిస్తుందని ఆకాంక్షను వ్యక్తంచేసారు. భారత్ ఒమన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలోభాగంగానే ప్రధానిమోడీ ఒమన్‌లో రెండోసారి పర్యటించారు. 2023 డిసెంబరులోనే ఒమన్ సుల్తాన్ హైథమ్‌బిన్ తారిక్ పర్యటనలోనే ప్రధానిమోడీని తమ దేశ పర్యటనకు రావాలని ఆహ్వానించారు. ఒమన్‌లోనే భారత సంతతికి చెందిన కుటుంబాలను కూడా కలుసుకుని వారినుద్దేశించి ప్రసంగిస్తారు. విదేశాల్లో ఉన్న భారత సంతతి కుటుంబాలే మన దేశానికి బ్రాండ్ అంబాసిడర్లు అని భారత అభివృద్ధిని తమ దేశాల్లో వివరించి చాటిచెప్పాలని, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రగతిని ప్రపంచం దశదిశల వ్యాప్తిచేసేందుకు ప్రవాసభారతీయులే కీలకమని అన్నారు. భారత్‌లో ఒమన్ రాయబారి షేక్ హమైద్ బిన్ అలీబిన్‌సుల్తాన్ ఆల్‌మణి మోడీ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను కీలక మైలురాయికి చేర్చిందని, రెండుదేశాలమధ్య దౌత్యబంధాలు 70 సంవత్స రాలు పూర్తిచేసుకోవడం చరిత్రాత్మకమని రాయబారి పేర్కొన్నారు. మస్కట్ ఎయిర్‌పోర్టులో ప్రధానిమోడీకి ప్రవాసభారతీయులు ఘనస్వాగతం పలికారు. మోడీ మోడీ అంటూ నినాదాలుచేయడంతోపాటు భారత్‌మాతాకి జై, వందే మాతరం అంటూ నినాదాలతో హోరెత్తించారు. అంతకుముందు ఇథియోపియా పర్యటనలో ప్రధానిమోడీ పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి ప్రసంగించడంతో పాటు ఆదేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ఎయిర్‌పోర్టులో ప్రధానిమోడీని రిసీవ్‌చేసుకోవడంతో పాటు ఎయిర్‌పోర్టుకు మోడీని ఇథియో పియా ప్రధాని ఇలియాస్‌అబ్బీ అలి స్వయంగా కారు నడుపుకుంటూ తోడ్కొని వెళ్లి వీడ్కోలు పలికారు.

## వారం - వర్జ్యం

18-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
చతుర్దశి తె.4.59
అనూరాధ రా.8.05, మూల కార్తె
వర్జ్యం : రా.2.20-తె.4.07
దు.ఉ.10.13-10.58
2) మ.2.40-3.25
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** క్రీడలయందు ఆసక్తి కలిగి వుంటారు. బాధ్యతలు సక్రమంగా నిర్వ హిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం:** సంఘంలో గుర్తింపు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. ప్రయాణాలు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు.

**మిథునం:** గృహనిర్మాణ ఆలోచనలు కొనసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**కర్కాటకం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి.స్వల్ప ధనలాభం పొందుతారు.

**సింహం:** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్త్ర లాభం.

**కన్య :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.ప్రయాణాలు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సకాలంలో ఋణాలు తీరుతాయి.స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం:** చేపట్టిన పనులు సవ్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం:** కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




బుధవారం పొగమంచుతో నిండిపోయిన ఢిల్లీ నగరం

# ఇక జిల్లాల పర్యటనకు ముఖ్యమంత్రి

**విజయవాడ,డిసెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇకపై జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు.ఈ విషయాన్ని ఆయననే స్వయంగా వెల్లడించారు. మూడు నెలల్లో పట్టణాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వచ్చే త్రైమాసికానికి జీరో గ్రీవెన్సులు లక్ష్యంగా పనిచేయాలని సూచన చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఏమాత్రం జాప్యం సహించేది లేదని,'జీరో టాలరెన్స్' విధానంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారుల పనితీరును పరిశీలించేందుకు జనవరి నుంచి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతానని ఆయన హెచ్చరించారు. కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ శాఖలో ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయో విశ్లేషణ చేసి, పాలనను మెరుగుపరచాలన్నారు. గ్రీవెన్సులు తక్కువగా వస్తేనే పాలన బాగున్నట్లు లెక్క అని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే త్రైమాసికానికి 'జీరో గ్రీవెన్సు'లను లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మురుగు కాలువలను రాబోయే మూడు నెలల్లోగా పూర్తిగా శుభ్రపరిచేందుకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే జలవనరుల శాఖ వెంటనే స్పందించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. నీటి భద్రత గురించి మాట్లాడుతున్న తరుణంలో ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండకూడదని చంద్రబాబు తేల్చిచెప్పారు .

# శ్రీచరణికి 2.5 కోట్ల నజరానా

>> నగదు ప్రోత్సాహంతో పాటు విశాఖలో 500 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించింది. డిగ్రీ పూర్తయిన తర్వాత గ్రూప్1 హోదా ఉద్యోగాన్ని కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, క్రీడా శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలోని వీరపునాయునిపల్లె మండలం యర్రమల్లపల్లె గ్రామానికి చెందిన మహిళ క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణిది మధ్య తరగతి కుటుంబం. పల్లె నుంచి వచ్చినా క్రికెట్ అంటే అమితమైన ఇష్టం తనకి. నిజానికి తొలి రోజుల్లో అథ్లెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆడింది. ఆ తర్వాత ఆమె క్రికెట్ వైపు దృష్టి సారించింది. మొదట్లో తండ్రి ఒప్పుకోలేదు. అయినా ఆమె క్రికెట్ ఆడడం మానలేదు. గట్టిగా పట్టుబట్టి మరి నేర్చుకుంది. అబ్బాయిలతో కలిసి గల్లీ క్రికెట్ ఆడుతూ, డిఎవి మైదానంలో తన మామయ్య కిషోర్ కుమార్ రెడ్డితో కలిసి సాధన చేసేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీలంకతో వన్డేతో శ్రీచరణి అరంగేట్రం చేసింది. ఆపై ఇంగ్లాండ్‌తో వన్డేలతో పాటు టి20ల్లోనుకూడా చోటు దక్కించుకుంది. వాటిల్లో తన ప్రదర్శనని చూసి సెలక్టర్లు మెచ్చారు. దాంతో వరల్డ్‌కప్ జట్టులో చోటు కల్పించారు.

# హజ్ యాత్రికులకు లక్ష సాయం

>> నమోదు చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక పర్యవేక్షణలో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నారని హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విజయవాడను అధికారిక ఎంబార్కేషన్ పాయింట్‌గా ఆమోదించడంతో ఈ సౌకర్యం సాధ్యమైంది. గత హజ్‌లో విజయవాడను ఎంచుకున్న 72 మంది హాజీలకు కూడా లక్ష రూపాయలు అందజేశారు. ఈ నిర్ణయం ముస్లిం సోదరుల్లో ఆనందాన్ని నింపుతోంది. హజ్ యాత్రికులు విజయవాడ సెంటర్‌ను ఎక్కువగా ఎంచుకోవాలని హజ్ కమిటీ కోరుతోంది. ఇది రాష్ట్ర మైనారిటీ సంక్షేమంలో కీలక మైలురాయని బాషా చెప్పుకొచ్చారు.

# ఎన్‌కౌంటర్లపై హైకోర్టు విచారణ

>> యపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చట్టబద్దంగా జరగాల్సిన మెజిస్టీరియల్ విచారణ ఇప్పటికే మొదలైందని, దర్యాప్తు సంస్థలు నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాయని ఎజి కోర్టుకు తెలిపారు. ఇదిలా ఉంటే.. అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ధర్మాసనం, ఈ విషయంలో మరింత లోతుగా అధ్యాయనం చేయాలని పిటీషనర్ తరుపు న్యాయవాదిని ఆదేశించింది.

## గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల అటెండెన్స్‌పై

# సిఎం చంద్రబాబు అసహనం

**విజయవాడ,డిసెంబరు 17.ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల అటెండెన్స్‌పై సీఎం చంద్రబాబు నాయుడు అసహనం వ్యక్తం చేసారు.. వారికి 74 శాతం మాత్రమే అటెండెన్స్ ఉండడంపై మండిపడ్డారు. దీనిని ఎవ్వరూ అలసుగా తీసుకోవడానికి వీలు లేదన్నారు. గత ఏడాదికి సంబంధించి ప్రతి ఒక్కరి అటెండెన్స్ తన వద్ద ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఒక గంట రాలేదు, ఒక రోజు రాలేదు.. అత్యవసరం అయితే ఒకే అని తెలిపారు.ఫీల్డ్ విజిట్‌కి వెళ్లితే ఆ విషయాన్ని ముందుగా కార్యాలయ సిబ్బందికి తెలియజేయాల్సి ఉందన్నారు. అలవాటుగా విధులకు రాకుండా ఎవరు ఉంటున్నారో వారిని గైడ్ చేయాల్సి ఉందని చెప్పారు. అప్పటికి వారు సెట్ కాకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాంటి వారిపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయని చెప్పారు. అలవాటుగా మారితే చూస్తే ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. వారి అటెండెన్స్‌ను పర్యవేక్షించాలంటూ జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం నాడు సమీక్ష జరిపారు. కొన్ని శాఖలు, కొన్ని జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం సరికాదని సీఎం చంద్రబాబు అన్నారు. ఖర్చు పెట్టకుండా మిగిలిపోయిన కేంద్ర నిధులను జనవరి 15వ తేదీ నాటికి ఖర్చు పెట్టాలని అధికారులకు సిఎం సూచించారు.

# ఎసిబికి చిక్కిన విలేజ్ సర్వేయర్

**పుంగనూరు రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పుంగనూరు రూరల్ మండలంలోని మంగళం పంచాయతీకి చెందిన భూమి సర్వే కోసం లంచం తీసుకుంటూ విలేజ్ సర్వేయర్ శ్రీరాములు బుధవారం ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళం పంచాయతీకి చెందిన ఉమా శంకర్ తన భూమి సర్వేకోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే సర్వేయర్ శ్రీరాములు సర్వే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి అంగీకరించి ఉమాశంకర్ బుధవారం అడ్వాన్స్ లంచం రూ 20వేలు ఇవ్వడానికి సిద్ధం చేసుకుని ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ కార్యాలయంలోనే విలేజ్ సర్వేయర్‌కు డబ్బు లంచం ఇచ్చే సమయంలో ఎసిబి అధికారులు ప్రవేశించి ప్రత్యక్షంగా పట్టుకున్నారు. ప్రభుత్వాలు మారినా లంచాల వ్యవహారం పుంగ నూరులో మారలేదనడానికి ఈ సంఘటన ప్రత్యక్ష ఉదాహరణ. పట్టుబడిన విలేజ్ సర్వేయర్‌ను అధికారులు నెల్లూరు కోర్టుకు తరలించారు.

# హిజాబ్ వివాదంపై యుపి మంత్రి దుమారం!

**పాట్నా, డిసెంబరు 17:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక మహిళా డాక్టర్ హిజాబ్‌ను తొల గించిన ఉదంతం దేశ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ ఘటనను సమర్థిస్తూ ఉత్తరప్రదేశ్ క్యాబినెట్ మంత్రి సంజయ్ నిషాద్ చేసిన అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు మరింత ఆజ్యం పోశాయి. నితీష్ కుమార్ చర్యను వెనకేసుకొస్తూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. పాట్నాలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్ర మంలో నితీష్‌కుమార్ నూతనంగా ఎంపికైన ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో నుస్రత్ పర్వీన్ అనే మహిళా డాక్టర్ వేదికపైకి రాగా ఆమె ధరించిన హిజాబ్‌ను చూసిన నితీష్ కుమార్ ఏమిటిది అన్నట్లుగా సైగ చేశారు. ఆమె స్పందించేలోపే ఆయనే స్వయంగా ఆమె హిజాబ్‌ను కిందకు లాగి ముఖం కనిపించేలా చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నితీష్ కుమార్ మానసిక స్థితిపై ప్రతిపక్షాలు ప్రశ్నలు కురిపించాయి.

## ఎఎన్నార్ కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు రూ.2 కోట్ల విరాళం : నాగార్జున

**గుడివాడ,డిసెంబరు 17,ప్రభాతవార్త:** తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) చదువుకోక పోయినా వేల మందికి బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు కృషి చేశారని ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాలలో రూసా భవనాన్ని నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959లో కళాశాలకు ఏఎన్నార్ రూ.లక్ష విరాళం అందించారన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం తమ కుటుంబం తరపున రూ.2 కోట్ల విరాళం అందిస్తున్నట్లు నాగార్జున ప్రకటించారు. మనుషులు శాశ్వతం కాదని, మనం చేసే పనులు శాశ్వతమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంఎల్ఏ వెనిగండ్ల రాము పాల్గొన్నారు.

## ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ లోగో జాకెట్ ఆవిష్కరణ

**విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ పేరిట జరుగుతున్న కార్యక్రమంలోస్వర్ణోత్సవ లోగో జాకెట్‌ను రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఖిఉర్దూ వారోత్సవాలఖిలో భాగంగా ఇబ్బందికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ అధికారులు, పాల్గొన్నారు.

## సిబిఐ పేరుతో సీనియర్ సిటిజన్‌కు బెదరింపులు

### ఎస్‌బిఐ అప్రమత్తతో తప్పిన సైబర్‌మోసం

**తిరుపతి,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ సిటిజన్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్‌మోసగాళ్ళు నకిలీ సిబిఐ అధికారి పేరుతో బెదిరింపులకు పాల్పడ్డారు. అతను వెంటనే ఎస్‌బిఐ అధికారులను కలసి తెలియజేయడంతో అప్రమత్తమైన బ్యాంకు సిబ్బంది వల్ల భారీ సైబర్‌మోసం తప్పింది. తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో (66)సంవత్సరాల విశ్రాంత ఉద్యోగికి ఒక వ్యక్తి ఫోన్‌చేసి, సిబిఐ అదికారి పేరుతో పరిచయం చేసుకున్నాడు.ఫిర్యాదిదారి ఫోన్‌నంబర్ ద్వారా మహిళలకు అనుచిత మెసేజ్‌లు పంపించారని, దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు అయిందని భయపెట్టాడు. వెంటనే బెంగుళూరుకు రావాలని ఒత్తిడిచేశాడు. యధాతథంగా ఇంట్లో ఎవరికీ చెప్పకూడదని, గదిలోకి వెళ్ళి లాక్‌చేసుకుని మాట్లాడాలని బెదిరించాడు. దీనిపై ఫిర్యాదిదారుడు ఇప్పటికే 40లక్షలు రూపాయలు వివిధ సైబర్‌నేరగాళ్ళ ఖాతాల్లో జమచేశాడు. అనంతరం మరింత మొత్తాన్ని ఆర్‌టిజిఎస్ ద్వారా పంపేందుకు ఇస్కాన్ శాఖను సంప్రదించాడు. అంత పెద్దమొత్తాన్ని ఇతర రాష్ట్రాల్లోని ఖాతాలకు పంపేందుకు కారణాలను అనుమానంపై ఎస్‌బిఐ శాఖ సిబ్బంది లీలాకృష్ణ, కృష్ణారెడ్డి ఆరా తీశారు. చివరకు ఇది గ్రహించిన బ్యాంకు అధికారులు వెంటనే లావాదేవీలు నిలిపివేసి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. దీనిపై జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఆదేశాలివ్వడంతో సమయస్ఫూర్తితో డిజిటల్ అరెస్ట్ నకిలీదని, ఎలాంటి యాప్‌లకు, బెదిరింపుకాల్స్‌కు భయపడకూడదని తెలిపారు. దీంతో నగదు భద్రమైంది.

## తిరుపతి,తిరుచానూరు ఆలయాల్లో సేవలపై భక్తుల అభిప్రాయాలు!

### - సూచనలకు అనుగుణంగా మరింత మెరుగ్గా నిర్వహణ



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** దేశవిదేశాల నుండి తిరుమలేశుని దర్శనానికి వస్తున్న అశేష సంఖ్యలో భక్తులు వారి యాత్రలో తొలుత తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయాన్ని, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయాన్ని సందర్శిస్తున్నారు. తిరుచానూరులో కొలువైన దేవేరి,శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతిఅమ్మవారిని రోజువారీగా పదివేలమందికిపైగా భక్తులు దర్శించుకుంటున్నారు. మరీ శుక్ర,శని,ఆదివారాల్లో ఈ సంఖ్య మరింతగా పెరుగుతుంది. అలాగే వేంకటేశ్వరస్వామికి అన్నగా పిలువబడే తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని కూడా భక్తులు రోజువారీగా ఐదారువేలమంది వరకు దర్శించుకుంటున్నారు. వీరందరికీ ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు నిరంతరాయంగా అమ్మవారి, స్వామివారి మూలవిరాట్టు దర్శనం టిటిడి అధికారులు చేయిస్తున్నారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలను కొంతవరకు పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఆలయా లకు అనుబంధంగా మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇప్పుడు ఈ సేవలపై భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేయాలని టిటిడి అధికారులు నిర్ణయించారు. ఆలయంలోపల దర్శన విధానం, ప్రసాదాల వితరణ ,ఇంకా మెరుగైన దర్శనం చేయించడానికి సలహాలు సూచనలు తీసుకోవాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే కలియుగవైకుంఠం తిరుమలలో ఈ తరహాలో భక్తుల నుండి పలురకాల అభిప్రాయాలు సేకరణ చేయడం, వాటిద్వారా విలువైన సమాచారంతో మెరుగైన సేవలందించేలా చూడటంభక్తులు హర్షం వ్యక్తంచేస్తున్న విషయం విదితమే. తిరుమలేగాక టిటిడి ప్రధాన స్థానిక ఆలయాలు తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయం, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయాల వద్ద కూడా ఇదే తరహాలో భక్తులకు సేవలను మరింత మెరుగుపరచడానికి ఉద్దేశించి విలువైన అభిప్రాయాలను భక్తుల నుండే టిటిడి సేకరించాలని సూచించారు. వివిధ రకాల అభిప్రాయ సేకరణ సర్వేలను టిటిడి ఇందుకు సన్నద్ధమవుతోంది. ఆయా ఆలయాల్లో సేవలందించే శ్రీవారిసేవకులు ఆలయం ముందు, ఆలయం పరిసరాల్లో, అన్నప్రసాదం కాంప్లెక్స్, ప్రసాదాల కౌంటర్‌ల వద్ద అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. టిటిడి ఐవిఆర్‌ఎస్, వాట్సాప్,శ్రీవారిసేవకుల ద్వారా భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరిస్తోంది. దర్శనం బాగా జరిగిందా,ప్రసాదాల నాణ్యత, ఇతరత్రా సేవలపై శ్రీవారిసేవకులు భక్తులను అడిగి వారినుండి అభిప్రాయం తీసుకోనున్నారు. భక్తులు కూడా స్వేచ్ఛగా వారి అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కలగనుంది. భక్తులు ఈ విధానంలో అభిప్రాయాలు, ఫిర్యాదులు, సలహాలు ఇస్తే టిటిడి ఉద్యోగులు, అధికారుల్లో బాధ్యతను పెంపొందించేలా మారనుంది.త

## ప్రైవేట్ హోటల్‌కు టిటిడి స్థలం ధారాదత్తం మంచిదికాదు

### - టిటిడి మాజీ ఛైర్మన్ భూమన ఆగ్రహం



**తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలను ఆనుకునే ఉన్న టిటిడి స్థలాన్ని ఓ ప్రైవేట్ హోటల్‌కు 20ఎకరాలు ధారాదత్తం చేయడం మంచిదికాదని టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. టిటిడి స్థలం గజం 49వేల రూపాయలని, ఎకరాకు 29కోట్ల రూపాయలు విలువచేసే 20 ఎకరాలు 460 కోట్లరూపాయలు విలువైన భూములను చంద్రబాబు దోచిపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరికి అత్యంత సమీపంలో ఈ భూములను టిటిడి పర్యాటకశాఖ నుండి తీసుకుని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం అక్కడ జరుగుతున్న పనులను భూమన కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. పర్యాటకశాఖ భూమి తీసుకుని టిటిడి ఒబెరాయ్ గ్రూప్‌కు కట్టబెట్టడం దారుణమన్నారు. ఈ విషయంపై ఈనెల 11వతేదీ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని 13వతేదీ జిఒ ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. పర్యాటకస్థలం ఎకరా 90లక్షలు రూపాయలు మార్కెట్ విలువ ఉంటే టిటిడి గజం 49వేల రూపాయలకు ఎకరాలకు 29కోట్ల విలువచేసే 20 ఎకరాలు 460కోట్లకే దోచిపెట్టారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో దీనివిలువ మూడుకోట్ల రూపాయలు ఉంటుందని భూమన తెలిపారు. కోహినూర్ వజ్రంకంటే ఎక్కువ ధర టిటిడి స్థలమని, దీనికి విలువ కట్టలేమన్నారు. పర్యాటకశాఖ నుండి టిటిడి తీసుకున్న స్థలం విలువూ 18కోట్ల రూపాయలు మాత్రమేనని అయితే అంత విలువైన భూములను ఒబెరాయ్ పేరువారుచ్చుకున్న మాత్రాన ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. అలిపిరి వద్ద అనుమతులు లేకుండా అక్కడ పనులు జరుగుతున్నాయని, ఎర్రచందనం వృక్షాలను కూడా నరికివేస్తున్నారని, ఆ దుంగలు ఏమయ్యాయని కరుణాకర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎకోసెన్సిటివ్ జోన్‌పరిధిలో ఈ భూమి ఉందని, రెవెన్యూస్థలాలు ఇచ్చే అవకాశం ఉన్నా టిటిడి స్థలం ఎందుకు ఇవ్వాలని దుయ్యబట్టారు. వేంకటేశ్వరస్వామి స్థలం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆయన ఆందోళన చెం దారు. ప్రత్యేక అగ్రి మెంట్ వెనుక అవినీతి దాగి ఉందన్నారు.

ఈ విషయంపై డిసిఎం పవన్‌కల్యాణ్ కూడా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామీజీలు, పీఠాదిపతులు దీనిపై స్పందించాలని,పోరాటం చేయాలని అన్నారు. ప్రైవేట్ హోటల్‌కు స్థలం ఇవ్వడం వల్ల టిటిడికి వచ్చిన ఆదాయం ఏమిటని, దీని వల్ల రూపాయి కూడా ఆదాయంలేదన్నారు. రెండుకోట్ల రూపాయలు భవనం ఫీజు మాఫీ చేశారని, 26కోట్ల రూపాయలు స్టాంప్ డ్యూటీ మాఫీచేసేశారని మండిపడ్డారు.వంద గదులు ఒబేరాయల్ హోటల్ వస్తే 1,500మందికి ఉద్యోగాలు ఎలా వస్తాయని ఆయన అనుమారం వెలిబుచ్చారు. తిరుమల పరకామణి దొంగతనం కంటే ఇదీ పెద్ద దోపిడీ వ్యవహారమని ఆయన మండిపడ్డారు.టిటిడి స్థలం ధారాదత్తం చేయడం వల్ల ఎవరికి లాభమని సూటిగా ప్రశ్నించారు.వందగదులు ఉంటే ఆ సంస్థ 1,500మందికి ఉద్యోగాలు ఎలా ఇస్తుందని అన్నారు. బుధవారం ఉదయం ఆ స్థలాన్ని భూమన పరిశీలించారు. ఈనెల 5వతేదీ రిజిస్ట్రేషన్ చేసినా ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు.

## పట్టు రైతులకు అండగా ప్రభుత్వం

### - పెండింగ్ స్టేట్ షేర్ నిధుల విడుదలతో పట్టు పరిశ్రమకు ప్రయోజనం : వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం పట్టు రైతుల పక్షాన అండగా నిలిచి, గత ప్రభుత్వ హయాంలో, ప్రభుత్వ సహాయం అందక, నిరక్ష్యం పాలైన పట్టు రైతులకు పెండింగ్ నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సిల్క్ సమగ్ర-2 పథకం కింద 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబంధించిన వివిధ పథకాల కోసం పట్టు పరిశ్రమల శాఖకు రాష్ట్ర వాటా (మ్యాచింగ్ స్టేట్ షేర్)గా రూ.14 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ మొత్తంలో నుంచి రూ.13.75 కోట్లకు సంబంధించిన బిల్లులు గుంటూరు పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి సమర్పించగా, లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు విజయ వంతంగా పూర్తయ్యాయని తెలిపారు. 2021-22 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న స్టేట్ షేర్ నిధులను క్లియర్ చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా రైతుల కోసం పనిచేసే ప్రభుత్వం తమదని ఆయన స్పష్టం చేశారు. ఈ నిధుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 13,663 మంది సిల్క్ రైతులు లబ్ధి పొందారని, మల్బరీ తోటల అభివృద్ధి, పట్టు పురుగుల పెంపక షెడ్లు, కిసాన్ నర్సరీలు, డిస్ఇన్‌ఫెక్టెంట్లు, రీరింగ్ పరికరాల సరఫరా, ట్విస్టింగ్ యూనిట్లు, బేసిన్ మోంటెడ్ రీలింగ్ యూనిట్లు, ఐఎఆర్ఎం కార్యక్రమాలు, ప్రైవేట్ గ్రైనేజ్‌ల ఏర్పాటు వంటి అనేక భాగాల కింద వ్యయం చేసినట్లు తెలిపారు. సకాలంలో నిధుల విడుదలతో పట్టు పరిశ్రమ రంగానికి కొత్త ఉత్సాహం లభించిందని, సిల్క్ రైతుల ఆదయం పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పట్టు రైతులకు, పట్టు రీలర్లకు అన్ని విధాలా అండగా

## అనాధ శరణాలయ నిర్వాహకుడి దాష్టీకం

### - విద్యార్థి చేయి గాయపరిచిన వైనం



**చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త** అనాధ పిల్లలే కదా అడిగేవారెవరులే అనుకొన్నాడా నిర్వాహకుడు...అన్యం పుణ్యం తెలియని బాలుడిని చితకబాది అరచెయ్యిని పగులగొట్టేశాడు...ఇంకేమి చేస్తాడో అన్న భయంతో వేసుకొన్న నిక్కరుతోనే సొంత గ్రామానికి చేరుకున్నాడా బాలుడు...బాలుడి కథనం మేరకు...చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పంచాయతీ కేంద్రం పుదిపట్లలో సంజోత్ అనే ఆశ్రమాన్ని నిరంజన్‌రెడ్డి అనే అతను నడుపుతున్నాడు. కుటుంబంలోని తల్లిదండ్రులు, ఎవరో ఒకరిని కోల్పోయిన వ్యక్తుల పిల్లలు, చదువుకొనే స్థోమత లేని పిల్లలు ఈ ఆశ్రమంలోకి చేరదీస్తున్నారు. ఈక్రమంలో చిత్తూరు సంతపేటకు చెందిన ప్రకాష్ కుమారుడు ఆదిత్య(13) ఇదే ఆశ్రమంలో వున్నాడు. ఇక్కడే వుంటూ పుదిపట్ల ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గత రెండు రోజులుగా బాలుడు పాఠశాలకు రాకపోవడంతో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఆరా తీసింది. నిర్వాహకుడు నిరంజన్‌రెడ్డిని విచారించే ప్రయత్నం చేయగా అతని నుంచి దురుసుగా సమాధానం రావడంతో జరిగిన ఉదంతం బయటకు వచ్చింది. ఆశ్రమంలో అనాధ పిల్లలచేత పశువులు, కోళ్ళను మేపించడం, వాటి వ్యర్థ పదార్థాలను ఊడిపించడం వంటి కార్యక్రమాలను చేయిస్తున్నాడనీ, పిల్లలు ఒప్పుకోకుంటే దారుణంగా బాదుతున్నాడని ఆదిత్య సామాజిక మాధ్యమం ద్వారా వివరించాడు. తనను కోళ్ళవ్యర్థ పదార్థాలు తీయలేదని చితకొట్టాడనీ, చెయ్యి అడ్డు పెడితే పగిలేలా ఇనుప ఊచతో కొట్టగా భరించలేక పారిపోయి వచ్చేశానని మాధ్యమంలో తెలిపాడు. తాను వేసుకొన్న నిక్కరుతోనే సొంత గ్రామానికి చేరుకొన్నానని తెలిపాడు.

తనతోపాటు అక్కడున్న పిల్లలకు ఇదే పరిస్థితి వుందనీ, వారందరినీ ఆదుకోవాలని వాట్సాఫ్ ద్వారా సమాచారాన్ని వ్యక్త పరచాడు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గంజాయి రవాణా కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**గన్నవరం, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** కారులో గంజాయిని తరలిస్తున్న ఓవ్యక్తిని గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 112 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను కృష్ణాజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు మచిలీపట్నంలో బుధవారం ఉదయం మీడియాకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు గన్నవరం ఎస్ఐ శ్రీధర్ సిబ్బందితో కలసి మంగళవారం సాయంత్రం గన్నవరం సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఓకారును తనిఖీ చేయగా కారులో రూ.5.60లక్షల విలువచేసే 112 కేజిల గంజాయి కేజి ప్యాకెట్లలో లభ్యం అయ్యిందన్నారు, కారులో గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్రలోని పూణేకి చెందిన దీపక్ తుపే(39)ని అదుపులోకి తీసుకుని విచారించగా ఈగంజాయిని పూణేకు చెందిన వైష్ణవి లవన్ కోసం ఒరిస్సాలోని బలంగీర్‌కు చెందిన రాజ్‌కుమార్, సురాన్‌కర్ణల వద్ద కొనుగోలు చేసి పూణేకు తరలిస్తున్నట్లు వెల్లడించాడని ఎస్పీ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి గంజాయి రవాణాకు వినియోగించిన కారును పోలీసులు సీజ్‌చేసినట్లు వివరించారు. గంజాయి పట్టుకున్న గన్నవరం ఎస్ఐని, సిబ్బందిని ఈసందర్భంగా ఎస్పి అభినందించారు. ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని, గంజాయి వినియోగించినా, రవాణా చేసినా చట్టప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. డబ్బు సంపాదన కోసం అక్రమమార్గాల్లో పయనించి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గ ంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని రవాణా చేసేవారిని, విక్రయించేవారిని, వినియోగించేవారిని వదలిపెట్టే ప్రశ్నేలేదని తేల్చిచెప్పారు. గంజాయి సమాచారాన్ని 1972 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలియచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి.నాయుడు, అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి.సత్యన్నారాయణ, గన్నవరం డిఎస్పీ చలసాని శ్రీనివాసరావు, గన్నవరం సిఐ బి.వి.శివప్రసాద్, ఈగల్‌టీం సిఐ యం.రవీంద్ర, ఎస్ఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## వెంకన్న సేవలో విశ్వవల్లభతీర్థస్వామి



**తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం ఉడిపి సోదే వరదరాజమఠం పీఠాధిపతి విశ్వవల్లభతీర్థస్వామి దర్శించుకున్నారు. శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. మహద్వారం నుండి లోనికి చేరుకున్న స్వామివారు తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలోని శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ సింఘాల్ ,ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైకుంఠద్వార దర్శనాలకు భక్తులకు సకల ఏర్పాట్లు

### - స్వామివారి దర్శన సౌకర్యాలు బావున్నాయి : మంత్రి సవిత



**తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన వైకుంఠ ఏకాదశి,ద్వాదశి దర్శనాలతో బాటు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు భక్తులకు తిరుమలలో సకల ఏర్పాట్లు చేస్తుండటం అభినందనీయమని రాష్ట్రమంత్రి సవిత అన్నారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగపడ్డాయని, వసతి నుండి దర్శనం,చివరకు అన్నప్రసాదాలు, లడ్డూల నాణ్యత బావుందని ఆమె అభినందించారు. తిరుమలకు వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం విధానం,ఇతరసేవలపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. టిటిడి ధర్మకర్తలమండలి, అధికారులు భక్తులకు మెరుగైన సేవలు, సౌకర్యాలపై కల్పనపై కృషి చేయడం అభినందనీయమన్నారు. బుధవారం ఉదయం ఆమె తిరుమలకు చేరుకుని నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదాశీర్వచనం తరువాత శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి



**తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వంస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు సినీ ప్రముఖులు తెలిపారు.బుధవారం ఉదయం సినీ నటులు స్వాతిదీక్షిత్, ప్రణవిమనుకొండ ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడికి వెర్టెస్ సంస్థ రూ.1.20కోట్లు విలువైన బ్లేడ్లు విరాళం



**తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** గోవింద నామస్మరణతో తిరుమలకు వచ్చి తలనీలాలు సమర్పించుకునే భక్తులకు అవసరమైన బ్లేడ్లును వెర్టెస్‌సంస్థ 1.20కోట్ల రూపాయలు విలువైన బ్లేడ్లను విరాళంగా అందించింది. తిరుమలలో ప్రధాన కల్యాణకట్టతోబాటు మరో పన్నెండువరకు ఉన్న మినీకల్యాణకట్టల్లో భక్తులకు తలనీలాలు తీసేందుకు బ్లేడ్లు అవసరమవుతున్నాయి. ఈ బ్లేడ్లను తయారీసంస్థ వర్టెస్ డైరెక్టర్ బొడ్డుపల్లి శ్రీధర్ బుధవారం ఉదయం తిరుమలకు చేరుకుని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఒక సంవత్సర కాలానికి అవసరమైన సిల్వర్‌మ్యాక్స్ సగం బ్లేడ్లను టిటిడికి విరాళమిచ్చారు. తిరుమలలో రోజుకు సుమారు 40వేల వరకు బ్లేడ్లును కల్యాణకట్టల్లో వినియోగిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి టిటిడి 1.16కోట్లు రూపాయలు ఖర్చుచేస్తోంది. ఇప్పుడు వీటిని విరాళంగా అందించడంతో పెద్దమొత్తంలో ఆదాయం చేకూరింది. ఆ సంస్థ గత పదేళ్ళుగా బ్లేడ్లను తయారుచేస్తోందని ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. రోజుకు 50లక్షల బ్లేడ్లు తయారీసామర్థ్యం ఉన్న ఏకైక సంస్థ వర్టిస్ అన్నారు. శ్రీవారి భక్తులకు సేవచేసే అదృష్టం టిటిడి ఛైర్మన్ ద్వారా కలగడం చాలా ఆనందంగా ఉందని శ్రీధర్ తెలిపారు. తొలిసారిగా ఎవరి దగ్గర లేని విధంగా సింగిల్ బ్లేడ్‌ను టిటిడికి విరాళంగా అందించామన్నారు. తమ సంస్థ తయారుచేసిన బ్లేడ్లకు యూరఫ్,అమెరికాతోసహా 52దేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. 7ఓక్లాక్ సంస్థ బ్లేడ్లను కూడా తామే ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సింగిల్ బ్లేడ్‌ల వినియోగం విరివిగా జరుగుతుందన్నారు. తిరుమలలో కల్యాణకట్టలో భక్తులకు తలనీలాలు తీసేందుకు హాఫ్‌బ్లేడ్ ను క్షురకులు చాలా సులభంగా ఉపయోగించేలా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో స్వామివారి ఆశీస్సులతో దేవునికి సేవచేసే అవకాశం కలుగుతుందని బొడ్డుపల్లి శ్రీధర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాతను టిటిడి ఛైర్మన్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

## యేటా 5 వేల మందికి క్వాంటం టెక్నాలజీపై శిక్షణ

### - వ్యాలీలో ఇప్పటికే 29 ఎంఒయూలు
### - అనుసంధానంగా 200 ఎకరాల సేకరణ
### - 6.5 గిగావాట్ డేటా సామర్థ్యం సాధించడమే లక్ష్యం
### - ఐటి కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఏటా 5 వేల మందికి క్వాంటం టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఐటీ మరియు ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, విద్యార్థులు యువతకు అమరావతి క్వాంటం అకాడమీ ద్వారా 2030కి ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలనేది లక్ష్యమని చెప్పారు. ఐటీ రంగంలో పెట్టుబడల గురించి ఆయన కలెక్టర్ల సదస్సులో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించి ఇప్పటికే రూ.2,847 కోట్ల పెట్టుబడులకు 29 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. క్వాంటం కంప్యూటర్లకు సంబంధించి హార్డ్ వేర్ సంస్థలు కూడా పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్ని చెప్పారు. దీనికోసం మరో 200 ఎకరాల అవసరం అవుతుందని, అమరావతి రాజధాని అనుసంధానంగా ఈ భూమి సేకరించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. 2026లో ఐబీఎం నుంచి రెండు క్వాంటం కంప్యూటర్లు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. క్వాంటం వ్యాలీ భవన నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా పనిచేస్తున్నామని చెప్పారు. 2030కి 6.5 గిగావాట్ డేటా సామర్థంతో కూడిన డేటా సెంటర్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గూగుల్ కాకుండా మిగిలిన ఇతర సంస్థలు కూడా రాష్ట్రంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నాయని చెప్పారు. రూ.2,97,707 కోట్ల పెట్టుబడులతో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడానికి పలు సంస్థలు ముందుకొచ్చాయని వీటికి సంబంధించి భూ సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు.

## రోడ్డుప్రమాదంలో ఇరువురి దుర్మరణం

**గన్నవరం, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** రోడ్డుప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందిన ఘటన కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలకత్తా-చెన్నై జాతీయరహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన దారం వెంకటరాజేష్(21) బుధవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై ఏలూరువైపు వెళుతున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి(45)కు ద్విచక్రవాహనంపై లిఫ్ట్ఇచ్చాడు. ఈక్రమంలో కె.సీతారాంపురం గ్రామసమీపంలో మంచుతాకిడికి కనపడక ముందు వెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుకనుండి ఢీకొట్టారు. ఈప్రమాదంలో తీవ్రగాయాలపాలయిన ఇరువురు మృతిచెందారు. హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ కేసు నమోదు చేసారు.

వార్త

మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో మీకు తెలిసొస్తుంది.

న-జాకబ్ బ్రౌడీ

# పొగమంచు కాటేసింది!


పొగమంచు పగమంచుగా మారి తెల్లవారు జామున ప్రమాదాలకు కారణమౌతోంది. శీతాకాలపు చలితోపాటు పొగమంచు కారణంగారాత్రివేళ ప్రయాణం చేస్తున్న వాహనాలకు ముందు దారి కనపడటం లేదు. దారి మసక మసకగా మంచుతెరలు, పొగమంచు తెరలు అడ్డొచ్చి ప్రయాణం ఒక అడుగుకూడా ముందుకు సాగడం లేదు. దారిలో ఎదురుగా ఏవాహనం వస్తోందో ఎటువైపు నుంచి వస్తోందో కానరావడం లేదు. ముందు వాహనం ఉందో, ఆటో ఉందో సైకిలే ఉందో కనపడక డ్రైవర్లు ప్రమాదానికి చేరువవుతున్నారు. ఢిల్లీ పౌరులకు ఒకపక్క కాలుష్య సమస్యలుంటే నగరమంతా పొగ మంచుకు తోడు ఇతరత్రా సమస్యలు పీడిస్తున్నాయి. రాజధాని డేంజర్ జోన్‌గా మారిందన్న విషయం తెలిసిందే. ఇలాంటి సంక్లిష్టమైన వాతావరణం ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉంది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఓ యమపాశంగా మారి తాజాగా జరిగిన ప్రమాదంలో కనీసం 13 మంది మృతిచెందారు. ఆ రహదారిపై దట్టంగా అలుముకున్న కాలుష్యంతో కూడిన పొగమంచు మనుషుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న సందర్భాలు కనపడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో దారి కనపించక ఆగ్రా నోయిడా రహదారిపై ఎనిమిది బస్సులు, మూడు కార్లు ఢీకొన్నాయి. ధ్వంసమై ఆనవాళ్లు లేకుండాపోయాయి. ఈ ప్రమాదంలో ఆవాహనాలన్నీ ఒకేసారి వరుసగా ఢీ కొనడంతో 13 మంది అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన 43 మంది క్షతగాత్రులను స్థానికంగా ఉండే ఆసుపత్రులలో వైద్యానికి చేర్చారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్‌దేవ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారిపై 127వ నెంబరు మైలురాయి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ముందుగా రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. అటుపై వస్తున్న మరి కొన్ని వాహనాలు స్పీడుగా వచ్చి గుద్దుకున్నాయి. రోడ్డు విజిబిలిటీ ఒక మీటర్ వరకే ఉంది. ఢీ కొన్న వాహనాలన్నీ తుక్కుతుక్కయిపోయాయి. నుజ్జునుజ్జయిన వాహనాలు అగ్నికీలలకు గురై పనికిరాకుండాపోయాయి. గత 7ఏళ్లుగా ఎన్నడూలేని స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలే కాకుండా దట్టమైన పొగమంచు చుట్టేసుకుని ఆ ప్రాంతంలో వాహనాలను నిలిపివేసింది. దానికితోడు తీవ్రస్థాయిలో వాయుకాలుష్యం కూడా. ఇప్పటికే ఢిల్లీ వాయు నాణ్యత తీవ్ర ప్రమాదకరస్థాయికి చేరుకొంది. వాయు నాణ్యత సూచీ గణనీయంగా పడిపోయింది. ఢిల్లీ ఆనంద్ విహార్ ప్రాంతంలో ఏక్యూఐ 493 మాత్రమే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పొగమంచు మరింత ప్రమాదకరమే. పొగమంచు కారణంగా జరిగే ప్రమాదమైనా తీవ్రమే. ముందు వాహనం ఆగిన ఆచూకీ తెలియక వెనుక స్పీడుగా వచ్చే వాహనం సడెన్ బ్రేక్ వేయడమూ కష్టమే. అందుచేతనే మొన్న జరిగిన ప్రమాద తీవ్రత అలాఉంది. ఇలా ఒకటికి మించి వాహనాలు వరుసబెట్టి ఢీ కొట్టుకుంటే మంటలు చెలరేగుతాయి. ఆ వాహనాల్లో ప్రయాణికులు ఉండి ఏమాత్రం మంటలు అంటుకున్నా సజీవ దహనం అయ్యేవారే. అదృష్టవశాతూ ప్రమాదస్థాయి అంతవరకే పరిమితమైంది. వాళ్లంతా ఇలాంటి పొగమంచు ప్రమాదం ఊహించక, చలికి జాగ్రత్తలు తీసుకుని మఫ్లర్లు, స్వెటర్లు, ధరించిఉన్నా ఇలాంటి ప్రమాదాలుజరుగకుండా, పొగమంచు చలిగాలులు ఎక్కువగా ఉన్నచోట రాత్రిపూట ప్రయాణాలు లేకుండా ఆ రహదారుల్లో నిషేధం విధించడం మంచిది. ఇలాంటి సందర్భాల్లో మంటలకు ఆహుతైన వారి మృతదేహాలను గుర్తించేందుకు మళ్లీ డిఎన్‌ఎ నమూనాల పద్ధతి అనుసరించాల్సిందే. క్షతగాత్రుల్లో కూడా కొంతమంది చికిత్స సమయంలో మృతిచెందారు. సంతాపాలు, దిగ్భ్రాంతులు, విచారాలు, పరిహారాలు కన్నా ప్రమాదాలు జరుగకుండా చూడడం ముఖ్యం. రాత్రి ప్రయాణాల మీద ఏమాత్రం అవగాహన ఉన్నా మరిన్ని జాగ్రత్తలు తీసుకునే వీలుంది. ఉత్తరాదికి చలిగాలులు, కాలుష్యం, పొగమంచు శాపంలా పరిణమించాయి. ఇతర ప్రాంతాల్లోనూ కొన్ని సమస్యలవల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజుకో అతిపెద్ద ప్రమాదం వాటిల్లి ఎక్కువ మంది ప్రయాణికులను బలితీసుకుంటున్న విషయం విదితమే. ఢిల్లీలో కాలుష్యం కొరకరాని కొయ్యగా మారింది. ఎంతకూ దానిని రూపుమాపే మార్గాలు కనిపించడం లేదు. ఈ అంశంపై ఇటీవల పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాలు నిరసన ప్రదర్శన కూడా నిర్వహించాయి. పసి కందులు కాలుష్యానికి బలైపోతున్నారని, వృద్ధులుకాలుష్య కారణంగా మరింత వృద్ధాప్యబాధలకు, ముఖ్యంగా శ్వాస కోశ సమస్యలకుగురై ఆస్పత్రుల పాలవుతున్నారని గగ్గోలు పెట్టారు. అంతకుముందే సుప్రీంకోర్టు కూడా ఢిల్లీకాలుష్యం అంశంపై ఓ స్థిర నిర్ణయానికి వచ్చింది. అందరూ అనుకున్నట్లు కాలుష్య పాపాన్ని ఆ ప్రాంత రైతుల మీద నెట్టివేయరాదని గట్టిగా చెప్పింది. అదే పరిష్కారమైతే గతంలో కన్నా పంటకాలుష్య వ్యర్థాలు మండించడం తగ్గింది. కానీ ఢిల్లీ కాలుష్యస్థాయి ఏమాత్రం తగ్గలేదని అభిప్రాయపడింది. మొన్నటి పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో 200 విమానాలు రద్దయ్యాయి. పంట వ్యర్థాల దగ్ధం చేయవద్దని ప్రభుత్వాలు రైతుల మీద జరిమానాలు వేసి తీవ్ర కార్యా చరణ చేపట్టడంతో అలాంటి చర్యలు బాగా తగ్గిపోయాయి. మహా ఉంటే కేవలం ఐదు శాతం మాత్రమే ఉండొచ్చునని కాలుష్య నివారణ సంస్థలు తేల్చి చెప్పాయి. కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. యమునా నదికాలుష్య విషయంపై ఎంతో ఆశపెట్టుకున్న కేంద్రం ఢిల్లీ కాలుష్యం గురించి ప్రత్యేక శ్రద్ధ ప్రణాళికలతో కార్యాచరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

మానవ నాగరికతను చాలా వరకు ప్రభావితం చేసేది ఉత్తమ మహిళలే!



ఎమర్సన్

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మన కున్నప్పుడు అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించు కోరాదు.



ఫిలప్ మాసింగర్

# ప్రజావాక్కు



### డిజిటల్ భద్రతకు ముందడుగు

డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు మన జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. అయితే, అదే సమయంలో మొబైల్ మోసాలు, నకిలీ సిమ్‌లు, గుర్తు తెలియని కాల్స్ వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార్ సాతి యాప్ ప్రజల డిజిటల్ భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. సంచార్ సాతి యాప్‌ను టెలికాం విభాగం రూపొందించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. చాలా సందర్భాల్లో వ్యక్తికి తెలియకుండానే అతని గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డులు తీసుకుని అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తారు. అలాంటిసందర్భాల్లో ఈయాప్ఎంతో ఉపయోగకరం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### గంజాయి సరఫరా

దేశంలో చట్టాలు కఠినమవుతున్నాయన్న భావన ఉన్నప్పటికీ, గంజాయి సరఫరా మాత్రం అడ్డుకట్టలేకుండా విస్తరిస్తోంది. పట్టణాల నుండి పల్లెల వరకు ఈ నిషేధిత మత్తు బారినపడుతున్నది ముఖ్యంగా యువత. ఇది చట్ట సంబంధ సమస్య మాత్రమేకాదు సమాజంపై పాకుతున్న మహమ్మారి. సరిహద్దు రాష్ట్రాల నుండి భారీగా రహస్య రవాణా, పట్టణాల్లో చిన్న నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయం ఇవన్నీ సంఘటిత నేర వ్యవస్థగా మారాయి. అరెస్టులు జరిగినప్పటికీ, డిమాండ్ పెరగడం వల్ల ఈ వ్యాపారం ఆగట్లేదు. నిరుద్యోగం, ఒత్తిడి, దారితప్పిన వినోదం యువతను మత్తు వైపు నెడుతున్నాయి. క్షణిక సంతోషం కోసం మొదలైన అలవాటు త్వరలోనే బానిసత్వంగా మారి ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తును ధ్వంసం చేస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివిపైకి రావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏరంగంలో ఆసక్తి గలదో తెలుసుకోవాల్సిన అవసరంఉంది. అందుకు ఉపాధ్యాయులు విలువగలవిద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### ఉపాధికి హామీ లేని పథకం

రెండుదశాబ్దాలుగా దేశంలో గ్రామీణప్రాంతాల్లో ఉపాధికి హామీ ఇచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తన పేరు, రూపు మార్చుకోబోతోంది. ఆ దిశగా ప్రవేశపెట్టబడే బిల్లుని కేంద్రం పార్లమెంట్ సభ్యులకు సర్క్యులేట్ చేసింది. ఈ బిల్లులో ప్రతిపాదనలు ఇంతవరకూ ఉన్న హామీని నీరుకార్చేవిగా కనబడుతున్నాయి. వంద రోజుల పని దినాలకు బదులుగా 125రోజులు పనికల్పిస్తామని చెప్పడం ఒక్కటేబాగుంది. మిగతా సవరణలు వికసిత భారతం సాధించే దిశగా గత రూపం కన్నా ఎలా మెరుగైనవో పాలకుల నుండి విని తెలుసుకోవాల్సి ఉంది. చేస్తున్న పెద్ద మార్పు ఈ పథకాన్ని డిమాండ్ ఆధారితం కాకుండా సరఫరా ఆధారితం చెయ్యడం. అంటే ఇప్పటిలా మా ఊరికి ఈ పని, ఇంతమందికి ఉపాధి కల్పిస్తూ, ఇన్ని రోజులకు అవసరం అని చెప్తే కేంద్రం మంజూరు చెయ్యడం కాదు. కేంద్రం ఇచ్చిన బడ్జెట్ మేరకు, కేంద్రమే గుర్తించిన ప్రాంతంలో ఆ ఫలానా పని పూర్తి మాత్రమే అయ్యేలా చూడడం.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### ఏకపక్ష నిర్ణయాలు

ప్రజాస్వామిక చరిత్రలో అతిపెద్దతప్పిదానికి కేంద్రం తలుపులు బార్లా తెరుస్తోందా అంటే అవుననే సమాధానమే వస్తుంది. ఉపాధిహామీ చట్టం రద్దు చేసి దానిస్థానంలో తెచ్చే పథకం వల్ల ఉపయోగం ఏమిటి? దానిస్థానంలో తెచ్చే పథకం ముఖ్య ఉద్దేశంఏమిటి అనేది కనీసం చర్చకూడా జరగకుండా చేయడం కేంద్రం ఏకపక్ష పోకడలకు గుర్తుగా చూడొచ్చు. అయితే ఎంతో ఉదాత్త ఆశయాలతో తీసుకొచ్చిన ఈపతకం ఆశయాల్ని గొంతు నులిమినట్టు చేసి దానిఉనికి ప్రమాదంలో పడేట్టు చేస్తున్నారు.

-భారత అవినాష్, జనగామ

### డిజిటల్ భద్రతకు ముందడుగు

డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు మన జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. అయితే, అదే సమయంలో మొబైల్ మోసాలు, నకిలీ సిమ్‌లు, గుర్తు తెలియని కాల్స్ వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈసమస్యలకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార్ సాతి యాప్ ప్రజల డిజిటల్‌భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. సంచార్ సాతి యాప్‌ను టెలికాం విభాగం రూపొందించింది. ఈయాప్ ద్వారా వినియోగదారులు తమ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

- ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# 'బోండి బీచ్' అలజడితో మరింత అశాంతి!

*అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తూ రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందాలనుకోవడం కూడా ఉద్రిక్తతలను పెంచుతున్నాయని కొందరి వాదన. కొత్తగా బంగ్లాదేశ్ అఫ్ఘాన్ దేశాలు అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. తాలిబన్లు ఇదివరకటి దుందుడుకు నడవడికను ప్రభుత్వం హస్తగతమవటంతో తగ్గించుకున్నా పాకిస్థాన్ అఫ్ఘాన్ రాజకీయ ఎత్తుగడలతో ఏకీభవించడం లేదు. భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని తాలిబన్ల సహాయంతో నడిపించడానికి గండిపడటంతోపాటు అంతంత మాత్రంగా ఉన్న ప్రజాస్వామ్య పాలన మిలటరీ చేతుల్లోకి పరోక్షంగా వెళ్లడంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి భారత్‌తో గొడవలు పెట్టుకొనే ఆస్కారం ఉంది. చైనా ఎలాంటి పాత్ర పోషిస్తుందో ఇరుగు, పొరుగు దేశాలు ఏ విధంగా వ్యవహరిస్తాయో భారత్ ఒక కంట కనిపెట్టి ఉండక తప్పదు.*



రావులపాటి సీతారాం రావు

సిడ్నీలోని బొండీబీచ్‌లో జరిగిన దారుణ మారణహోమంలో దాదాపు పదహారు మంది మరణించారు. మరో 60 మందికి గాయాలు అయ్యాయి. ఈ దుర్ఘటన ఈ నెల 14న జరిగింది. పది సంవత్సరాల బాలిక, 87ఏళ్ల వృద్ధుడు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. హనుక్కా ప్రారంభ దినోత్సవం సందర్భంగా యూదు జాతికి చెందిన వారిపై యాంటీ జ్యోయిష్ వారు చేసిన దాడి యిది. ఇందులో ఇద్దరు తండ్రీ కొడుకులు పాల్గొన్నారు. తండ్రిని అక్కడికక్కడే పోలీసులు చంపేశారు. గాయాలతో బయటపడిన కొడుకును హాస్పిటల్‌లో చేర్చారు. ఇతను ఆరు నెలల నుంచి ఆస్ట్రేలియా పోలీసుల డొమెస్టిక్ ఇంటలిజెన్స్ వారిదర్యాప్తులో ఉన్నాడు. అయినా ఈ భయంకర సంఘటన దాదాపు కాశ్మీరులోని పహల్గాం సంఘటన తరహాలోనే జరగడం దురదృష్టకరం. యాంటీ సెమిటిక్ పేరుతో ఈ ఘటనలు ముఖ్యంగా ఎక్కువ సంఖ్యలో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న యూదుమతస్థుల మీద జరుగుతున్నాయి. 1996 సంవత్సరంలో టాస్మానియా పోర్ట్ ఆర్థర్‌లో జరిగిన సంఘటనలో 35 మంది ప్రాణాలు కోల్పోవటంఈ సందర్భంగా జ్ఞప్తికి తెచ్చుకోక తప్పదు. ఈ మధ్యకాలంలో జ్యూయిష్ వారి మీద తరచూ ఇలాంటి దాడులు జరగటం, ఆస్ట్రేలియాలో ఇలాంటి ఘటనల వెనుక ఇరాన్ హస్తం ఉందనే అనుమానంతో ఇరానియన్ రాయబారితోసహా మరో ముగ్గురిని దేశం నుంచి బయటకు పంపారు. అక్టోబరు 27, 2023 హమాస్ టెర్రరిస్టు సంస్థ ఇజ్రాయిల్‌పై దాడులు తర్వాత, గాజా పాలస్తీనుల మీద సంఘటనలు 2023–24 మధ్య 2000 కేసులు దాకా రిపోర్టు అయ్యాయి. యాంటీ సెమిటిజం వారి తరపున పోరాడుతున్న వారు ఇచ్చిన సంఖ్యే ఇది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ఈ దుర్ఘటన నేపథ్యంలో సమైక్యంగా ఉండాలని ప్రజలను ఉద్దేశించి ప్రకటన చేయడం గమనార్హం. ఈ తరహా జాతి వ్యతిరేక ఘటనలు ఆస్ట్రేలియాలో ఎక్కువ సంఖ్యలోయూదు జాతివారు ఉండటం వల్ల జరుగుతుండటంతో ఆ దేశానికి పెద్ద సమస్యగా మారింది. ఇజ్రాయిల్ ప్రధాని ఆస్ట్రేలియా ప్రధాని పాలసీల వల్లనే ఈ జాతి పట్ల వ్యతిరేక ఘటనలు జరుగుతున్నాయని విమర్శించటం హమాస్ సంస్థదాడులు, ఇజ్రాయిల్ ప్రతిదాడుల తర్వాత ఈ విమర్శ విడ్డూరంగా ఉందని పశ్చిమ దేశాల నిపుణులు భావిస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని విమర్శలు ప్రతి విమర్శలు పట్టించుకోకుండా, అక్కడున్న యూదు జాతిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోక తప్పదు. లోకల్ సమస్యలు గ్లోబల్ సమస్యలుగా మారుతున్నాయి. దాదాపు అన్ని ముఖ్య దేశాల్లో జాతుల పరస్పర వ్యతిరేక చర్యలు పెరగడం గమనిస్తున్నవారు జాతుల వ్యతిరేక, అనాగరిక చర్యలను గర్హిస్తున్నారు. రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం ఇలాంటి హింసాకాండను రెచ్చగొడుతున్నారని కూడా భావిస్తున్నారు. ఇజ్రాయిల్, గాజా ప్రాంతంలోని పాలస్తీనియన్ల, కాశ్మీర్‌లో హిందువులపై పాకిస్థాన్ ప్రోత్సాహంతో ఉగ్రవాదం చర్యలూ బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లలో జరుగుతున్న సంఘటనలన్నిటికీ రాజకీయ, ఆర్థిక కారణాలే అని నిపుణుల భావన. ఇలాంటి ఘోర సంఘట నల మధ్య కూడా మానవత్వం ఎక్కడో ఒక చోట తళుక్కు న మెరవక మానదు. యూదులపై సిడ్నీలో



జరిగిన దాడి యావత్ప్రపంచాన్ని కుదిపేసింది. కానీ నేనున్నాను ఉగ్రవా దులకు ఎదురొడ్డి బాధితులను కాపాడటానికి అంటూ ఒక హీరో అడ్డుగోడగానిల్చి చరిత్ర సృష్టించాడు. ఉగ్రవాదులను దాడిని ఎదుర్కొంటూ నేను చనిపోవచ్చు, నా కుటుంబానికి తెలియచేయండి, అని అన్నమాటలు అక్కడి వారి గుండెల ను కలిచివేశాయి. ఆ హీరో పేరు అహ్మద్ అల్ అహ్మద్! అహ్మద్ సిరియా నుంచి దశాబ్దం క్రితం ఆస్ట్రేలియాకు బతుకు తెరువు నిమిత్తం వచ్చాడు. స్థానికంగా పండ్ల దుకా ణం పెట్టి జీవితాన్ని సాగిస్తున్నాడు. ఉగ్రదాడి నాడుఅహ్మద్ బోండి బీచ్‌లో తన బంధువు దోజీ అల్కాండ్‌తో కలిసి కాఫీ షాపులో ఉన్నాడు. కాల్పుల శబ్దాల తర్వాత అహ్మద్ తేరు కొని ఉగ్రవాదులను ఎలాగైనా అడ్డుకోవాలని తన ప్రాణాలు పోయినా పర్వాలేదు అనుకొని ముందడుగు వేశాడు. నేను ఎదుర్కోవటంలో చనిపోతే ఇతరుల ప్రాణాలు రక్షించడానికి నేను నేలకొరిగాను అని నా కుటుంబానికి చెప్పు అని తన బంధువుతో చెప్పి, కాల్పులు జరుపుతున్న దుండగుడిని అడ్డుకున్నాడు. దీంతో దుండగుడు పారిపోవటంతో ఎందరి ప్రాణాలనో కాపాడగలిగాడు. అడ్డుకుంటున్న సమయంలో అహ్మద్‌గాయపడ్డాడు. కాల్పులు జరిపిన ఇద్దరు దుండ గులలో ఒకనికి సాజిత్ అక్రమ్ (తండ్రి) ఇండియన్ పాస్ పోర్టుతో ఫిలిప్పీన్స్‌కు నవంబరు 1 నాడు కొడుకు నవీన్ (ఇతనికి ఆస్ట్రేలియన్ పాస్‌పోర్టే ఉంది)తో వెళ్లి 28 నవంబరు నాడు తిరిగి వచ్చాడు. ఫిలిప్పీన్స్ మిలటరీ ట్రయినింగ్ కోసం వెళ్లినట్లు ధ్రువపడలేదు. ఫిలిప్పీన్స్‌లో ఇస్లామిక్‌స్టేట్ గ్రూపుతో సంబంధమున్న మిలిటెంట్లు దాడిచేశారని ఆస్ట్రేలియా ప్రధాని ప్రకటించారు. ఈ మధ్య జరుగుతున్న సంఘటనలు ముఖ్యంగా యూదులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం గన్ కంట్రోల్‌ను పటిష్టం చేసింది. పోర్ట్ ఆర్థర్ ఉదంతం తర్వాత గన్ కంట్రోల్ విషయంలో చట్టాలు కూడా రూపొందించారు. కఠినమైన లైసెన్సింగ్ విధానాన్ని కూడా పాటిస్తున్నారు. అయితే ఈబోండీ బీచ్ దాడి తర్వాత గన్ సేఫ్టీ విషయంలో ఆస్ట్రేలియాలో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు ఆస్ట్రేలియా చేయాల్సింది ఒకటే. మరింత కఠినతరంగా ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సైద్ధాంతిక ముసుగులో జరిగేలా దాడులను ఆపేందుకు పటిష్టమైన నిఘా వ్యవస్థతోపాటు దుండగులను ఏరిపారేసి కఠినంగా శిక్షించినప్పుడే ఎక్కువ సంఖ్యలో ఈ దేశంలో ఉన్నయూదులకు ఊరట లభిస్తుంది. కానీ కొన్ని దేశాలు కచ్చితంగా ఇలాంటి ఘటనలు సంభవించినప్పుడల్లా మరిం తగా అలజడులతోపాటు అంతర్జాతీయ సమస్యగా మార్చే ఎత్తుగడలు రాజకీయం చేస్తాయి. ఇజ్రాయిల్ ఇప్పటికీ హమాస్ సంస్థతోపాటు ఇస్లామిక్ దేశాలు ముఖ్యంగాఇరాన్, టర్కీలను వేలెత్తి చూపుతున్నది. ఇరాన్ నిస్సందేహంగా మిలిటెంట్లకు సహకార సంపత్తులు ఇస్తున్నదని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇప్పుడిప్పుడే చల్లబడుతున్న ఇజ్రాయిల్, రష్యా, ఉక్రెయిన్ దేశాలు మళ్లీ బరిలోకి దిగి ఏం చేస్తాయో అన్న భయాలు తలెత్తున్నాయి. అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తూ రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందాలనుకోవడం కూడా ఉద్రిక్తతలను పెంచుతున్నాయని కొందరి వాదన. కొత్తగా బంగ్లాదేశ్ అఫ్ఘాన్ దేశాలు అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. తాలిబన్లు ఇది వరకటి దుందుడుకు నడవడికను ప్రభుత్వం హస్తగతమవటంతో తగ్గించుకున్నా పాకిస్థాన్ అఫ్ఘాన్ రాజకీయ ఎత్తుగడలతో ఏకీభవించడం లేదు. భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని తాలిబన్ల సహాయంతో నడిపించడానికి గండి పడటం తోపాటు అంతంత మాత్రంగా ఉన్న ప్రజాస్వామ్య పాలన మిలటరీ చేతుల్లోకి పరోక్షంగా వెళ్లడంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి భారత్‌తో గొడవలు పెట్టుకొనే ఆస్కారం ఉంది. చైనా ఎలాంటి పాత్ర పోషిస్తుందో ఇరుగు, పొరుగు దేశాలు ఏ విధంగా వ్యవహరిస్తాయో భారత్ ఒక కంట కనిపెట్టి ఉండక తప్పదు. ●

# వలసదారుల హక్కులను పరిరక్షించాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వివిధ కారణాల వల్ల వలస వెళ్తుంటారు. ఈ వలసలు వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి గానీ, జీవితాన్ని కాపాడుకోవడానికి గానీ జరుగుతుంటాయి. ఇలాంటి వలసదారుల హక్కులను గుర్తించడం, వారి కష్టాలను అర్థం చేసుకోవడం, వారికి సహాయం చేయడం కోసం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ప్రతి సంవత్సరండిసెంబర్ 18న జరుపుకుంటారు. డిసెంబర్ 18ను అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా 2000లో ఐక్యరాజ్యసమితి ప్రధాన అసెంబ్లీ ప్రకటించింది. 1990లో ఇదే తేదీన అంతర్జాతీయ వలసదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన కన్వెన్షన్ ఆమోదించబడింది. ఈ నేపథ్యంతో వలసదారుల హక్కులను, వారితో ఉన్న సమస్యలను చర్చించేందుకు ఈ రోజు గుర్తింపును పొందింది. తక్కువ ఉపాధి అవకాశాలు, దారిద్ర్యం వలన వేలాది మంది మెరుగైన జీవనోపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తుంది. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు (ఎడతెరిపి లేని వరదలు, కరువులు, అగ్నిపాతాలు) ప్రజలను వలసలకు బలవంతం చేస్తాయి. కొంతమంది జీవితం కోసం శరణార్థులుగా వలస వెళ్తే, మరికొందరు భద్రత కోసం కొత్త ప్రాంతాలను ఆశ్రయిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం యువత వలసలు చెయ్యటం సర్వసాధారణం. వలసదారులు వారి కృషితో అతిథి దేశాలకు ఆర్థికంగా విశేష ప్రయోజనం కలిగిస్తారు. రెమిటెన్సుల రూపంలో స్వదేశాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక మద్దతును అందిస్తారు. వారి సాంస్కృతిక సంపదతో కొత్త ప్రాంతాలను సుసంపన్నం చేస్తారు. సంగీతం, భాష, ఆహారపు అలవాట్లు వంటి అంశాల్లో కొత్త మార్పులను తీసుకురావడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. వలసదారులు వారి



మేధస్సు, సాంకేతిక నైపుణ్యాలను అతిథి దేశాలకు అందించడంతో పాటు స్థానిక సమాజ అభివృద్ధికి తోడ్పడతారు. వలస దారులు తరచూ వివక్షకు గురవుతుంటారు. తక్కువ వేతనాలు, నిస్సహాయ పరిస్థితులు, చట్టపరమైన రక్షణల లోపం కారణంగా వారు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారు. భాషా, ధార్మిక భిన్నత్వాలు వలసదారులను ఒంటరితనానికి గురిచేస్తాయి. అనేక దేశాలు వలసదారుల హక్కులను పరిగణలోకి తీసుకోవడం లేదా వారి అవసరాలను సరైన విధంగా సమర్థించడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొన్ని సార్లు వలస దారులు స్థిరమైన ఉపాధి లేకుండా ఆర్థిక అనిశ్చితిలో చిక్కుకుపోతున్నారు. భారతదేశం ప్రాచీన కాలం నుండి వలసదారులను స్వీకరించే సంప్రదాయాన్ని కలిగి ఉంది. ఉపాధి కోసం కార్మిక వలసలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వలసపోయే భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. వీరు భారతీయ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అరుణాచల ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలనుండి వచ్చిన శరణార్థులుభారత ప్రభుత్వం ద్వారా మద్దతు పొందుతున్నారు. వలసదారుల కష్టాలను సమాజం గుర్తించడం, వారిపై ఉన్న అపనమ్మకాల్ని తొలగించడం ఈదినోత్సవం ప్రధాన లక్ష్యం. వలసదారు ల రక్షణ, హక్కులకోసం అంతర్జాతీయ స్థాయిలో పటిష్ఠ మైన విధానాలను రూపొందించేందుకు ఇది ప్రేరణగా పని చేస్తుంది. వలసదారులు స్థానిక సమాజంలో సమగ్ర పరచ బడేందుకు అవసరమైన చర్యలను ప్రోత్సహించడానికి ఈ రోజు దోహదపడుతుంది. వలసదారులు ప్రపంచ ఆర్థిక, సాం స్కృతిక, సామాజికరంగాలకు ఎంతగానో తోడ్పడుతున్నారు. వారి కృషిని గౌరవించడం మన కర్తవ్యం. అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ఈ అంశంపై మరింత అవగాహన కలిగించి, వారి హక్కులకు శ్రద్ధ వహించే దిశగా సమాజాన్ని ప్రోత్సహిస్తుంది. వలసదారులను అర్థంచేసుకుని, వారికి సహా

# ఉద్యోగ కల్పనలో వెనుకబడుతున్నామా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ఒక ఆటవిక సమాజంలో వేటే వృత్తి అయినందువలన వేటాడిన జంతువును సమానంగా పంచుకునేవారు ఆ తర్వాత వచ్చిన బానిస వ్యవస్థలో బానిసలను దోపిడీ చేయడం, తరువాత వచ్చిన భూస్వామ్య వ్యవస్థలో రైతులదోపిడీ, ఇప్పుడున్న పెట్టుబడిదారీవ్యవస్థలో శ్రామికుల దోపిడీ, పెట్టుబడిదారులను తప్ప ఇంకెవరిని బాగుపడనీయని పరిస్థితి. ఉద్యోగ కల్పనలేని ఉత్పత్తులను చేసి మిలియనీర్లు బిలియనీర్లు అయిపోతూ దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రిడేటరీ గ్రోత్‌ను కొనసాగిస్తూ ఎల్లప్పుడూ దేశంలో నిరుద్యోగ సమస్యతో యువత, అప్పుల ఊబిలో ప్రభుత్వాలు కూరుకుపోతున్నాయి. మన దేశంతోపాటు స్వాతంత్ర్యం సంపాదించుకున్న చైనాలో ప్రభుత్వ నియంత్రణలో పెట్టుబడిదారులు ఉన్నందువలన ప్రపంచంలో 80 దేశాలకు అప్పులు ఇవ్వగలిగింది. పెట్టుబడిదారులను నియంత్రించిన చైనాలో ప్రిడేటరీ గ్రోత్ కనిపించదు. ఉద్యోగ సమస్యను తీర్చుతూ సంతులిత సమ్మిళిత ఆర్థిక అభివృద్ధిని సాధించగలిగింది. మన దేశం కూడా 2023 నాటికి చైనా నుండి 11.1 బిలియన్ డాలర్లు అప్పుగా తీసుకున్నది. అయితే చైనా మాత్రం అనేక దేశాలకు అప్పులిస్తుంటే మన దేశం మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2015లో దేశ విదేశీ అప్పులు 56లక్షల కోట్ల రూపాయలు అయితే 2024 నాటికి 185.94 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. 10 ఏళ్లలో విదేశీ అప్పు రెట్టింపు అయింది. సగటు భారతీయుని తలసరి అప్పు 1.27 లక్ష వరకు ఉన్నది. ఈ నేపథ్యంలో మన నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో పెరిగిన జీడీపీ ఎవరిది? దేశంలో రావలసిన పన్నులు కార్పొరేట్లకు రాయితీల రూపంలో వదులుకోవడంవలన ప్రభుత్వం అప్పు చేయవలసి వస్తున్నది. కార్పొరేట్లకు పన్ను రాయితీలో ఎన్‌డిఏ వన్ హయాంలో 4.3 లక్షల కోట్ల రూపాయలు. 2019–21 మధ్యన 1.85 లక్షల కోట్ల రూపాయలు పన్నుల ఆదాయాలు ప్రభుత్వానికి తగ్గిపోయాయి. ఇలా ప్రభుత్వ ఆదాయాలు తగ్గిపోవడం వలన అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. మరొకవైపు ప్రజలు ద్రవ్యోల్బణానికి గురై జీవన ప్రమాణాన్ని కోల్పోతుండగా ఉపాధి కల్పనకు చేసే ప్రభుత్వ వ్యయం గణనీయంగా పడిపోతున్నది. ఉదాహరణకు 27 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం కింద 2024–25 సంవత్సరానికి 86 వేల కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెట్లో కేటాయించడం జరిగింది. పేదలను కూలీలను ఒకరకంగా ధనికులను మరొక రకంగా చూస్తున్న ప్రభుత్వం ఓట్ల కోసం ఉచితాలను కల్పిస్తూ ఉపాధి కల్పన లేకుండా చేస్తున్నది. 1980లో జాతీయ ఆదాయంలో పెట్టుబడి శ్రామిక వాటా నిష్పత్తి 75 శాతం ఉండగా 2024 నాటికి 29 శాతానికి



పడిపోయింది. ఫలితంగా ప్రజల్లో ఆదాయాలు లేక కొనుగోలు శక్తి లేక వినియోగం తగ్గిపోయి ప్రపంచ దేశాలలో మానవాభివృద్ధిలో అత్యంత అల్ప స్థాయిలో భారతీయులు ఉన్నారు. 77వ నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 35శాతం కుటుంబాలు సగటున సుమారు 60వేల రూపాయల వరకు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ముఖ్యంగా ఈ రుణగ్రస్థత 2016 నుంచి 2022 మధ్యకాలంలో పెరిగిపోయింది. వీరు ముఖ్యంగా 40శాతం రైతులు, 30శాతం ఇతరులు ఉన్నారు. సంస్థాగత రుణాలు అంటే బ్యాంకులు తదితర వాటి నుంచి గ్రామీణ వాసులకు లభించిన రుణగ్రస్థత 18 శాతం కూడా లేదు. ఈ గ్రామీణ రుణగ్రస్తుతను పెరుగుదలను నాబార్డ్ధ్రువీకరించింది. ఇప్పుడు దేశంలో అందరికీ అందని అభివృద్ధి జరుగుతున్నది. అందువలన ఆదాయ అసమానతలు పెరిగిపోతున్నాయి. దేశ సంపదలో 58శాతం కేవలం 10శాతం మందికే చేరుతోందని వరల్డ్ యూనిక్వాలిటీ నివేదిక వెల్లడించింది దేశం ఆర్థికంగా ఎంతో వృద్ధి చెందినా అభివృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదన్న ఆరోపణల్లో అసత్యం లేదని ఈ వినేదిక తెలియజేస్తోంది. గరిష్ట కనిష్ట ఆదాయాల మధ్య వ్యత్యాసం బాగా పెరిగిందని ఈ నివేదిక వివరించింది. సంక్షేమ పథకాలను గురించి పదేపదే చెబుతూ సంబంధిత అభివృద్ధికోసమే వీటిని అమలు చేస్తున్నామని చెబుతున్నారు. సంక్షేమ పథకాల ఫలాలు ఎవరికి చెందాలో వారికి చేరకపోవడం వల్ల సమ్మిళిత అభివృద్ధి జరగడం లేదు. అగ్రశ్రేణిలో ఉన్న పది శాతం ధనవంతులకు అట్టడుగున ఉన్న 50 శాతం మంది పేదల మధ్య 2014 నుంచి 2024 వరకు ఆదాయంలో అంతరాల స్థిరంగా కొనసాగుతున్నాయని ఆ నివేదిక సూచించింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 2014నాటి నుంచి మొదటి 10 సంవత్సరాలలో వ్యత్యాసాలు బాగా పెరిగాయి. అంతరాలను తగ్గించడానికి కృషి చేస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రతి సందర్భంలోనూ పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం చేపట్టే పథకాల నిధులన్నీ అగ్రశ్రేణిలో ఉన్న పది శాతం మందికే చేరుతుందని అసమానతల నివేదిక పేర్కొంటుంది. అలాగే దేశంలో కుబేరుల సంఖ్య బాగా పెరుగుతోందని గడిచిన పదేళ్లలో కొత్త కుబేరులు తయారయ్యారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ ఏడిఆర్ ఎన్నికల సందర్భంగా విడుదలచేసే నివేదికలో పేర్కొంటుంది. గతంలో బిలియనీర్ల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు అలాంటి బిలినియర్లసంఖ్య గణనీయంగాపెరిగింది. రాష్ట్రాల్లో పెట్టుబడుల కోసం విదేశాల్లో పర్యటించేమంత్రులు ముఖ్యమంత్రుల సంఖ్య గతంలో కన్నా బాగాపెరుగుతుంది. అయినా మన పాలకులు దేశంలో దోపిడీతో జరుగుతున్న వృద్ధినే ప్రిడేటరీ గ్రోత్ పాలకులు కంపెనీలకు అనేక రాయితీలు కల్పించుతున్నారు. ఎన్నో లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని కార్పొరేట్లు చెబుతున్నారు. అయితే వారు ఆటోమేటిక్ యంత్రాలు లేదా కృత్రిమ మేధాతో పనులు చేపట్టి ఉత్పత్తి కార్యక్రమాలు చేయడం వలన ఉద్యోగకల్పన అంతంతమాత్రంగానే ఉంది. దీనికి తోడు ఒక్క 2024లోనే ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్వేర్ కంపెనీలో ఒక లక్ష యాభైవేల ఉద్యోగస్తులను తీసేశారు. ఇంకో 5ఏళ్లలో తొమ్మిది లక్షల 20 వేల ఉద్యోగాలు పోతాయని తెలుస్తున్నది. ఈపరిస్థితులలో కంపెనీలుంటే మనపాలకులు మాత్రం వారికి అనేక రాయితీలు అందిస్తున్నారు. మనదేశంలో నూతన ఆర్థికవిధానాలు లిబరలైజేషన్ ప్రైవేటైజేషన్ గ్లోబలైజేషన్ చేపట్టిన తర్వాత ప్రభుత్వం. పెట్టుబడుల విధానాలే మారిపోయాయి. ఇలాంటి పెట్టుబడిదారీ విధానాన్ని అధిగమించి ప్రిడేటరీఎకానమీని నియంత్రించే విధానాన్ని రూపొందించుకోవాలి. ●



# ప్రధాని మోడీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం!

## 'ది గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' ప్రదానం

**అడ్డిస్ అబాబా, డిసెంబరు 17:** భారత ప్రధాని నరేంద్ర మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. ఆఫ్రికా దేశమైన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారం "ది గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా"ను ఆయనకు ప్రదానం చేసింది. మంగళవారం అడ్డిస్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ అలీ చేతుల మీదుగా మోడీ ఈ అవార్డును అందుకున్నారు. భారత్‌ఇథియోపియా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆయన చేసిన విశేష కృషికి, ప్రపంచ నేతగా ఆయన దార్శనిక నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించినట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్న తొలి ప్రపంచ దేశాధినేత లేదా ప్రభుత్వాధినేత ప్రధాని మోదీ కావడం విశేషం. ఈ గౌరవాన్ని తాను 140 కోట్ల మంది భారతీయులకు అంకితం ఇస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. "ప్రపంచంలోని పురాతన నాగరికతలలో ఒకటైన ఇథియోపియా నుంచి ఈ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉంది. ఈ గౌరవాన్ని 140 కోట్ల మంది భారత ప్రజలకు అంకితం చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. స్నేహితుడు, సోదరుడు అయిన ప్రధాని అబే అహ్మద్ ఆహ్వానం మేరకు తాను ఇథియోపియా పర్యటనకు వచ్చానని మోదీ గుర్తు చేసుకున్నారు.

ఈ పర్యటన సందర్భంగా భారత్ ఇథియోపియా ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుతున్నట్లు ఇరు దేశాలు ప్రకటించాయి. వందేళ్లకు పైగా భారతీయ ఉపాధ్యాయులు ఇథియోపియా అభివృద్ధిలో భాగమయ్యారని, ఇరు దేశాల మధ్య బలమైన బంధానికి విద్య పునాది వేసిందని మోదీ అన్నారు. కాగా, ప్రధాని మోదీకి లభించిన 28వ అత్యున్నత విదేశీ పురస్కారం ఇది.


## వ్యూహాత్మక భాగస్వామ్యంగా ద్వైపాక్షిక బంధం

## ఇథియోపియా పార్లమెంటులో ప్రధాని మోడీ

**అడ్డిస్ అబాబా, డిసెంబరు 17:** ఇథియోపియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇథియోపియాతో ఉన్న ద్వైపాక్షిక బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య బంధంగా వృద్ధిచేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. సింహాల దేశంలో అడుగుపెట్టడం పట్ల తన సొంత గడ్డపైనే ఉందన్న భావన కలుగుతోందన్నారు. తన స్వస్థలమైన గుజరాత్ కూడా సింహాలకు నిలయం కావడమే ఇందుకు కారణమని మోడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇథియోపియా ప్రజాస్వామ్య ప్రయాణాన్ని ప్రశంసించిన ఆయన 140 కోట్ల భారతీయ ప్రజల తరఫున స్నేహపూర్వక సోదరభావ శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల జాతీయ గీతాలు ప్రజల్లో మాతృభూమి పట్ల గర్వాన్నీ, దేశభక్తినీ ప్రేరేపిస్తాయని కొనియాడారు. ప్రధాని మోడీ ప్రసంగించిన పార్లమెంట్లలో ఇది 18వది కావడం విశేషం. భారత జాతీయ గేయమైన వందేమాతరం , ఇథియోపియా జాతీయ గేయం రెండూ మాతృభూమిని తల్లిగా సూచిస్తాయని మోడీ అభివర్ణించారు. మన వారసత్వం, సంస్కృతి, ప్రకృతి అందాల పట్ల గర్వపడటమే కాకుండా దేశాన్ని పరిరక్షించేందుకు అవి మనకు ప్రేరణ ఇస్తాయని మోడీ పేర్కొన్నారు. తనకు లభించిన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారాన్ని వినయంతో స్వీకరిస్తున్నట్టు తెలిపారు.

భారతీయుల తరఫున ఈ గౌరవాన్ని చేతులు జోడించి దేశ గౌరవాన్ని చాటుకున్నారాయన. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సారూప్యతలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. ఇథియోపియాలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారులలో భారతీయ కంపెనీలూ ఉన్నాయని ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఇరు దేశాలూ అభివృద్ధి చెందుతున్న దేశాలు కాబట్టి పరస్పర సహకారం అందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ద్వైపాక్షిక సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా వృద్ధి చేయాలని తాము నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు వాతావరణంతో పాటు స్ఫూర్తినీ పంచుకుంటాయని ఈ సందర్భంగా మోడీ తెలిపారు.

# వంతారా సందర్శించిన మెస్సీకి అనంత్ అంబానీ భారీ గిఫ్ట్



**జామ్‌నగర్, డిసెంబరు 17:** తన గోట్ ఇండియా టూర్‌లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి గుజరాత్‌లోని జామ్‌నగర్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ స్థాపించిన వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం, పరిరక్షణ కేంద్రం అయిన వంతారా ను విజిట్ చేశారు. అక్కడ జంతువులతో మెస్సి సరదాగా సమయాన్ని గడిపారు. వంతారాను విజిట్ చేసిన మెస్సికి అనంత్ అంబానీ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. తన గుర్తుగా రిచర్డ్ మిల్లె వాచ్‌ని ఫుట్‌బాల్ స్టార్‌కు బహుమతిగా ఇచ్చారు. వంతారా సందర్శనకు వెళ్లేటప్పుడు మెస్సి చేతికి ఎలాంటి వాచ్ లేదు. అనంత్‌తో మీటింగ్ తర్వాత అతడి చేతిపై ఓ అరుదైన, అత్యంత ఖరీదైన గడియారం దర్శనమిచ్చింది. ఆ వాచ్ రిచర్డ్ మిల్లె టూర్‌బిల్లాన్ ఆసియా ఎడిషన్. ఇలాంటివి ప్రపంచంలో కేవలం 12 పీస్‌లు మాత్రమే ఉంటాయి. దీని ధర దాదాపు 1.2 మిలియన్ డాలర్లుగా నివేదికలు పేర్కొంటున్నాయి.

అంటే మన భారత కరెన్సీలో దాదాపు రూ. 10.91 కోట్లు అన్నమాట. ఈ గడియారాన్ని అనంత్ అంబానీ మెస్సికి బహుమతిగా ఇచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇక అనంత్ అంబానీ సైతం ఇలాంటి మరోవాచ్‌ను ధరించడం విశేషం. రిచర్డ్ మిల్లె 056 సఫైర్ టూర్‌బిల్లాన్ అనంత్ చేతికి కనిపించింది. దీని విలువ దాదాపు దాదాపు 5 మిలియన్ డాలర్లుగా తెలుస్తోంది. అంటే రూ.45.59 కోట్లన్నమాట. ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# మరో 15 దేశాలపై ఆంక్షలు విధించిన అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, డిసెంబరు 17:** అమెరికా తన ప్రయాణ ఆంక్షలున్న దేశాల జాబితాను మరింత పొడిగించింది. జాతీయ భద్రత, వీసా నిబంధనల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ మరో 7 దేశాలతో పాటు, పాలస్తీనియన్లపై పూర్తిస్థాయి ప్రయాణ నిషేధం విధించింది. మరో 15 దేశాలపై పాక్షిక ఆంక్షలు విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం కీలక ప్రకటనపై సంతకం చేశారు. ఈ కొత్త నిబంధనలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ తాజా నిర్ణయంతో అమెరికా ప్రయాణ ఆంక్షలు విధించిన దేశాల సంఖ్య మొత్తం 39కి చేరింది. కొత్తగా పూర్తి నిషేధం ఎదుర్కొంటున్న దేశాల్లో బుర్కినా ఫాసో, మాలి, నైగర్, దక్షిణ సూడాన్, సిరియా ఉన్నాయి. వీటితో పాటు పాలస్తీనా అథారిటీ జారీ చేసిన ప్రయాణ పత్రాలు ఉన్నవారిని కూడా ఈ జాబితాలో చేర్చారు. గతంలో పాక్షిక ఆంక్షలు ఎదుర్కొన్న లావోస్, సియెర్రా లియోన్‌లపై ఇప్పుడు పూర్తి నిషేధం విధించారు. ఇటీవల వాషింగ్టన్ డీసీలో ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులను ఆఫ్ఘన్ జాతీయుడు హత్య చేయడం, సిరియాలో ఇస్లామిక్ స్టేట్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు, ఒక పౌర ఉద్యోగి మరణించడం వంటి ఘటనల నేపథ్యంలో ట్రంప్ సర్కార్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వలస విధానాలను కఠినతరం చేయాలనే తమ వాదనకు ఈ ఘటనలు బలం చేకూర్చాయని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక పాక్షిక ఆంక్షలు విధించిన 15 దేశాల జాబితాలో అంగోలా, నైజీరియా, సెనగల్, టాంజానియా, జింబాబ్వే వంటి దేశాలు ఉన్నాయి. క్రియాశీల ఉగ్రవాద ముప్పు, అంతర్గత ఘర్షణలు, వీసా గడువు ముగిసినా దేశం విడిచి వెళ్లని వారి సంఖ్య ఎక్కువగా ఉండటం.

# 'అణుశక్తి'లోకి ఎఫ్‌డిఐలు

- లోక్‌సభ ముందుకు బిల్లు..
తప్పుపట్టిన ప్రతిపక్షాలు
- స్టాండింగ్ కమిటీకి పంపాలని నిర్ణయం
- బీమాలో వందశాతం
ఎఫ్‌డిఐలు.. బిల్లుకు ఆమోదం
- వాడుకలో లేని, కాలం చెల్లిన 71 చట్టాలు రద్దు
- దర్యాప్తు సంస్థల తీరుపై ప్రతిపక్షాల నిరసనలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** న్యూక్లియర్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేటు కంపెనీలకు భాగస్వామ్యం కల్పిస్తూ ప్రతిపాదించిన 'శాంతి' (సస్టైనబల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) బిల్లు 2025ను బుధవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇది అమల్లోకి వస్తే... భారత ఇంధన రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతుందని పేర్కొంది. 2070నాటికి నెట్ జీరో ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం దేశంలో అణు విద్యుత్ సామర్థ్యం 8.2 జిడబ్ల్యు మాత్రమే. దీనిని 2047నాటికి 100జిడబ్ల్యుకు పెంచడమే తాజా బిల్లు లక్ష్యం. ఈ చట్టం ద్వారా న్యూక్లియర్ ఎనర్జీ కేవలం విద్యుత్ రంగానికే కాకుండా వైద్యం, వ్యవసాయం, పరిశోధన రంగాల్లో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. దశాబ్దాలుగా ప్రభుత్వ గుత్తాధిపతనయంలో ఉన్న న్యూక్లియర్ ఎనర్జీ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ బిల్లు చట్టంగా మారితే పాతబడిన అటామిక్ ఎనర్జీ యాక్ట్ 1962, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్ 2010 రద్దవుతాయి. విదేశీ పెట్టుబడులకు ఆటంకంగా మారిన నిబంధనలు తొలగించి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కొత్త నిబంధనలను కేంద్రం రూపొందించింది. అణుశక్తి నియంత్రణ మండలికి తాజా బిల్లు ద్వారా చట్టబద్ధమైన అధికారులు లభిస్తాయి. ఈబిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రజా భద్రతతోపాటు జాతీయ భద్రతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే ఈ బిల్లును సమగ్ర పరిశీలన కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించాలని డిమాండ్ చేశారు. ఎంపి శశిథారూర్ మాట్లాడుతూ, జవాబుదారీతనం నిబంధనలు లేకుండా ప్రైవేటు సంస్థలకు మొత్తం అణు ఇంధన చక్రాన్ని అప్పగించడం మంచిది కాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే భవిష్యత్తు తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని బిల్లును జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా పున:పరిశీంచాలని థరూర్ విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలకు అనుమతిస్తూ ప్రతిపాదించిన బిల్లును లోక్‌సభ మూజువాణితో ఆమోదించింది. అయితే, ఈ బిల్లుపై బుధవారం రాజ్యసభలో వాడివేడిగా చర్చ సాగింది. ఇదిలా ఉండగానే పౌరుల జీవన సౌలభ్యాన్ని పెంచే ఉద్దేశ్యంతో వాడుకలో లేని, కాలం చెల్లిన 71 చట్టాలను రద్దు చేస్తూ ప్రతిపాదించిన బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టగా, మూజువాణితో ఆమోదించింది.

**దర్యాప్తు సంస్థల తీరుపై కాంగ్రెస్ మండిపాటు:** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టు ఉపశమనం ఇచ్చిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)ని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపిలు బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు. "సత్యమేవ జయతే, జత్యం గెలుస్తుంది" అని రాసి ఉన్న బ్యానర్ చేతబూని మకర ద్వార్ మెట్ల ముందు ఎంపిలు నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలి:** నేషనల్ హెరాల్డ్ కేసులో ఎట్టకేలకు న్యాయమే గెలిచిందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బుధవారం ఉదయం అభిషేక్ మను సింఘ్వి, కెసి వేణుగోపాల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా ప్రతీకారం తీర్చుకోవడానికి, గాంధీల కుటుంబాన్ని వేధింపులకు గురిచేయడానికే సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు బనాయించారని ఆరోపించారు. హెరాల్డ్ కేసు విషయంలో కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం, నిజమే ఎల్లప్పుడూ గెలుస్తుందని మరోసారి రుజువైందన్నారు. అక్రమ కేసులు బనాయింపజేసిన ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తాము పార్లమెంట్ లోపల, వెలుపల వారితో పోరాడుతూనే ఉంటాం. వారికి తగిన గుణపాఠం నేర్పుతామని స్పష్టం చేశారు.



# ప్రమాదకరస్థాయికి వాయుకాలుష్యం

## ఇంటినుంచే పనివిధానంన- బయటి వాహనాలకు నో ఎంట్రీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రభుత్వం కఠినమైన గ్రాప్4 ఆంక్షలను కొనసాగిస్తోంది. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నీ తప్పనిసరిగా 50 శాతం సిబ్బందితో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనను ఉల్లంఘించిన కంపెనీలపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. గ్రాప్4 ఆంక్షల కింద బీఎస్6 ప్రమాణాల కంటే తక్కువ ఉన్న ఇతర రాష్ట్రాల వాహనాలు ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిషేధం విధించారు. అలాగే పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపరు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో తరగతులు నిర్వహించాలని పాఠశాలలను ఆదేశించారు. ఈ నెల 15న ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 498కి చేరి అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయింది. దట్టమైన పొగమంచు కారణంగా రహదారులు కనిపించక అనేక ప్రమాదాలు జరిగాయి. విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుత ఆంక్షల వల్ల ఉపాధి కోల్పోయిన నమోదిత నిర్మాణ కార్మికులకు రూ.10,000 పరిహారం అందిస్తామని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షోభంపై స్పందించిన ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తొమ్మిది పదినెలల్లో ఏ ప్రభుత్వమూ కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించలేదని వ్యాఖ్యలుచేయడంతో ఆప్, కాంగ్రెస్ పార్టీలచేతికి విమర్శనాస్త్రాలు లభించినట్లయింది.

# మహిళల ఖాతాల్లోకి చేరాల్సిన నగదు పురుషుల ఖాతాల్లోకి..

## డబ్బును తిరిగి చెల్లించాలంటూ నోటీసులు..
## బీహార్‌లో చోటు చేసుకున్న ఘటన!

**పాట్నా, డిసెంబర్ 17:** బీహార్ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రాష్ట్రంలోని 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో కొంతమంది పురుషుల ఖాతాల్లోకి కూడా డబ్బులు బదిలీ అయినట్లు గుర్తించిన అధికారులు వాటిని రాబట్టేందుకు అపసోపాలు పడుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్‌యోజన పథకంలో భాగంగా అక్కడి ప్రభుత్వం మహిళలకు ఒక్కొక్కరి ఖాతాలకు రూ.10వేలు బదిలీ చేసింది. ఆ సమయంలో సాంకేతిక లోపం కారణంగా దర్భంగా జిల్లాలోని అహియారి గ్రామంలోని పలువురు పురుషుల ఖాతాల్లోకి రూ.10 వేలు బదిలీ అయ్యాయి. అనంతరం ఈ పొరపాటును గుర్తించిన జిల్లా అధికారులు ఖాతాల్లో జమ అయిన డబ్బును తిరిగి చెల్లించాల్సిందిగా గ్రామంలోని పలువురు పురుషులకు నోటీసులు జారీ చేశారు. అయితే ప్రభుత్వం తమ ఖాతాలలో వేసిన పదివేలు ఖర్చు అయినట్లు వారు చెబుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఆ డబ్బుతో బాతులు, మేకలు కొనుగోలు చేశామని, ఇప్పుడు ఆ నగదు తిరిగివ్వడానికి కుదరదని వారు తేల్చి చెబుతున్నారన్నారు. దీంతో గ్రామంలోని పురుషుల నుంచి డబ్బు తిరిగి రాబట్టడం ఇబ్బందికరంగా మారిందన్నారు. మరో వైపు తమ వద్ద అంత మొత్తంలో డబ్బు లేదని, అధికారులు చేసిన తప్పిదం వల్ల ఇలా జరిగింది కాబట్టి తమ ఖాతాల్లో పడిన మొత్తం నగదును మాఫీ చేయాలని అహియారి గ్రామంలోని పురుషులు ముఖ్యమంత్రి నితీష్‌ను కోరుతున్నారు.

# సెవెన్ సిస్టర్స్ వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అసహనం

## బంగ్లాదేశ్ హైకమిషన్‌కు సమన్లు..



**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు, భారత్‌కు వ్యతిరేకంగా వినిపిస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ హైకమిషనర్ మహమ్మద్ రిజాజ్ హామీదుల్లాకు విదేశాంగ శాఖ అత్యవసర సమన్లు జారీ చేసింది. ఢాకాలోని భారత దౌత్య కార్యాలయానికి వస్తున్న బెదిరింపులు, అలాగే బంగ్లా రాజకీయ నాయకుల నుంచి వస్తున్న విద్వేషపూరిత ప్రకటనలపై భారత్ తన నిరసనను గళమెత్తింది. బంగ్లాదేశ్‌లో నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నత్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ప్రధాన కారణంగా మారాయి. బంగ్లాదేశ్ 55వ విజయ్ దివస్ వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఈశాన్య రాష్ట్రాలైన సెవెన్ సిస్టర్స్ ను భారత్ నుంచి వేరు చేస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢాకాలో నిర్వహించిన ఒక నిరసన ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న శక్తులకు బంగ్లాదేశ్ ఆశ్రయం ఇస్తుందని, ఈశాన్య రాష్ట్రాలను విడగొట్టేందుకు తాము సహకరిస్తామంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. నేపాల్‌తో భేటీలో యూనస్ వివాదాస్పద వ్యాఖ్యలు ఇందుకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించింది. మరోవైపు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు లేదా ఉగ్రవాద శక్తుల కదలికలు ఉండవచ్చనే అనుమానంతో అస్సాంలోని కాచర్ జిల్లా సరిహద్దుల్లో ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది. అక్రమ రవాణా, సరిహద్దు దాటే కార్యకలాపాలను అరికట్టేందుకు అధికారులు హై అలర్ట్ ప్రకటించారు.

షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత బంగ్లాదేశ్‌లో మత ఛాందసవాదం పెరుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1971 విముక్తి యుద్ధ వారసత్వాన్ని చెరిపివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత్‌తో సంబంధాలను తెంచుకుని పాకిస్థాన్ వైపు మొగ్గు చూపే ధోరణి కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు.

మైనారిటీలపై దాడులు, భారత దౌత్యవేత్తలకు బెదిరింపులు వంటివి రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను క్లిష్టతరం చేస్తున్నాయి. ప్రస్తుతం భారత్ ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంది.

# ఆ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పను

## - మహారాష్ట్ర మాజీ సిఎం పృథ్వీరాజ్ చవాన్
## - సైన్యాన్ని అవమానించడమే: బిజెపి ఫైర్



**పుణె_న్యూఢిల్లీ, డిసెంబరు 17:** ఆపరేషన్ సిందూర్‌పై తను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పనని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ పునరుద్ఘాటించారు. తాను తప్పుగా ఏమీ మాట్లాడలేదని, కాబట్టి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. దీంతో, బీజేపీ నేతలు ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ సైనాన్ని అవమానించే,

సైనికుల పరాక్రమాన్ని కించపరిచే హక్కు లేదని, ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి దేశ ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి మన బలగాలను అవమానించడం అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా నేరుగా సీనియర్ నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తన పార్టీ సభ్యుడి వ్యాఖ్యలను ఖండించకపోవడం రాహుల్ గాంధీ మైండ్ సెట్‌ను తెలియజేస్తోందని అన్నారు. సైన్యాన్ని అవమానించడం కాంగ్రెస్ పార్టీ తీరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చవాన్‌తో పాటు రాహుల్ గాంధీ కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు.

# సంక్షిప్తంగా..

## 'వందేమాతరం' ఆలపించిన ఇథియోపియన్ సింగర్లు!



**ఆదిస్ అబాబా, డిసెంబర్ 17:** ఇథియోపియన్ సింగర్లు భారత జాతీయ గేయం 'వందేమాతరం' పాడుతున్న వీడియోను ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జాతీయ గేయం 150 యేళ్లు పూర్తి చేసుకున్న ఈ సందర్భంలో వారు వందేమాతరం గేయాన్ని ఆలపించడం తనను కదిలించిందని రాసుకొచ్చారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా మోడీ ఇథియోపియాకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ మోడీకి విందు ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో ఇథియోపియన్ సింగర్లు వందేమాతరం గీతాన్ని ఆలపించగా వీడియోను ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. వీడియోలో సింగర్లు జాతీయగేయాన్ని ఆలపిస్తుండగా మోడీ చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా కనిపించారు.

## ఓటర్ జాబితాలో చంపేసారు.. అంత్యక్రియలు చేయాలంటూ వార్డు కౌన్సిలర్ నిరసన



**కోల్‌కత్తా, డిసెంబరు 17:** పశ్చిమ బెంగాల్ లో ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ జాబితా సమగ్ర సర్వే (సర్) పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బతికి ఉన్న వారి పేర్లనూ అధికారులు తొలగించారంటూ టీఎంసీ నేతలు మండిపడుతున్నారు. అధికారుల తీరుకు నిరసనగా దాంకుని మున్సిపాలిటీ 18 వార్డు కౌన్సిలర్ సూర్య డే శ్మశానంలో ఆందోళన చేపట్టారు. సమగ్ర సర్వే తర్వాత ఎన్నికల సంఘం ప్రకటించిన ముసాయిదా ఓటర్ జాబితాలో తన పేరు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మరణించానని పేర్కొంటూ ఓటర్ జాబితాలో నుంచి తన పేరును అధికారులు తొలగించారని ఆరోపించారు. ఓటర్ జాబితాలో తనను చంపేసిన ఎన్నికల సంఘం అధికారులు వెంటనే వచ్చి తన అంత్యక్రియలు చేయాలంటూ అనుచరులతో కలిసి శ్మశానంలో బైఠాయించారు.

## అహ్మదాబాద్‌లో పది స్కూళ్లకు బాంబు బెదరింపులు

**అహ్మదాబాద్, డిసెంబరు 17:** నగరంలోని 10 స్కూళ్లకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దాంతో ఆయా స్కూళ్ల పరిధిలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆ స్కూళ్ల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. థాల్తేలోని జెబర్ స్కూల్, ఉద్గమ్ స్కూల్, గురుకుల్ రోడ్‌లోని మహారాజ అగ్రసేన్ స్కూల్, మకర్బాలోని దీతిజు ఇంటర్నేషనల్ స్కూల్, వస్త్రపూర్‌లోని నిర్మాణ్ స్కూల్, విజాల్‌పూర్‌లోని జైడల్ స్కూల్, అదలాజ్‌లోని డివైన్ స్కూల్, డివైన్ చైల్డ్ స్కూల్, కాలోల్‌లోని ఆవిష్కార్ స్కూల్, బోడక్దేవ్‌లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్, బోపాల్‌లోని న్యూ తులిప్ స్కూళ్లకు ఇవాళ ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

## పెంపుడు జాగిలాన్ని డిపెండెంట్‌గా గుర్తించాలంటూ కేసు

**వాషింగ్టన్, డిసెంబరు 17:** పెంపుడు కుక్కను చట్టపరంగా తనపై ఆధారపడిన డిపెండెంట్‌గా గుర్తించాలని కోరుతూ అమెరికాలోని అమండా రేనాల్డ్స్ అనే మహిళ అక్కడి పన్నుల విభాగం (ఐఆర్ఎస్)పై దావా వేశారు. తన ఎనిమిదేళ్ల గోల్డెన్ రిట్రీవర్ జాతి కుక్క "ఫిన్నెగన్ మేరీ రేనాల్డ్స్"కు ఆహారం, నివాసం, వైద్య సంరక్షణ వంటి అన్ని అవసరాలను తానే చూసుకుంటున్నానని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం తన కుక్క కోసం ఏటా 5,000 డాలర్లకు పైగా (సుమారు రూ. 4.5 లక్షలు) ఖర్చు చేస్తున్నానని, ఇది ఇంటర్నల్ రెవెన్యూ కోడ్ సెక్షన్ 152 ప్రకారం డిపెండెంట్ నిర్వచనానికి సరిపోతుందని ఆమె వాదిస్తున్నారు. పెంపుడు జంతువులను ఆస్తిగా పరిగణించే ప్రస్తుత చట్టాలు వాటిని పిల్లల మాదిరిగా పెంచుకుంటున్న యజమానుల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని అమండా తెలిపారు.

## అండమాన్ నికోబార్ దీవులకు ఎవరైనా పేర్లు పెట్టొచ్చు..

**పోర్ట్‌బ్లెయిర్, డిసెంబర్ 17:** అండమాన్ నికోబార్‌లోని వందలాది దీవులకు పేర్లు పెట్టే అవకాశాన్ని అక్కడి యంత్రాంగం కల్పించింది. ముఖ్యంగా జనావాసాలు లేని 586 దీవులకు పేర్లు సూచించాలని సామాన్యులకు విజ్ఞప్తి చేసింది. స్థానిక ఆదివాసీ వారసత్వం, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ వ్యక్తులు, అమరులు, ప్రత్యేకమైన వృక్ష, జంతుజాలం, జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సంఘటనలు, భౌగోళిక లక్షణాలు కలిగిన పేర్లను సూచించవచ్చని తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల భూభాగం 8249 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ మొత్తం 836 దీవులు ఉన్నాయి. వీటిలో 31 ద్వీపాలు మాత్రం నివాసయోగ్యంగా ఉన్నాయి. ప్రస్తుతం 586 దీవులకు పేర్లు లేవు.

# ఉద్యాన పంటలే ఊతం



- 15 జిల్లాల నుంచి 80 శాతం జీవీఏ
- అరటి రాబడిదే అగ్రస్థానం.. తర్వాత స్థానాల్లో మిరప, మామిడి, మల్లి, టమాట
- వ్యవసాయరంగంలో లక్ష్యాల సాధనకు 6 వ్యూహాత్మక సాధనాలు
- రైతన్నా మీ కోసం ద్వారా సత్ఫలితాలు
- వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్

విజయవాడ, డిసెంబరు 17 (ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వ్యవసాయ రంగంలో ప్రధానంగా ఉద్యానవన పంటలే ఊతమిస్తున్నాయని, జిల్లా కలెక్టర్లందరూ తమ జిల్లాలో ఈ రంగంపైన ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ సూచించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం వ్యవసాయ రంగంలో 16.47 శాతం వృద్ధి రేటుతో సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రూ.6,02,728 కోట్లతో 35.19 శాతం స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) లక్ష్యమన్నారు. ఈ దిశగా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్మాణాత్మకంగా చేపట్టామన్నారు. దీని ద్వారా ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో జీవీఏ సాధించడానికి చేపట్టాల్సిన ప్రణాళికను క్షేత్ర స్థాయిలో చేపట్టామన్నారు. దీనిద్వారా సత్ఫలితాలు సాధించబోతున్నామన్నారు. ఆయా ప్రాంతంలో జీవీఏకి ఊతమిచ్చే పంటలేవి, వాటిని సాధించడానికి చేపట్టాల్సిన చర్యలు ఏంటి అనేది కూడా విపులంగా రూపొందించామన్నారు. ఒకేసారి మూడు సీజన్లకు సంబంధించి ఈ రబీ సీజన్ రేపు రాబోయే ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

### ఉద్యాన పంటలే కీలకం

ప్రాథమికరంగమైన వ్యవసాయ రంగంలో ఐదు ఉప రంగాలున్నాయని, వాటిలో ఉద్యానవన రంగం నుంచే జీవీఏ ఎక్కువగా వస్తోందన్నారు. 16శాతం వృద్ధి రేటు ఈ రంగం నుంచి సాధించాలని లక్ష్యమన్నారు. ఉద్యానవన రంగం అందించే జీవీఏలోనూ 15 జిల్లాల నుంచే రూ.1,41,498 కోట్లతో 80 శాతం జీవీఏ సాధిస్తున్నామని చెప్పారు. ఇందులో అనంతపురం, సత్యసాయి, కర్నూలు, కడప, ఏఎస్ ఆర్ జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన 15 జిల్లాలు కూడా జీవీఏ వృద్ధి సాధనలో పురోగతి సాధించే దిశగా పనిచేయాలన్నారు.

### 22 పంటల నుంచే అత్యధిక జీవీఏ

ఉద్యానవన రంగంలో 22 రకాల ప్రధాన పంటల నుంచే అత్యధికంగా జీవీఏ వస్తోందని తెలిపారు. వీటిలో అరటి, మిరప, మామిడి, మల్లి, టమాటాల అగ్రస్థానంలో ఉన్నాయని తెలిపారు. ఒక్క అరటి పంట రూ.31,656 కోట్లతో 17.84 శాతం జీవీఏ అందిస్తోందన్నారు. తర్వాత ఎండుమిర్చి రూ.22,474 కోట్లతో 12.67 శాతం, మామిడి రూ.14,641 కోట్లతో 8.25 శాతం, మల్లె 10,749 కోట్లతో 6.06 శాతం, టమాట రూ.9,573 కోట్లతో 5.4శాతం జీవీఏ సాధిస్తున్నాయని చెప్పారు. మల్లెపూల సాగు ద్వారా కూడా రాష్ట్రం జీవీఏ గణనీయంగా సాధిస్తోందని తెలిపారు. కృష్ణా జిల్లాలో ఈ పూల సాగు ఎక్కువగా ఉందని, గుండుమల్లె మన రాష్ట్ర పుష్పమని, ఈ సాగును కూడా ఆయా జిల్లాల్లో ప్రోత్సహించడం ద్వారా అధిక జీవీఏ సాధించవచ్చన్నారు. అలాగే మామిడి రైతులకు మామిడి కవర్లు అందించి, నాణ్యత పాటించేలా రైతులను ప్రోత్సహిస్తే ఇందులో మరింత ఎక్కువ జీవీఏ సాధించవచ్చన్నారు. ప్రాథమిక రంగంలో జీవీఏ వృద్ధి లక్ష్యాలు సాధించడానికి 6 వ్యూహాత్మక సాధనాలు (స్ట్రాటజిక్ లీవర్స్) రూపొందించామన్నారు. జిల్లా కలెక్టర్లు తమ తమ జిల్లాలో ఈ రంగంలో ఎక్కడెక్కడున్నాము, ఎక్కడ వెనుకబడున్నాము అనేది ఎప్పటికప్పుడు సమీక్షించుకుని, జీవీఏ వృద్ధి లక్ష్యాల సాధించాలన్నారు. పాలు, మాంసం, గుడ్డు ఉత్పత్తిలో కూడా జిల్లాలు గణనీయమైన వృద్ధి సాధించాలని దానికి తగ్గట్లు వ్యూహాత్మకంగా పనిచేయాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ చెప్పారు..

## కలువాయిని తిరుపతిలో ఎందుకు కలపాలి?

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కలువాయి (నెల్లూరు), డిసెంబరు 17 ప్రభాతవార్త: కలువాయి మండలానికి అన్ని విధాల సౌకర్యంగా ఉండే నెల్లూరు జిల్లాను వదలి తిరుపతి జిల్లాలో కలపవల్సిన అవసరం ఏమి వచ్చిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ కలువాయి మండల వాసి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆద్వర్యంలో తిరుపతి జిల్లా వద్దు, నెల్లూరు జిల్లా ముద్దు ఉద్యమ కలువాయి జెఏసి, టిడిపి సీనియర్ నాయకులు, బిజెపి నాయకులు కలిసి విజయవాడ దగ్గర స్వర్ణభారత్ ట్రస్టులో బుధవారం మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడ్ని కలిసి వినతి పత్రం అందజేశారు. మా ప్రాంత వాసుల మొర ఆలకించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళి న్యాయం చేయాలని ఈ సందర్బంగా మాజీ ఉపరాష్ట్రపతిని కోరారు. టిడిపి నాయకులు నాగిరెడ్డి రాజారెడ్డి, పెరంకొండ వేణునాయుడు, మజ్జిగ పెంచలరెడ్డి, రాపూరు దశరదరామిరెడ్డి, సుల్తాన్, బిజెపి సీనియర్ నాయకులు, సన్నపనేని వేణు గోపాల్ నాయుడు, రాపూరు ఎఎంసి డైరక్టర్ దండు పెంచలయ్య, కలువాయి బిజెపి అద్యక్షులు జి.మల్లికార్జున నాయుడు, రాపూరు బిజెపి అద్యక్షులు దూడల పెంచలయ్య, తదితరులున్నారు.

## 'సేవ్ కలువాయి అంటూ' జలదీక్ష



కలువాయి (నెల్లూరు), డిసెంబరు 17 ప్రభాతవార్త: "సేవ్ కలువాయి అంటూ" కలువాయి మండలం ప్రజలు వినూత్న తరహాలో పెన్నానదిలో దిగి నిరసన తెలిపారు. నదిలో దిగి జలదీక్ష చేశారు. కలువాయిని నెల్లూరులో కలిపే వరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఏప్రాతిపదికన కలువాయిని తిరుపతిలో కలుపుతారని వారు ప్రశ్నించారు. రాజకీయ స్వార్దంతో కలువాయిని తిరుపతిలో కలిపితే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. 9వ రోజు రిలే నిరాహార దీక్షలో గ్రామ మాజీ సర్పంచ్ విశ్రాంత ఉపాధ్యాయులు గుడిగుంట శ్రీనివాసులతోపాటు ఉయ్యాలపల్లి ప్రజలు దీక్షలో పాల్గొనగా యుటిఎఫ్, విఒఎలు ఆశా, పొదుపు మహిలు సంఘీబావం తెలిపారు 'గురువారం స్వచ్ఛంద" బంద్‌కు జెఏసి పిలుపునిచ్చింది. వ్యాపాం సంస్దలు, విద్యాసంస్దలు, ప్రవేటు కార్యాలయాలు స్వచ్ఛంధంగా మూసివేయనున్నట్లు ఆందోళన కారులు తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు మూపిస్తామని వారు పేర్కొన్నారు.

## హోంమంత్రి అనితకు లోకేష్ ప్రశంస



విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్తప్రతినిధి: కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను యజ్ఞంలా పూర్తి చేశారని హోం మంత్రి అనితను మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. పోస్టుల భర్తీని అడ్డుకునే కుట్రలను అనిత సమర్థంగా ఎదుర్కొన్నారని కితాబు ఇచ్చారు. హోంమంత్రితో పాటు అధికార యంత్రాంగానికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. తాను యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను హోంమంత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ఒక యజ్ఞంలా పూర్తి చేశారంటూ మంత్రి అనితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "యువగళం పాదయాత్రలో కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నా హామీని నెరవేర్చేందుకు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఒక యజ్ఞంలా చేపట్టి పూర్తి చేసిన గౌరవ హోం మంత్రి వంగలపూడి అనితకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు వేసిన కుట్రపూరిత కేసులను అత్యంత చాకచక్యంగా పరిష్కరించడం వెనుక అధికార యంత్రాంగానికి హోంమంత్రి పూర్తి సహాయ, సహకారాలు అందించారు. సీఎం, డిప్యూటీ సీఎం చేతుల మీదుగా కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హోం మంత్రికి, అధికార, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# యూరియా కొరతతో రైతులకు చుక్కలు

- ఎక్కడా లభ్యం కాకపోవడంతో ఇబ్బందుల్లో అన్నదాత

చిత్తూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త: యూరియా కొరత తీవ్రంగా వుండటంతో పంటలు సాగు చేస్తున్న రైతులకు చుక్కలు కన్పిస్తున్నాయి. యూరియా కోసం ఆర్‌బికెలు, మండల కేంద్రాల్లోని ఎరువుల ఏజెన్సీలు, సహకార సంఘాల వద్దకు వెళ్తున్నప్పటికీ ఎక్కడా యూరియా లభ్యం కాని పరిస్థితి నెలకొంది. పంటల సాగుకు ప్రస్తుతం నీరు సమృద్ధిగా వున్నప్పటికీ యూరియా లేకపోవడంతో పైర్లు ఏపుగా పెరగక పోవడంతో ఈసారి దిగుబడి తక్కువ అవుతుందని రైతులు విలపిస్తున్నారు. ఓ వైపు జిల్లాలో ఒక్క బస్తా యూరియా లభించక రైతులు అల్లాడుతుంటే వ్యవసాయ శాఖ మాత్రం ఇందుకు విరుద్ధంగా రైతులకు సరిపడ యూరియా నిల్వలు వున్నాయని, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత అనే మాట లేదని ప్రకటనలు ఇస్తుండటంతో రైతులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. గత పది రోజులుగా జిల్లా కేంద్రం చిత్తూరుతో పాటు పరిసర మండలాలైన బంగారుపాళ్యం, పూతలపట్టు, యాదమరి, జిడినెల్లూరు, గుడిపాల తదితర మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా వుంది. ఈ మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్ళి యూరియా పరిస్థితిని రైతులు అడిగితే మండలానికి అవసరం కంటే ఎక్కువ యూరియా పంపిణీ చేశామని, రైతులు ఇబ్బంది పడకుండా వుండటానికి యూరియా తెప్పిస్తున్నామని,



వారం రోజుల్లో రావచ్చునని, వచ్చిన వెంటనే ఆర్‌బికెల ద్వారా రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామనే సమాధానం వస్తోంది.

### రబీకి సరిపడ యూరియా

### – 20,183 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక

జిల్లాలో రబీ సీజన్‌లో పంటల సాగుకు అవసరం అయ్యే యూరియాను పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు చిత్తూరు జిల్లా పరిధిలో 2025-26 రబీ సీజన్‌లో అన్ని రకాల పంటల సాగు చేయడానికి 20,183 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని గుర్తించి ఆ మేరకు వ్యవసాయ శాఖ ప్రణాళికను తయారు చేసింది. జిల్లాలో ఈ ఏడాది అక్టోబర్ 1నాటికి 2,047 మెట్రిక్ టన్నుల యూనియా ప్రారంభ నిల్వలు అందుబాటులో వున్నాయి. డిసెంబర్ 31వ తేదీ వరకు రైతులకు మొత్తం 5,747 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 6,617 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో వుంచారు. అలాగే డిసెంబర్ నెలాఖరు నాటికి జిల్లాకు మరో 600 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులోకి రానుంది. జిల్లాలో ఇప్పటి వరకు 4,217 మెట్రక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. ఈ నెల 11వ తేదీ నుండి డిసెంబర్ నెలాఖరు వరకు రైతులకు 1,247 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం 2007 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్ఎస్‌కెలు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్, హోల్‌సేల్ డీలర్లు, కో-ఆపరేటివ్ సొసైటీలు, కంపెనీ గోడౌన్లలో అందుబాటులో వుంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎరువుల కొరత లేదని వ్యవసాయ శాఖ పేర్కొంది. అలాగే నానో యూరియా, నానో డిఎపిని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఇవి సాంప్రదాయక ఎరువులకు వంద శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తున్నాయి.

# వైసిపి నేతల అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు వెల్లువ

- వారసత్వ భూమిపై మోసపూరిత రిజిస్ట్రేషన్.. న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి
- ఇంటి తనఖా పేరు మోసం.. డబ్బులు చెల్లించమని అడిగితే చంపుతామని బెదిరింపులు
- అర్జీలు స్వీకరించిన గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి నాని, ఎపి స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామానికి చెందిన జయరాం అఖండ నాయక్ నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ తమ గ్రామ పరిధిలో వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాను. 2019-20 సంవత్సరంలో ఆర్‌అండ్‌బి డిపార్ట్మెంట్ పరిధిలో గుట్టపల్లె-కోన నుంచి సంబేపల్లె వరకు (వయా శెట్టిపల్లె) సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మత్తుల పనులకు సంబంధించిన టెండర్ తనకు లభించింది సదరు పనిని పూర్తిగా నిర్వహించాను. అయితే అప్పటి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన యం. చిదంబర్ రెడ్డి అనే వ్యక్తి అన్యాయంగా జోక్యం చేసుకుని సదరు పనులకు సంబంధించిన బిల్లుల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఘటన వల్ల తనకు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు కలిగాయి. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి నాని, ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఎంసీ కొత్తూరు గ్రామానికి చెందిన బాలాజీ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమ కుటుంబానికి చెందిన సర్వే నెంబర్ 302/2, విస్తీర్ణం 2.45 సెంట్లు గల పిత్రార్జిత భూమిని ఇప్పటికీ తామే అనుభవంలో ఉంచుకుని సాగు చేసుకుంటున్నాం. అయితే శ్రీహరి కుమార్ రాజు అనే వ్యక్తి 1407 2008 తేదీన తమకు తెలియకుండా తమ తండ్రిని మోసం చేసి ఆ భూమిని తన పేరున రాసించుకున్నాడు. ఆ సమయంలో తాము అందరం మైనర్లుగా ఉండటంతో ఈ అక్రమ రిజిస్ట్రేషన్ విషయం తెలియకపోయింది. ఇప్పుడు విషయం తెలిసిన తరువాత సంబంధిత అధికారులను ఆశ్రయించినా ఇప్పటి వరకు న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని ఈ వ్యవహారాన్ని సమగ్రంగా విచారించి మోసపూరితంగా రాసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమ పిత్రార్జిత భూమిని తిరిగి తమకు అప్పగించాలని కోరారు.

కృష్ణా జిల్లా గుడివాడ మండలం లింగవరం గ్రామానికి చెందిన సురేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన వెంకట శ్రీరామ మూర్తి, జ్యోతి రవితేజ, నవ్యశ్రీ అనే వ్యక్తులు తమ ఇంటిని తనఖా పెట్టి 21122022 తేదీన తన వద్ద నుంచి రూ.5,00,000/ (అక్షరాలా ఐదు లక్షల రూపాయలు) తీసుకున్నారు. ఒక సంవత్సరంలో మొత్తం సొమ్మును తిరిగి చెల్లిస్తామని నమ్మబలికారు. అయితే ఒక సంవత్సరం గడిచి రెండు నెలలు అయినప్పటికీ సొమ్ము తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే "మేము ఇవ్వము, మాకు రాజకీయంగా బలమైన వ్యక్తుల మద్దతు ఉంది అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల మరలా డబ్బులు అడిగిన సందర్భంలో తమ వద్దకు వస్తే చంపుతామని బెదిరింపులు చేశారు. తమయందు దయవుంచి వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ప్రకాశం జిల్లా త్రిపురాంతకము గ్రామానికి చెందిన రమేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 134 1ఏ1 లో భూమి కలదు. ఆ భూమి నిషేధిత జాబితలో ఉన్నది. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ సంప్రదించగా ఆ భూమి పట్టా భూమి అని చెప్పారు. నిషేధిత జాబితాలో కొనసాగుతుండ టంతో ఎలాంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి నెలకొంది. తాను ముడివేముల గ్రామానికి చెందిన అన్నసూయ వద్ద నుండి సదరు స్థలాన్ని కొనుగోలు చేసి స్వాధీనం చేసుకున్నాను. కావున సంబంధిత అధికారుల చేత సదరు భూమిని సమగ్రంగా పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరాడు.

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం మజాకోరువువారిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 12413లో ఉన్న భూమిని తమ తాత ఆకుల వెంకటస్వామి, తమ తండ్రి నారాయణప్పలు 1955 సంవత్సరం నుంచే సుమారు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటూ వచ్చారు. అయితే అదే గ్రామానికి చెందిన మునిరెడ్డి, అమ్మిరెడ్డి, రవీంద్రరెడ్డి అనే ముగ్గురు వ్యక్తులు కలిసి తాము సాగు చేస్తున్న భూమికి సంబంధించి తనకు తెలియకుండా ప్రభుత్వానికి తప్పుడు రికార్డులు సమర్పించి భూమిని అక్రమంగా తమ పేర్లపై నమోదు చేసుకుని తరువాత ఇతరులకు విక్రయించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినప్పటికి ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంకు చెందిన మందమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం వేలుబండ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 500 చదరపు గజాల స్థలం ఉంది. సదరు స్థలం చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయింది. అయితే తమ స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించారు. కావున తమ స్థలాన్ని గుర్తించి తమ న్యాయం చేయాలని కోరారు.

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం దేవలం కురవపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. ముష్టూరులో సర్వే నంబర్లు 179, 182లలో విస్తీర్ణం 4.39 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి తన, నారాయణ అనే వారిపై పేరుపై పట్టా మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం, ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.



## పోష్‌పై అవగాహన ఉండాలి

- ఇబ్బంది పెడితే భయపడకుండా వెంటనే తెలియజేయాలి
- విద్యార్థినులతో మహిళా కమిషన్ చైర్ పర్సన్ శైలజ

శ్రీకాకుళం, డిసెంబరు 17 ప్రభాతవార్త: లైంగిక వేధింపులను ఎదుర్కొనేందుకు మహిళలకు చట్టాలపై అవగాహన అత్యంత కీలకం, భయం వల్ల మౌనం పాటించకుండా ధైర్యంగా ముందుకు రావాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలు గౌరవం, భద్రతతో జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిన మౌళిక హక్కు అని అన్నారు. ఎచ్చెర్ల ఐఐటి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పోష్, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లైంగిక వేధింపులు అనేవి కేవలం శారీరకమే కాకుండా, మాటలు, సంకేతాలు, అసభ్య వ్యాఖ్యలు, మెసేజ్‌లు, సోషల్ మీడియా ద్వారా కూడా జరుగుతాయని విద్యార్థులకు వివరించారు. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నిరోధించేందుకు 2013లో పిఒఎస్‌హెచ్ చట్టం అమలులోకి వచ్చింది, ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు తప్పనిసరి. కమిటీలు బలంగా పనిచేస్తేనే భయరహిత వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన మహిళపై ఒత్తిడి, బెదిరింపులు, ప్రతీకార చర్యలు తీసుకోవడం చట్టరీత్యా నేరమని, మహిళా కమిషన్ ఫిర్యాదుదారుల గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, విద్యార్థులు అవగాహన పొందేలా సెమినార్లు, వర్క్ షాప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇబ్బంది ఏదైనా ఉంటే తప్పకుండా తెలియజేయాలని, మహిళా కమిషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ఛైర్మన్, ఎచ్చెర్ల ఐఐటి ఛాన్సలర్ ప్రొఫెసర్ కొత్తా మధుమూర్తి, ఐఐటి డైరెక్టర్ కె. బాలాజీ, పరిపాలనాధికారి రామకృష్ణ, డీన్ డా. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


## సివిల్స్‌లో మెరిసిన అనంత ఆణిముత్యం

### హరికృష్ణ ప్రసాద్‌కు 22వ ర్యాంకు



అనంతపురం, డిసెంబరు 17 ప్రభాతవార్త బ్యూరో: సివిల్ సర్వీస్ ఫలితాల్లో అనంతపురం జిల్లా కుర్రాడు అత్యుత్తమ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించారు. ఆత్మకూరు మండలం సిద్ధిరాంపురం గ్రామానికి చెందిన తాళ్లూరు హరికృష్ణ ఈ ఏడాది సివిల్ సర్వీస్ పరీక్ష ఫలితాల్లో 22వ ర్యాంక్ సాధించడం విశేషం. హరికృష్ణ ప్రసాద్ ఐఈఎస్‌లో మంచి ర్యాంకు సాధించడం పట్ల ప్రజల్లో వ్యక్తం అవుతోంది. సామాన్య రైతు కుటుంబం తల్లూరు నిర్మల, తల్లూరు వెంకటేశ్వర ప్రసాద్ దంపతులకు హరికృష్ణ ప్రసాద్ జన్మించారు. చిన్నప్పుడు నుంచి కష్టపడి చదివి రాణించారు. ఢిల్లీ ఐఐటి నుంచి గ్రాడ్యుయేషన్ తీసుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా కుప్పంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. హరికృష్ణ ప్రసాద్‌కు సివిల్ సర్వీస్ పరీక్షల్లో మంచి ర్యాంకు రావడం పట్ల అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సంబంధించి అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హర్షం వ్యక్తం చేయడంతో పాటు హరికృష్ణ ప్రసాద్‌కు ఫోన్ చేసి అభినందించారు.

## పరకామణి చోరీ: జగన్ వ్యాఖ్యలపై సాధుపరిషత్ ఫైర్




విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: పరకామణి చోరీని చిన్న కేసు అని మాజీ సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యానించడంపై సాధుపరిషత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హిందువులంటే వైఎస్సార్సీపీ నేతలకు అంత హీనంగా కనిపిస్తున్నారా అని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆగ్రహించారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామిని కించపరిచేలా జగన్ మాట్లాడతారా అని, ఆయన వ్యాఖ్యలు వింటుంటే గుండె పగిలిపోతోందని మండిపడ్డారు. వేంకటేశ్వరస్వామి గురించి మాట్లాడేటప్పుడు ఎంతో భక్తిభావంతో ఉండాలని హైకోర్టు మొట్టికాయలు వేసినా జగన్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. హిందూ మతం, దేవాలయాలపై దాడి చేయడమే వైఎస్సార్సీపీ పనిగా పెట్టుకుందని అన్నారు. ఆ పార్టీ నేతలు హిందువుల పక్షాన ఎప్పుడు నిలబడ్డారో చెప్పాలని శ్రీనివాసానంద సరస్వతి నిలదీశారు. "హిందువులంటే వైఎస్సార్సీపీ నేతలకు అంత హీనంగా కనబడుతున్నారా. వెంకటేశ్వరస్వామిని కించపరిచేలా మాజీ సీఎం జగన్ మాట్లాడతారా. మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు చూస్తే గుండె పగిలిపోతుంది. వెంకటేశ్వరస్వామి గురించి మాట్లాడేటప్పుడు ఎంత భక్తిభావంతో మాట్లాడాలి. హైకోర్టు మెట్టికాయలు వేసినా జగన్‌కు బుద్ధి రాకపోతే ఏం చేయలేం. హిందూ మతం, దేవాలయాలపై దాడి చేయడమే వైఎస్సార్సీపీ పనిగా పెట్టుకుంది. హిందువులకు చేసిన మంచిపని ఒక్కటైనా వైఎస్సార్సీపీ నేతలు చెప్పగలరా. వైఎస్సార్సీపీ నేతలు ఏ రోజు హిందువుల పక్షాన నిలబడ్డారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## షర్మిలకు బర్త్‌డే విషెస్ చెప్పిన సిఎం, డిసిఎం

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా షర్మిలకు సిఎంతోపాటు వివిధ పార్టీల నేతలు రాజకీయ పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకి జన్మదిన శుభాకాంక్షలు. ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు చిరాయువు, సుఖ సంతోషాలు అందించాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. అయితే, షర్మిల సోదరుడు, వైసీపీ అధినేత జగన్ మాత్రం ఆమెకు బహిరంగంగా శుభాకాంక్షలు తెలుపలేదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న రాజకీయ విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం మరోసారి వారి మధ్య దూరాన్ని స్పష్టం చేస్తోంది.



# దుర్గమ్మవారి ఆలయంలో అన్ని సేవలు అన్‌లైన్‌లోనే

● చైర్మన్ రాధాకృష్ణ, ఇఓ శ్రీనానాయక్ వెల్లడి

● రూ.10లక్షల విలువైన పరికరాల విరాళం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 17 ప్రభాతవార్త: శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో ఇకపై అన్ని సేవలు ఆన్‌లైన్లో సులభంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ఆలయ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణలు వెల్లడించారు. బుధవారం ఆలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మాత భక్తులకు అన్ని సేవలు అందుబాటులోకి తేవడానికి అవసరమైన కంప్యూటర్ పరికరాలను దాతలు అందించారని తెలిపారు. ఇఓ మాట్లాడుతూ 300 సిసి కెమేరాలతో కూడిన కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భవానీ దీక్షల్లో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 5.27లక్షల మంది భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారన్నారు. ఈ సందర్భంగా దీక్షల విరమణ ఉత్సవాలకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

### ఆన్‌లైన్ కోసం విరాళం

బుదవారం రు.10,13,000ల విలువైన కంప్యూటర్లు, ప్రింటర్లు, యుపిఎస్ తదితర పరికరాలను దాతలు లక్ష్మీనరసయ్య చౌదరి, బార్య నాగేశ్వరి, వారి కుటుంబసభ్యులు అశోక్‌చౌదరి, అలేఖ్య, అంజలి, అద్విక, అవినాష్‌చౌదరి, లీల, సర్వచౌదరి, అర్జున్‌చౌదరి లు ఇఓ, చైర్మన్లకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

### హుండీ లెక్కింపుల్లో రు.1,27,90,645లు

దుర్గమ్మవారికి శ్రీ భవానీ దీక్షల విరమణల ఉత్సవాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా రు.1,27,90,645లు లభించినట్లు ఇఓ వికె శీనానాయక్ తెలిపారు. బంగారం 18 గ్రాములు, వెండి 2 కెజిల 474గ్రాములు లభించాయన్నారు. గురువారం కూడా లెక్కింపులు కొనసాగుతాయని ఇఓ తెలిపారు.



# రైళ్లలో పరిమితి మించిన లగేజికి అదనపు ఛార్జీలు

ఇకపై 10 గంటల ముందే రిజర్వేషన్ చార్టు తయారీ




న్యూఢిల్లీ, డిసెంబరు 17: పరిమితికి మించి రైల్వేల్లో లగేజిని తీసుకెళుతున్న సంఘటనలపై రైల్వేశాఖ దృష్టిసారించింది. అధిక లగేజిపై అదనపు ఛార్జిలు వసూలు చేసేందుకు నిర్ణయించింది. ఎసి మొదటి తరగతిలో 70 కిలోలవరకూ లగేజికి అనుమతి ఉంటే ఎసి టూటైర్‌లో 50 కిలోలవరకూ లగేజికి అనుమతి ఉంది. అలాగే ఏసీ త్రీటైర్‌లో 40 కిలోల లగేజివరకే అనుమతి ఉంది. జనరల్ బోగీలో 35 కిలోల లగేజివరకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆపై లగేజిలకు రైల్వే రవాణా నిబంధనలను అనుసరించి అదనపు ఛార్జిలు వసూలు చేస్తారని రైల్వేశాఖప్రకటించింది. అలాగే పరిమితికి మించిన సైజులో ఉన్న బ్యాగ్‌లపైనా జరిమానా ఉంటుందని రైల్వే శాఖ వెల్లడించింది.

**10 గంటలకు ముందే చార్ట్ తయారీ**

అలాగే రైలు ప్రయాణాల్లో అనిశ్చితిని తొలగించేందుకు రిజర్వేషన్ చార్టులను మరింత ముందుగానేప్రకటించాలనినిర్ణయించింది. ఇప్పటివరకూ రైలు బయలుదేరడానికి నాలుగు గంటలముందు తయారుచేసే రిజర్వేషన్ చార్టును ఇకపై 10గంటలముందుగానే ఖరారుచేయనున్నది. ఇందుకు సంబంధించి చార్ట్ తయారీ షెడ్యూలును రైల్వేబోర్డు అప్‌డేట్‌చేసింది. సుమారు 10 గంటలముందే టికెట్‌స్టేటస్‌ను చెక్‌చేసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లుచేసుకోడానికి వీలుంటుందని రైల్వేశాఖ భరోసా ఇస్తోంది. ఉదయం ఐదునుంచి మధ్యాహ్నం రెండు గంటలలోపు బయలుదేరే రైళ్లకు తొలిచార్టు ముందురోజు రాత్రి 8 గంటలకే రూపొందిస్తారు. మధ్యాహ్నం రెండునుంచి రాత్రి 11.59 గంటలవరకూ అర్థరాత్రి 12 గంటలనుంచి ఉదయం ఐదు గంటలవరకూ బయలుదేరే రైళ్ల తొలిచార్టునుకనీసం పదిగంటలముందు రూపొందించాలనిరైల్వేబోర్డు నిర్ణయించింది. అన్ని జోనల్ కార్యాలయాలకు లేఖలు రాసింది.

# ఢిల్లీలో భారీగా నకిలీ మందుల పట్టివేత

## ఇద్దరి అరెస్టు, కల్తీ ఆయింట్‌మెంట్ల బాక్స్‌లు, ఇతర ఔషధాలు జప్తు

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో భారీగా నకిలీ మందులు పట్టుబడ్డాయి. ఢిల్లీ పోలీసులు, డ్రగ్స్ అధికారులు సం యుక్తంగా చేబట్టిన దాడుల్లో ఐదు కోట్ల రూపాయల విలువ చేసే ఔషధాలు, రా మెటీరియల్, కల్తీ ఆయింట్‌మెంట్ల బాక్స్‌లు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరికొందరు పారిపోయారు. ఢిల్లీ సమీపంలోని ఘజీయాబాద్‌లో నకిలీమందుల కార్ఖానా వున్నట్లు అందిన సమాచారంపై ఢిల్లీ పోలీసులు, డ్రగ్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో బెట్నోవెట్ సి, క్లోబ్ జి ఆయింట్‌మెం ట్ల బాక్స్‌లు నకిలీవి పెద్ద సంఖ్యలో లభ్యమయ్యాయి. ఘజీయాబాద్‌లో దాడులు చేశాక ఢిల్లీ లోని తెలివారలో గల ఓ గోదాములో నకిలీ మందులు వున్నాయన్న సమాచారంపై దాడులు చేయగా అక్కడ కూడా భారీగా కల్తీ సరుకు పట్టుబడింది. దీంతోతపాటు 3700 కిలోల రా మెటీరియల్ దొరి కింది. దీనిని నకిలీ మందుల తయారీకి వాడుతున్నట్లు తేలింది. చర్మ సంబంధ వ్యాధులకు వాడే ఆయింట్‌మెంట్లను ఈ ముఠా కల్తీ చేస్తున్నట్లు తేలింది. ఇక్కడ విశాల్ గుప్తా. గౌరవ్ భగత్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. 2019 నుంచి వీరు నకిలీ ఔషధాలు అమ్ముతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఢిల్లీ డిసిపి (క్రైం) ఆదిత్య గౌతం ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

ఉద్గం పథకం పేరిట సైబర్ నేరగాళ్ల కొత్త మోసాలు

# లింకులు పంపి దోచేస్తున్న కేడీలు

## అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం పోలీసుల సూచన

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల బరితెగింపు కొత్త రూపం సంతరిం చుకుంది. ఇప్పటి వరకు ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు, మా ట్రిమోనియల్ వంటి నేరాలతో అమాయకులను నిండా ముంచిన నేరగాళ్లు ఇప్పుడు ఆర్‌బిఐ కొత్తగా ప్రవేశపెట్టిన ఉద్గం పథకాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని మోసాలకు దిగసాగారు. ఈ మోసాలను ఓసారి పరిశీలిస్తే దేశ వ్యాప్తంగా కోట్లాది మంది తమ బ్యాంకులోని ఖాతాలలో చిన్న మొత్తాలను అలాగే వదిలేసి ఖాతాలను నిర్వహించడం లేదు. ఇలాంటి ఖాతాలు కోట్ల సంఖ్యలో వున్నట్లు దీనివల్ల 30 వేల కోట్ల రూపాయలు బ్యాంకుల్లో నిర్వహణ లేకుండా వున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది. బ్యాంకుల ఖాతాలతో పాటు చిన్నా చితక ఎఫ్‌డిలు, డెవిడెండ్లు, షేర్లు, మ్యూవల్స్ ఫండ్స్ కూడా లక్షల సంఖ్యలో వుండిపోయాయి. ఏళ్ల తరబడి వీటి నిర్వహణ చూడని ఖాతాదారులు వాటిని వెంటనే మూసివేయడం లేదా సవ్యంగా నిర్వహించి అందులోని డబ్బులను తీసుకోవాలని ఆర్‌బిఐ కోరింది. ఇందు కోసం ఉద్గం పేరిట ఓ పథకాన్ని ప్రవేశపెట్టింది. మీ ధనం... మీ హక్కు పేరిట ఆర్థిక శాఖ ఈ పథకం అమలు చేసింది. ఈ పథకం వచ్చే ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు వుంటుంది. రెండు నుంచి పదేళ్ల వరకు నిర్వహణలో లేని ఖాతాల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఈ పథకాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటు న్నారు. ఆర్‌బిఐ పేరిట ఎస్‌ఎం ఎస్‌లు లేదా లింకులు పంపుతూ అనేక మందిని మోసం చేస్తున్నారు. నిర్వహణ చూడని ఖాతాదారులు వీటిని పట్టించుకోవడం లేదు.

బ్యాంకు ఖాతాలు కలిగి నిర్వహణ చూడని వారు తమకు వచ్చిన మెసేజ్‌లు, లింకులు నిజమైనవి గా భావిస్తూ సైబర్ నేరగాళ్ల లింకులను ఓ పెన్ చేస్తే అంతే సంగతులు. ఇలా లింకులను క్లిక్ చేసిన ఢిల్లీ, హరియాణా, తమిళనాడుకు చెందిన కొందరు తమ బ్యాంకుల్లో వున్న లక్షలాది రూ పాయలు పోగొట్టుకున్నారు. ఐడి, పాస్ వర్డ్‌లు, ఓటిపిలు పంపుతూ నిమిషాల వ్యవధిలో ఖా తాలను ఈ నేరగాళ్లు ఖాళీ చేస్తున్నారు. ఈ తరహా మోసాలపట్ల అందరు అప్రమత్తంగా వుండాలని, ఫోన్‌లలో వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపిలు, పాస్ వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దన సైబర్ క్రైం పోర్టల్ అధికారులు, సైబర్ క్రైం పోలీసులుకోరుతున్నారు. ఎలాంటి అను మానం వున్నా 1930 లేదా సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు కోరుతున్నారు.

# చైనా నేరగాడితో దోస్తీ చేసిన ముంబయి సైబర్ నేరస్థుడి అరెస్టు

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ఆదిత్యా బిర్లా గ్రూపు కంపెనీ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ ప్రకటన వుంచి ట్రేడింగ్‌లో భారీ లాభాలు ఇస్తామని నమ్మించి అమాయకులను మోసం చేసిన ఓ నేరగాడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ నేరగాడు చైనా సైబర్ నేరగాడితో దోస్తీ చేసినట్లు తేలింది. పట్టుబడ్డ నేరగాడు హైదరాబాద్‌లో ఓ వ్యాపారిని 32 లక్షల రూపాయలు మోసం చేసినట్లు తేలింది. నెల రోజుల క్రితం సో షల్ మీడియాలో వచ్చిన ప్రకటనను నమ్మిన వ్యాపారి దీనిని క్లిక్ చేయగా సదరు నేరగాడు ఫోన్‌లో మాట్లాడాడు. అనంతరం సైబర్ నేరగాడు వ్యా పారిని మాటల్లో ముంచెత్తి ట్రేడింగ్‌లో లాభాలుంటాయని చెబుతూ తాను సూచించిన వాటిలో పెట్టుబడులు పెట్టాలని సూచించి 32 లక్షల రూపా యలు కాజేశాడు. దీని తరువాత సైబర్ నేరగాడు పత్తా లేకుండా పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా వి చారించగా ఈ గోల్‌మాల్‌కు పాల్పడింది ముంబాయికి చెందిన ఒమర్‌గా తేలింది. అతను చైనా సైబర్ నేరగాడితో కలిసి కొంతకాలంగా భారత్‌లో గో ల్‌మాల్ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తేలింది. ఇతని ముఠాలో గుజరాత్‌కు చెందిన రిషీ తుషార్, వినాయక్ రాజేందర్‌లు వున్నారని తేలింది. వీరంతా చైనా నేరగాడికి మ్యూల్ ఖాతాలు ఇస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

దేశ వ్యాప్తంగా 12 కేసుల్లో వీరు నిందితులుగా తేలింది. ఈ క్రమంలో చైనా నేరగాడికి 50 లక్షల రూపాయలు క్రిప్టో కరెన్సీ ద్వారా ఇచ్చినట్లు తేలింది. పట్టుబడ్డ ఒమర్ నుంచి లాప్‌టాప్‌తో పాటు సెల్‌ఫోన్‌ను ఇం కొన్ని వస్తువులను జప్తు చేశారు.

# అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల పట్టివేత

## 44 కిలోల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గంజాయితో పాటు డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పడుతున్న ఈగల్ (పూర్వపు టి. నాబ్) పోలీసులు బుధవారం నాడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించగా ఇద్దరు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 22 లక్షల రూపాయల విలువచేసే 44 కిలోల గంజాయి జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఈగల్ పోలీసులు, రైల్వే పోలీసులు తరచూ దాడులు నిర్వహిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఈగల్ పోలీసులు, రైల్వే పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై దాడులు చేబట్టారు. ఇక్కడ అను మానిత ప్రయాణీకులను తనిఖీ చేయగా ఇద్దరువ్యక్తుల వద్ద సంచుల్లో వున్న 44 కిలోల గంజాయి పట్టుబ డింది. గంజాయితో పట్టుబడ్డ వ్యక్తుల ను ఢిల్లీకి చెందిన మింటూ, నూర్ ఆలంగా గుర్తించారు. వీరిద్దరు ఢిల్లీకి చెందిన బడా డ్రగ్స్ స్మగ్లర్ రహమాన్ కోసం దందా చేస్తున్నట్లు తేలింది. విజయనగరం నుంచి సికింద్రాబాద్‌కు గంజాయితో వచ్చిన వీరు ఇక్కడినుంచి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఢిల్లీకి గంజాయి తరించాలని పథకం పన్నారు. పట్టుబడ్డ ఇద్దరిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

# సోనూసూద్ ఉదారం

## 500 మంది మహిళలకు ఉచిత రొమ్ముకేన్సర్ చికిత్స



**ముంబయి, డిసెంబరు 17:** బాలీవుడ్ నటుడు, రియల్ హీరో గా పేరొందిన సోనూసూద్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న 500 మంది మహిళలకు చికిత్స చేయించారు. తన ఫౌండేషన్ ద్వారా ఈ చికిత్సలకు అయిన ఖర్చును భరించామని సోనూసూద్ తెలిపారు. ఇది ప్రారంభమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడ తామని వివరించారు. మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపైన మరింత దృష్టి సారించినట్లు సోనూసూద్ పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్ బాధిత మహిళలు 500 మందిని మేం కాపాడగలిగాం. శస్త్రచికిత్సతో వారందరికీ కొత్త జీవితం లభించింది. 500 కుటుంబాలలో ఆనందం నింపినందుకు సంతోషంగా ఉందన్నారు.

# వడివడిగా తెలంగాణ కొత్త హైకోర్టు

● రాజేంద్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న హైకోర్టు భవన నిర్మాణ సముదాయం ● రూ.2,583 కోట్లతో కట్టడాలు

● పనులను పరిశీలించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్



హైదరాబాద్, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: రాజేంద్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న కొత్త హైకోర్టు భవన సముదాయం పనుల పురోగతిని రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ బుధవారం పరిశీలించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్లు (బిల్డింగ్స్, ఎలక్ట్రికల్), ఆర్‌అండ్‌బీ ఫీల్డ్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్ సంస్థ డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, కన్సల్టెంట్లు టీమ్ వన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు పాల్గొన్నారు. పనుల వేగం, క్రమబద్ధత, నాణ్యతను వికాస్ రాజ్ సమీక్షించి, వివిధ దశల పూర్తి కాలపట్టికలను ఖరారు చేశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక న్యాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కొత్త హైకోర్టు భవన సముదాయానికి రూ.2,583 కోట్ల పరిపాలనా అనుమతి ఉంది. మొత్తం 36.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం సాగుతోంది. ఇందులో సివిల్, ఎలక్ట్రికల్, ఎంఈపీ పనులకు రూ.1,980 కోట్లు, ఫర్నిచర్, ఆపరేటివ్ పరికరాలకు రూ.603 కోట్లు కేటాయించారు. 2024 డిసెంబర్ 7న జారీ చేసిన జీఓ ఆర్‌టీ నెం.827 ద్వారా పరిపాలనా ఆమోదం లభించింది. పనుల సమీక్షలో భాగంగా, డ్రాయింగ్‌లను ముందుగానే సమర్పించాలని కన్సల్టెంట్లను వికాస్ రాజ్ ఆదేశించారు. తద్వారా కార్మికులు, సామగ్రి, యంత్రాల సమర్థ వినియోగం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. పనుల పూర్తి కార్యక్రమాన్ని చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్), కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ కలిసి రూపొందించాలని, దానిపై తరచూ సమీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఒప్పందంలో పేర్కొన్న మైలురాళ్ల ప్రకారం పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. న్యాయ అధికారుల సూచనలకు అనుగుణంగా మార్పు చేసిన నమూనాలను ఆలస్యం లేకుండా సిద్ధం చేసి, అనుమతులు పొందాలని కన్సల్టెంట్లకు ఆదేశించారు. జోన్2కు సంబంధించిన అటవీ అనుమతులు సహా అన్ని క్లియరెన్సులను త్వరితగతిన పూర్తిచేయాలని చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్)కు సూచించారు. డిజైన్ మార్పుల వల్ల ఏర్పడిన ఆలస్యాలను అధిగమించేందుకు ఆర్ అండ్ బి శాఖ, కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేయాలని, ప్రాజెక్టును సమయానికి పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ స్పష్టం చేశారు.

# ప్రభాకర్ రావు కస్టడీ నేటితో పూర్తి

## సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వనున్న సిట్ బృందం



హైదరాబాద్, డిసెంబరు 17 ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వుండి ఆరు రోజులుగా పోలీ సు కస్టడీలో వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు భవితవ్యం సుప్రీం కోర్టు నిర్ణయంపై ఆధారపడి వుంది. ప్రభాకర్ రావు సాధారణ విచారణలో ఏమీ చెప్పడం లేదని, కస్టడీకి ఇవ్వాలని పోలీసు శాఖ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసి మరీ ఆయనను కస్టడీలోకి తీసుకోవడం తెలిసిందే. గత శుక్ర వారం నాడు ప్రభాకర్ రావు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిట్ ఎసిపి వెంకటగిరి ఎదుట లొంగిపోవడం విదితమే. అంతకు ముందు ఆయనకు ఏ డాది పాటు పోలీసుల అరెస్టు నుంచి మధ్యంతర ఉత్తర్వుల రక్షణ వుండింది. అయితే బుధవారంతో ప్రభాకర్ రావు కస్టడీ విచారణ ఆరవ రోజుకు చేరింది. ఆరు రోజుల విచారణలో ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి విషయాలు చెప్పాడనేది పోలీసులు వెల్లడించడం లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రభాకర్ రావు పోలీసులను ముప్పతిప్పలు పెట్టి 36 చెరువుల నీళ్లు తాగిస్తున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అంతా సవ్యంగానే జరిగిందని ప్రభాకర్ రావు చెప్పుకొచ్చారని తెలిసింది. తన పై బాస్‌లు, ఉన్నతాధికారులకు దీని గురించి అంతా తెలుసునని, ఇందులో అక్రమాలకు తావులేదని ఆయన పదే పదే చెప్పినట్లు తెలిసింది. అక్రమాలు జరిగాయని, ఇందుకు ప్రభాకర్ రావు బాధ్యుడని ఇంతకు ముందు అరెస్టయిన నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం కాఫీలను కూడా ప్రభాకర్ రావు తిరస్కరించారని, ఇదంతా కల్పితమని, కావాలని, వారిచేత బలవంతంగా వాంగ్మూలం తీసుకున్నారని, హార్డ్ డిస్క్‌ల ధ్వంసం అంతా నాటకమని అన్నట్లు తెలిసింది. బిఆర్ ఎస్ అధినేత కెసిఆర్ కుమార్తె కవిత ఫోన్‌తో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కవిత మీడియా సమావేశం నిర్వహించి మరీ ఆరోపించడం తెలిసిందే.

ఇదే విషయమై ప్రభాకర్ రావును ప్రశ్నిస్తే అంతా... తూచ్... అన్నట్లు తెలిసింది. కాగా ప్రభాకర్ రావు చివరి రోజు క స్టడీ గురువారంతో ముగియనుంది. దీని తరువాత కస్టడీలో ప్రభాకర్ రావు వెల్లడించిన వివరాలను సిట్ అధికారులు సుప్రీం కోర్టుకు వెల్లడించనున్నా రు. ఈ ప్రక్రియ శుక్రవారం జరగనుందని సమాచారం. అప్పటి వరకు ప్రభాకర్ రావు పోలీసు కస్టడీలోనే వుండనున్నారని సమాచారం. అనంతరం దీనిపై సుప్రీం కోర్టు విచారించి ప్రభాకర్ రావు కస్టడీపై ఒక నిర్ణయం తీసుకునే వీలుంది. మరోవైపు పోలీసు శాఖ ప్రభాకర్ రావును మరో వారం రో జుల పాటు కస్టడీకి కోరనుందని తెలిసింది. మొదటి దఫా వారం రోజులు ఆయన ఎలాంటి సమాచారం వెల్లడించనందున కస్టడీని పొడిగించాలని కోరాలని పోలీసు శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై శుక్రవారం నాడు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలయ్యే వీలుంది.

# ప్రయివేటు విద్యా సంస్థలకు ఊరట

## గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దిన లోకేష్

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: వైస్సార్సీ ప్రభుత్వ పరిపాలనలో ప్రయివేటు విద్యాసంస్థలను వేధించుటలో భాగంగా అగ్నిమాపక శాఖ నుంచి ప్రతి ఏడాది నిరభ్యంతర పత్రం (ఫైర్ ఎన్‌వోసి) తీసుకోవాలనే నిబంధన పెట్టారు. దీనితో ప్రయివేటు యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్న సమయంలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినపుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దీన్ని ఐదు సంవత్సరాలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇటీవలనే శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్‌లు విద్యా మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. ఆయన వెంటనే విద్య, అగ్నిమాపక శాఖల అధికారులకు దీనిపైన చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఆ మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు బుధవారం జీవో విడుదల చేశారు. 30 మీటర్ల ఎత్తువరకు ఉన్న విద్యాసంస్థలకు 5 సంవత్సరాలకొకసారి రెన్యువల్ చేసుకోవాలని ఆ ఉతర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఇటీవలనే గతంలో లోకేష్ హామీ ఇచ్చిన మేరకు పాఠశాలల రెన్యువల్‌ను 10 సంవత్సరాలకు పెంచారు. ప్రయివేటు విద్యాసంస్థల సమస్యలను పరిష్కరిస్తున్న లోకేష్‌కి శాసనమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# హిందూ సమాజానికి జగన్ క్షమాపణ చెప్పాలి

## టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: కోట్లాది హైందవ భక్తులకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. పరకామణి చిన్న చోరీ అనడంతో జగన్ హిందూవుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌరవ హైకోర్టు సైతం పరకామణి కేసు దర్యాప్తు గురించి విస్మయం వ్యక్తం చేసిందన్నారు. పరకామణిలో దొంగతనం జరగడానికి వీలు లేదని... ఇది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశమని మరోసారి హైకోర్టు గుర్తు చేసినట్లు ఆయన వివరించారు. పరకామణి కేసును గమనించిన హైకోర్టు, అడిషనల్ డిజిపితో క్షుణంగా దర్యాప్తు చేయాలని ఆదేశించిందన్నారు. పరకామణి కేసును అప్పటి అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు గోల్‌మాల్ చేశారని ధ్వజమెత్తారు. పరకామణి కేసు నిందితుడు రవికుమార్ నుంచి చట్టానికి వ్యతిరేకంగా రూ.14.5 కోట్లు గిఫ్ట్ రూపంలో స్వీకరించిన విషయం జగన్మోహన్ రెడ్డికి తెలియదా? ఈ భారీ సొమ్ము వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసేందుకు జరిగిన ప్రయత్నాల వెనుక జగన్ హస్తం ఉందనేది స్పష్టమవుతోంది. ఈ రాజీ వ్యవహారం ఆయనకు ముందే తెలిసుండొచ్చన్నారు. కోట్లాది మంది భక్తులు హుండీలో సమర్పించుకున్న కానుకల దారిమళ్లింపును జగన్ "చిన్న చోరీ" అని సంబోధించడం అత్యంత హేయమైన చర్య. జగన్ దృష్టిలో లక్షల కోట్లు కొల్లగొడితేనే అది పెద్ద నేరమా? సామాన్య భక్తుల నమ్మకాన్ని దోచుకోవడం నేరం కాదా? హిందువులకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# విద్యుత్ స్మార్ట్ మీటర్ల రూపంలో అదాని దోపిడీ

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతి ఇంటిలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల రూపంలో అదాని దోపిడీని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతోందని, ఆంధ్రప్రదేశ్‌ను అదానిప్రదేశ్‌గా సర్కార్ మారుస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. విజయవాడలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు బాగున్న మీటర్లు తొలగించి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వీటి ద్వారా ప్రజలపై రూ.25 వేల కోట్లు భారం మోపుతోందని వివరించారు. ప్రధాని మోడీ మెప్పుకోసం, అదాని సంస్థతో కుమ్మక్కై రాష్ట్ర ప్రజలను బలి చేస్తోందన్నారు. ప్రజల అంగీకారం లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించబోమని విద్యుత్ శాఖ మంత్రి హామీ ఇచ్చారని, నేడు మాట తప్పి బలవంతంగా మీటర్లు బిగిస్తున్నారని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించుకోకపోతే మూడు రోజుల్లో విద్యుత్ కనెక్షన్లు నిలిపివేస్తామని విజయవాడ నగరంలో విద్యుత్ అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. దొడ్డిదారిన, మోసగించి, ప్రజల కళ్లుగప్పి మీటర్ల బిగింపునకు పూనుకుంటున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# పిపిపి కాదు, పెద్ద స్కామ్



విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ సిఎం వైఎస్ జగన్ విజన్‌తో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారని, ప్రతి పార్లమెంటు నియోజక వర్గంలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉండాలన్నది సంకల్పించారని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలు వస్తే ఆరోగ్యశ్రీ ఖర్చులు తగ్గుతాయని జగన్ భావించారన్నారు. సిఎం చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రైవేటు పరం అయితే ప్రభుత్వం ఉండి ఏం లాభం అని.. ఇది పీపీపీ కాదు. పెద్ద స్కాం అని ఫైర్ అయ్యారు. ఏదైనా ప్రైవేటుకు వెళ్ళే ప్రజలకి నష్టమే అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే కాక, రాష్ట్రానికి చంద్రబాబు తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు.

# అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు జీవో నెంబర్ 2410 విడుదల ప్రభుత్వం విడుదల చేసింది. ఒక చైర్మన్, పదకొండు మంది సభ్యులతో అక్రిడేషన్ కమిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. మీడియా అక్రిడేషన్ కమిటీలో యూనియన్ల జాబితాను విడుదల చేసింది. ఏపీయూడబ్ల్యూజె, ఏపీయుడబ్లుజెఎఫ్, ఏపీజెఎఫ్‌జాప్. ఏపీఎంఎఫ్ యూనియన్లకు అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## టి-20 ర్యాంకింగ్‌లో..
# వరుణ్‌కు అత్యుత్తమ రేటింగ్



**న్యూఢిల్లీ:** టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన పురుషుల అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించిన భారత్ బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును వరుణ్ బద్దలు కొట్టాడు. కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఏకంగా 818 రేటింగ్ పాయింట్లు సాధించి రెండో ర్యాంకర్ బేకబ్ డఫీ (699 పాయింట్లు)కు అందనంత దూరంలో నిలిచాడు. టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్ ర్యాంక్ నిలబెట్టుకోగా, తిలక్ వర్మ రెండు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. పురుషుల అంతర్జాతీయ టీ20లలో బెస్ట్ బౌలర్ రేటింగ్స్‌లో ఉమర్ గుల్ (పాకిస్తాన్) 865 పాయింట్లు, శామ్యూల్ బద్రీ (వెస్టిండీస్) 864 పాయింట్లు, డేనియల్ వెటోరి (న్యూజిలాండ్) 858 పాయింట్లు, సునీల్ నరైన్ (వెస్టిండీస్) 832 పాయింట్లు, రషీద్ ఖాన్ (అఫ్గనిస్తాన్) 828 పాయింట్లు, తబ్రేజ్ షంసీ (దక్షిణాఫ్రికా) 827 పాయింట్లు, షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్) 822 పాయింట్లు, వరుణ్ చక్రవర్తి (ఇండియా) 818 పాయింట్లు, షాదాబ్ ఖాన్ (పాకిస్తాన్) 811 పాయింట్లు, వనిందు హసరంగా (శ్రీలంక) 809 పాయింట్లతో ఉన్నారు.

## గ్లోబల్ చెస్ లీగ్‌లో వరల్డ్ ఛాంపియన్
# గుకేష్ ఓటమి



**న్యూఢిల్లీ:** 2025 గ్లోబల్ చెస్ లీగ్‌లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజుపై విజయం సాధించాడు. గ్లోబల్ చెస్ లీగ్ ఘర్షణలో తన అభిమాన ఆటగాడు, గురువు విశ్వనాథన్ ఆనంద్ చేతిలో గుకేష్ ఓటమిని చవిచూశాడు. గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ తరపున తెల్లటి పావులతో ఆడుతూ, ఆనంద్ తన టీనేజర్ సిసిలియన్ డిఫెన్స్‌ను అధిగమించి పోటీలో తన రెండు గేమ్‌ల పరాజయాల పరంపరను ముగించాడు. 34వ ఎత్తుగడ వరకు ఆనంద్ గుకేష్ పై బోర్డులో స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించాడు. టోర్నమెంట్ నియమాలు ఆటగాళ్లకు 40వ ఎత్తుగడ తర్వాత ప్రతి కదలికకు రెండు సెకన్ల ఇంక్రిమెంట్లు మాత్రమే లభిస్తాయని నిర్దేశిస్తాయి. కానీ గుకేష్ వంటి గణన ఆధారిత ఆటగాడికి అటువంటి అవకాశం రాలేదు. ఆనంద్ విజయం అతని జట్టు పిబిజి అలాస్కాన్ నైట్స్‌పై 12-3 తేడాతో విజయం సాధించడానికి సహాయపడింది. గంగాస్ గ్రాండ్‌మాస్టర్ విజయంతో మూడు టైలలో వారి రెండవ విజయం నమోదైంది. వారు ఇప్పుడు పాయింట్ల పట్టికలో 6 పాయింట్లతో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ తర్వాత రెండవ స్థానంలో ఉన్నారు. మరోవైపు, పిబిజి అలాస్కాన్ నైట్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉండగా, ఇప్పటి వరకూ ఇంకా ఖాతా తెరవని ఏకైక జట్టుగా నిలిచింది.






## షూటింగ్ నేషనల్స్‌లో
# తోమర్‌కు స్వర్ణం
### గుర్జోత్‌కు స్కీట్ టైటిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో 470.5 ప్రపంచ రికార్డు స్కోరు చేశాడు. ఇది ప్రస్తుత ప్రపంచ రికార్డు కంటే 1.6 ఎక్కువ. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో ఏకకాలంలో జరిగిన షాట్‌గన్ యాక్షన్‌లో, గుర్జోత్ సింగ్ పురుషుల స్కీట్‌లో 55 హిట్‌లతో స్వర్ణం సాధించాడు. తొమ్మిది సార్లు జాతీయ ఛాంపియన్ అయిన మైరాజ్ అహ్మద్ ఖాన్‌ను 54 హిట్‌లతో తృటిలో ఓడించాడు. సీనియర్ విభాగంలో హర్మెహర్ సింగ్ లల్లీ 43 హిట్స్ తో కాంస్య పతకాన్ని గెలుచుకోగా, జూనియర్ ఫైనల్లో స్వర్ణంతో ఆ తర్వాత నిలిచాడు. అంగద్ (+4), జ్యోతిరాదిత్య (+3+2) ఇద్దరూ 119 లక్ష్యాలను ఛేధించి షూటౌట్ తర్వాత ఫైనల్ కు చేరుకున్నారు. హర్మెహర్ అద్భుతమైన ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 120 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌లో 54 హిట్‌లను నమోదు చేశాడు. జోరావర్ సింగ్ బేడి 51 హిట్‌లతో రజతంతో సరిపెట్టుకోగా, జ్యోతిరాదిత్య సింగ్ సిసోడియా 40 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించాడు. జూనియర్ పురుషుల 50 మీటర్ల 3 పి ఫైనల్లో రోహిత్ కన్యన్ 457.4 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా, అడ్రియన్ కర్మాకర్ 455.5 పాయింట్లతో రజతం, వేదాంత్ నితిన్ వాగ్మారే 443.0 పాయింట్లతో కాంస్యం గెలుచుకున్నాడు.

## ఐపిఎల్ 2026 మినీ వేలంలో
# టిజి, ఎపికి అన్యాయం
### 18 మందిలో అమ్ముడైంది ఒక్కడే!
### పట్టించుకోని సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2026 మినీ వేలంలోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్లకు నిరాశే ఎదురైంది. అబుదాబి వేదికగా జరిగిన మినీ వేలంలో ఈ రెండు రాష్ట్రాల నుండి 18 మంది ఆటగాళ్లు బరిలో నిలవగా, ఒకే ఒక్కడికి అవకాశం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన అమన్ రావును రాజస్థాన్ రాయల్స్ రూ.30 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసింది. ఈ వేలంలో 8 మంది అనామక ఆటగాళ్లను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఈ రెండు రాష్ట్రాల ప్లేయర్లను మాత్రం అస్సలు పట్టించుకోలేదు. ఒక్కరిని కూడా తీసుకునే ప్రయత్నం చేయలేదు. రెండు రాష్ట్రాలకు సంబంధించి యాజమాన్యం కలిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఈ ఆటగాళ్ల వైపు కన్నెత్తి చూడలేదు. దాంతో తెలంగాణ, ఆంధ్ర ప్లేయర్లకు మరోసారి అన్యాయమే జరిగింది. గతంలో అమ్ముడైన ఆటగాళ్లకు కూడా ఈసారి మొండి చెయ్యే ఎదురైంది. హైదరాబాద్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న రాహుల్ బుద్ధి, తనయ్ త్యాగరాజన్, ఆరోన్ జార్జి వర్గీస్, రక్షణ్ రెడ్డి, మనీశ్ రెడ్డి, నిశాంత్ శరణు, అర్ఫాజ్ మహమ్మద్, నితిన్ సాయి యాదవ్, చామ మిలింద్‌లను హైదరాబాద్, ఢిల్లీతో సహా మిగిలిన ఏ ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. రూ.30 లక్షల కనీస ధరతో తీసుకునేందుకు కూడా ఆసక్తి చూపించలేదు. ఆంధ్ర వెటరన్ వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు ఈ సారి కూడా నిరాశే ఎదురైంది. రూ.75 లక్షల కనీస ధరతో ఉన్న ఈ తెలుగు వికెట్ కీపర్‌ను ఫ్రాంచైజీలు విస్మరించాయి. అతనితో పాటు రికీ భుయ్, సత్యనారయణ రాజు, యర్ర పృథ్వీ రాజ్, బైలాపుడి యశ్వంత్, ధీరజ్ కుమార్, మారం రెడ్డి హేమంత్ రెడ్డి, సాధిఖ్ హుస్సేన్‌లకు నిరాశే ఎదురైంది. ఈ రెండు రాష్ట్రాల ప్లేయర్లకు అవకాశం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యంపై మండిపడుతున్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఫ్రాంచైజీలో ఈ ప్లేయర్లకు అవకాశం ఇవ్వరా అని మండిపడుతున్నారు. సన్‌రైజర్స్ కొనుగోలు చేసిన ఈ రెండు రాష్ట్రాలకు సంబంధం లేని ఆటగాళ్లను చూస్తే సలీల్ అరోరా(రూ.1.50 కోట్లు), శివాంగ్ కుమార్(రూ.30 లక్షలు), క్రెయిన్స్ ఫులెట్రా(రూ.30 లక్షలు), సాకిబ్ హుస్సేన్(రూ.30 లక్షలు), ఓంకార్ తర్మలె(రూ.30 లక్షలు), ప్రఫుల్ హింగే(రూ.30 లక్షలు), అమిత్ కుమార్(రూ.30 లక్షలు), లియామ్ లివింగ్ స్టోన్(రూ.13 కోట్లు), శివమ్ మావి(రూ.75 లక్షలు), జాక్ ఎడ్వర్డ్స్(రూ.3 కోట్లు) ఉన్నారు.



# ఆస్ట్రేలియా భారీ స్కోర్
### ఇంగ్లండ్ మ్యాచ్‌లో 326 రన్స్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యం చెలాయిస్తుంది. ఇప్పటికే రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో గెలిచి 2-0తో ఆధిక్యంలో నిలిచిన ఆసీస్, అడిలైడ్ వేదికగా మూడో టెస్ట్‌లో శుభారంభం అందుకుంది. అలెక్స్ క్యారీ (106) సెంచరీతో చెలరేగడంతో తొలి రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ 83 ఓవర్లలో 8 వికెట్లకు 326 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా (82) హాఫ్ సెంచరీతో రాణించాడు. క్రీజులో మిచెల్ స్టార్క్ (33 బ్యాటింగ్)తో పాటు, నాథన్ లయన్ (0 బ్యాటింగ్) ఉన్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ (3/29) వికెట్లు, బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ రెండేసి వికెట్లు, జోష్ టంగ్‌కు ఓ వికెట్ దక్కింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసిస్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో జేక్ వెధరాల్డ్ (18) ఔటవ్వగా, ఆ మరుసటి ఓవర్‌లోనే డేంజరస్ ట్రావిస్ హెడ్(10)ను బ్రైడన్ కార్స్ పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో మార్నస్ లబుషేన్, ఉస్మాన్ ఖావాజా ఆచితూచి ఆడి వికెట్ పడకుండా తొలి సెషన్‌ను ఆసీస్ 94/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ తొలి ఓవర్‌లోనే మార్నస్ లబుషేన్(19)ను ఆర్చర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. అదే ఓవర్ మూడో బంతికి కామెరూన్ గ్రీన్(0) డకౌట్ చేశాడు. అలెక్స్ క్యారీతో కలిసి ఉస్మాన్ ఖవాజా 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ అతన్ని విల్ జాక్స్ పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన అలెక్స్ క్యారీ, జోష్ ఇంగ్లీస్ మరో వికెట్ పడకుండా రెండో సెషన్‌ను 194/5 స్కోర్‌కు తీసుకెళ్లారు. ఆఖరి సెషన్‌లో హాఫ్ సెంచరీ దిశగా సాగిన జోష్ ఇంగ్లీస్‌ను టంగ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్(13) తీవ్రంగా నిరాశపర్చాడు. మిచెల్ స్టార్క్ సాయంతో అలెక్స్ క్యారీ 135 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరి మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు.

## డీమార్ట్ దమానీని వెనక్కి నెట్టేసిన
# దీపీందర్ గోయల్
### జొమాటో నంబర్‌వన్.. డీమార్ట్ నంబర్‌టూ..
### బిలియనీర్స్ జాబితాలో హురూన్ నంబర్‌వన్



**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** హురూన్ ఇండియా టాప్ 200 స్వయకృషితో ఎదిగిన పారిశ్రామిక వేత్తల జాబితాలో జోమాటో మాతృసంస్థ ఎటర్నల్ సిఇఒ దీపీందర్ గోయల్ అగ్రస్థానంలో నిలిచాడు. అవెన్యూ సూపర్‌మార్ట్స్ రాధాకషన్ ధమానిని నెట్టివేసి అగ్రస్థానంలోకి ఎదిగారు. ఐడిఎఫ్‌సి ఫస్ట్ ప్రైవేట్ అండ్ హురూన్ ఇండియా టాప్ 200 స్వశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తల జాబితాను విడుదలచేసారు. ఈ జాబితాలో యువపారిశ్రామికవేత్తలు అధికంగా ఉన్నారు. 2000వ సంవత్సరం తర్వాత ఏర్పాటయిన బిజినెస్‌లను చూస్తే కొత్తవారే అధికంగా ఉన్నారు. వారిలో దీపిందర్ తమ సంస్థ విలువలు రూ.3.2 లక్షలకోట్లతో టాప్ స్థాయిలో ఉన్నారు. వినియోగరంగంలో ఇంటర్నెట్ ఆధారిత సంస్థల్లో అగ్రభాగంలో నిలిచింది. లాభదాయకత, బ్రాండ్ పటిష్టత, మార్కెట్‌లలోకి చొరబాటు వంటి వాటిలో దమానికంటే ముందువరుసలో నిలిచారు. ఇక టాప్ టెన్ సంస్థల్లో ఇండిగో వ్యవస్థాపకులు రాహుల్ భాటియా, రాకేష్ గంగ్వాల్‌లు మూడోస్థానంలోనిలిచారు. స్విగ్గీ సహ వనయవస్థాపకులు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి ఐదోస్థానంలోకి రాగా వీరి కంపెనీ విలువలు ఐదుశాతం పెరిగి రూ.1.06 లక్షలకోట్లకు చేరింది. పేటిఎం వ్యవస్థాపకకుడు విజయ్‌శేఖర్‌శర్మ భారీ లాభాలు ఆర్జించారు. 67శాతం లాభపడ్డారు. ఆయన సంస్థ విలువలు రూ.72,900 కోట్లుగా నిలిచాయి. లెన్స్‌కార్ట్‌కూడా ఈజాబితాలో చేరింది. 60శాతం లాభాలతో రూ.67వేల కోట్లకు చేరింది. ఈ సంస్థ వ్యవస్థాపకులు పదవ స్థానంలో నిలిచారు. ఈసంస్థల టర్నోవర్, మార్కెట్ విలువలు, మార్కెట్లలో వీటి ధోరణులు వంటి వాటిని పరిగణనలోనికి తీసుకుని జాబితాను విడుదలచేసారు. హురూన్ జాబితా కంపెనీల మొత్తం విలువలు 42 లక్షలకోట్లుగా ఉంది. ముందు ఏడాది రూ.36 లక్షలకోట్లుగా ఉంటే ఏడాదిలో 15శాతం వృద్ధి నమోదుచేసింది. బిలియన్ డాలర్ల కంపెనీగా ఏర్పాటుచేసి స్వశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తలసంఖ్య 128కి పెరిగింది. 52 కంపెనీలు బెంగళూరు కేంద్రంగానే ఉన్నాయని హురూన్ వెల్లడించింది.

# ఐసిఐసిఐ 'ప్రు' ఐపిఒకు భారీ స్పందన
### 197కోట్ల షేర్లకు బిడ్లు దాఖలు




**ముంబయి, డిసెంబరు 17:** ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఎఎంసి) ఐపిఒకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తం 39.17 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ముఖ్యంగా సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ ఐపిఒపై అధిక ఆసక్తి కనబరచడంతో బిడ్లు వెల్లువెత్తాయి. మొత్తం రూ.10,602.65 కోట్ల విలువైన 3.50 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా, ఏకంగా 197 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.3 లక్షల కోట్లుగా ఉంది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కేటగిరీలో 123.87 రెట్లు, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ కోటాలో 22.04 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. అయితే, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి స్పందన పరిమితంగా ఉండి, కేవలం 2.53 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. అంతకుముందు, యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.3,022 కోట్లను సమీకరించింది. ఈ ఐపిఒ ద్వారా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.2061-2165గా నిర్ణయించారు. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో జరిగింది. ప్రమోటర్ సంస్థ అయిన యూకేకు చెందిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ తన వాటా నుంచి 4.89 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో ఐపిఒ ద్వారా వచ్చిన నిధులు కంపెనీకి చేరవు. ప్రస్తుతం ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసిలో ఐసిఐసిఐ బ్యాంకుకు 51 శాతం, ప్రుడెన్షియల్‌కు 49 శాతం వాటా ఉంది. భారత ఐపిఒ చరిత్రలో అత్యధిక సబ్‌స్క్రిప్షన్ పొందిన నాలుగో కంపెనీగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎఎంసి నిలిచింది. గతంలో రిలయన్స్ పవర్ (2007), ఎల్జీ ఎలక్ట్రానిక్స్ (2025), బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ (2024) ఈ జాబితాలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

## జనవరి ఒకటినుంచే
# భారత్ ట్యాక్సీ సేవలు
### దేశరాజధాని ఢిల్లీలో ప్రారంభం




**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ప్రైవేటు సంస్థలకు దీటుగా కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా సహకార (కోఆపరేటివ్) క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ సేవలు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. తొలుత దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 1వ తేదీ నుంచి ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఆ తర్వాత ఈయాప్ సేవలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తేనున్నారు. ఇందులో ఆటో, క్యాబ్, బైక్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ సేవలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు వెల్లడించింది. ఈ భారత్ ట్యాక్సీ యాప్ ఆండ్రాయిడ్, ఐఒఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. యూజర్లు తమ మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇదివరకు ఉన్న క్యాబ్ ఛార్జీల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండానే ఈ సేవలను పొందే అవకాశముంది. సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని నూరుశాతం డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చు.

## జిఎస్టీ హేతుబద్ధీకరణతో
# రూ.47 వేల కోట్ల భారం




**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** జిఎస్టీ హేతుబద్ధీకరణ ద్వారా కేంద్రఖజానాకు పరోక్షపన్నుల రాబడుల్లో రూ.47 వేల కోట్ల రూపాయలు భారం పడిందని ఆర్థికశాఖ లోక్‌సభకు వెల్లడించింది. భారీ స్థాయిలో నిర్వహించిన జిఎస్టీ శ్లాబ్‌ల క్రమబద్ధీకరణ స్థూల రాబడుల్లో ప్రభావం చూపించిందని మొత్తం 93,300 కోట్ల విలువైన పన్ను రాబడులు కుదింపునకు గురయినట్లు ఆర్థికశాఖ వివరించింది. కొన్ని ప్రత్యేక ఉత్పత్తులను 28శాతం శ్లాబ్‌నుంచి 40శాతం పన్ను శ్లాబ్‌కు పెంచడంవల్ల అదనపు రాబడి సుమారు 45,570 కోట్లు వస్తుందని అంచనావేసినట్లు తెలిపారు. వినియోగం ఆధారంగా మొత్తం విలు వల చైన్ 2023-24కు సంబంధించి వస్తువులు 28శాతంనుంచి 40శాతానికి పెంచిన వాటిలో అదనపు రాబడులు 46వేల కోట్లవరకూ రావచ్చని అంచనావేసామన్నారు. వీటికి అదనంగా మొత్తం పన్నుల హేతుబద్ధీకరణవల్ల జిఎస్టీకి 47,700 కోట్ల భారం పెరిగిందని మంత్రిత్వశాఖ అంచనావేస్తూ నివేదికలను పార్లమెంటుకు అందచేసింది. జిఎస్టీ హేతుబద్ధీకరణతో కొన్ని వివాదాలనుకూడా పరిష్కరించాల్సి ఉందని, అయితే తక్కువశాతం శ్లాబ్‌తోనే ఈనష్టం భర్తీ అవుతుందని ఆర్థికశాఖ సహాయ మంత్రి పార్లమెంటుకు వివరిం చారు. జిఎస్టీ రాబడి నష్టాల భర్తీకి అనుసరించే వ్యూహంపై ప్రత్యేకమంత్రుల బృందం అంటూ ఏదీ జిఎస్టీ మండలి నియమించలేదని కూడా స్పష్టంచేసింది. 56వ జిఎస్టీ మండలి సమావేశంలోనే కేరళ ఆర్థిక మంత్రి రెవెన్యూ నష్టం అత్యధికంగా ఉంటుందని తెలిపారు. ఆటోమొబైల్స్, బీమా, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాలనుంచే ఎక్కువనష్టం వస్తుందని కూడా కేరళ జిఎస్టీ మండ లిలో వెల్లడించింది. ఈ రంగాలనుంచే సుమారు 2500 కోట్లవరకూ పన్నుల రాబడినష్టం ఉంటుందనికూడా తెలిపింది.

## స్టార్టప్‌ల టర్నోవర్
# రూ.42 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** భారతదేశంలోని టాప్ 200 స్టార్టప్ కేటగిరీకి చెందిన అన్ని కంపెనీల విలువ 2025లో రూ. 42 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది రూ. 36 లక్షల కోట్లుగా నమోదైంది. ఏడాది ప్రాతిపదికన 15 శాతం వృద్ధిని ఇది ప్రతిబిం బిస్తూ, భారతదేశ స్వయంనిర్మిత పారిశ్రామిక వేత్తల వేగవంతమైన సంపద సృష్టిని నొక్కి చెబుతోందని ఒక నివేదిక పేర్కొంది. 2025లో 128 కంపెనీలు బిలియన్ డాలర్ల వ్యాల్యుయేషన్‌ను కలిగి ఉన్నాయి. గత ఏడాది ఈ సంఖ్య 121గా ఉంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హురున్ ఇండియా జాబితా ప్రకారం 22 కొత్త కంపెనీలు ఈ జాబితాలో చేరాయి. రూ. లక్ష కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువ కలిగిన కంపెనీలు ఐదు ఉన్నాయి. అత్యధిక స్టార్టప్‌లు కలిగిన నగరంగా బెంగళూరు నిలిచింది. గత సంవత్సరంతో పోలిస్తే 14 కంపెనీలు తగ్గినప్పటికీ 52 కంపెనీలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత వరుసగా ముంబై (41), గురుగ్రామ్ (36) ఉన్నాయి. ముంబై, గురుగ్రామ్ లలో గత ఏడాదితో పోలిస్తే ఐదు స్టార్టప్‌లు పెరిగాయి. 88 మంది స్టార్టప్ వ్యవస్థాపకులతో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత ముంబై (83), ఢిల్లీ (52) ఉన్నాయి. ఈ నగరాలు అత్యధిక సంఖ్యలో స్టార్టప్ వ్యవస్థాపకులను కలిగి ఉన్నాయి. దేశంలోని స్టార్టప్ కంపెనీలలో 47 ఫైనాన్షియల్ సర్వీసెస్, 28 సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్, 27 హెల్త్ కేర్, 20 రిటైల్ రంగాల్లో ఉన్నాయి.

# మూడోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలు డీలా
### మీడియా, రియాల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిళ్లు



**ముంబయి, డిసెంబరు 17:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. మీడియా, రియల్టీ, వినియోగరంగ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితంచేసింది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్‌ఇ సెన్సెక్స్ 120.21 పాయింట్లు నష్టపోయి 84,559.65 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ కూడా 41.55 పాయింట్లు క్షీణించి 25,818.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 25,900-26,000 స్థాయిని దాటనంత వరకు అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప కాలంలో 25,700-25,750 నిఫ్టీకి కీలక మద్దతు జోన్‌గా ఉందని, ఒకవేళ ఈ స్థాయి కంటే దిగువన ముగిస్తే పతనం మరింత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. మార్కెట్లు బలహీనంగా ఉన్నప్పటికీ కొన్ని ప్రధాన స్టాక్స్ లాభపడ్డాయి. ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టిసిఎస్, టాటా స్టీల్ షేర్లు 1.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ట్రెంట్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి స్టాక్స్ నష్టపోయి సూచీలపై ఒత్తిడి పెంచాయి. బ్రాడర్ మార్కెట్లలో బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.73 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మీడియా ఇండెక్స్ అత్యధికంగా 1.7 శాతం పతనమైంది. ఐటీ, పిఎస్‌యూ బ్యాంక్ రంగాలు మాత్రం లాభాలతో ముగిశాయి. కమొడిటీ మార్కెట్‌లో వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఎంసీఎక్స్‌లో సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సుమారు రూ. 2,05,665 వద్ద ట్రేడ్ అయింది. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యంతో యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కోలుకుని 90.98 వద్ద ఊగిసలాడింది. బిఎస్ఇలో 1654 కంపెనీల షేర్లు పెరిగాయి. 2523 షేర్లు పతనం చెందితే 170 కంపెనీలు స్థిరంగా నిలిచాయి ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదునాటి సెటిలెమంట్‌లు 0.28శాతం క్షీణించి రూ.1,33,760కి చేరింది. బ్రెంట్ ముడిచమురు ఫిబ్రవరి ఫ్యూచర్స్‌కు 1.09 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 59.47 డాలర్లుగా నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# పెన్షనర్ల ఆశాజ్యోతి,సేవామూర్తి ధరమ్ స్వరూప్ నకారా

ఏలూరు, డిసెంబర్17. (ప్రభాతవార్త). కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక సర్ సి.ఆర్.రెడ్డి ఆటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్లో జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమం అధ్యక్షులు షేక్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు కార్యదర్శి నివేదికను సమర్పించారు.కోశాధికారి పి. ఆంజనేయులు అసోసియేషన్ ఆర్థిక పరిస్థితిని వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఏ.రామరాజు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.సి.డేనియల్ మాట్లాడుతూ పెన్షనర్ల ఆశాజ్యోతి, సేవామూర్తి ధరమ్ స్వరూప్ నకారా సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆర్.సి.టి.ఏ.రాష్ట్ర ఉపాధ్యకులు ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెన్షన్ ఎవరి దయాభిక్ష కాదని,ఉద్యోగి ప్రాథమిక్ష హక్కు అని అందించిన సేవలకు ఉద్యోగికి ఇచ్చే గౌరవం,మర్యాద అని అన్నారు.ఈ సందర్భంగా అధ్యాపకులుగా విశేష సేవలు అందించిన డాక్టర్ కె.వి.ఆర్.ఎన్. ఎస్.కొండయ్యరావు,వి.డేనియల్,డాక్టర్ సి.రవి,ఎల్. వెంకటేశ్వరరావు,శ్రీమతి డి.బ్రహ్మేశ్వరి మరియు సీనియర్ సభ్యులు ఎన్.వి.సుబ్బారావు లను శాలువా,జ్ఞాపిక ,పూలమాలతో ఘనంగా సత్కరించారు.తమకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అసోసియేషన్ కు సమాజానికి మరిన్ని సేవలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి డాక్టర్ ఏ.ఉత్తమదుర్గ,కార్యవర్గ సభ్యులు ఎం.సంపదరావు,డాక్టర్ కె.రాణి,డాక్టర్ కె.శ్రీకాంత్,డాక్టర్ కాజ బాలకృష్ణారావు,కె.పి.ఆర్. శేషగిరిరావు,శ్రీమతి ఎం. రమాసత్యవతి తదితరులు పాల్గొన్నారు.డాక్టర్ ఏ. వీరభద్రరావు స్వాగతం పలికి




కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ముందుగా డి.ఎస్.నకార చిత్ర పటానికి,పోరాటయోధుడు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి విశేష సేవలు అందించిన మహనీయుడు, పూర్వపు టీచర్ ఎం.ఎల్.సి., శతజయంతి జరుగుతున్న ఎం.జె.మాణిక్యారావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో

# ఏపీ బీజేపీ నేతల భేటీ



భీమవరం (న్యూఢిల్లీ) డిసెంబర్ 17ప్రభాతవార్త : ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఏపీ బీజేపీ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించిన సంక్షేమ పథకాలు, సుపరిపాలన విధానాలను ప్రధాని నరేంద్ర మోదీ సమర్థవంతంగా పటిష్టంగా ముందుకు తీసుకువెళ్తున్న తీరు ప్రజలకు వివరిస్తూ ఏపీ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అటల్ మోడీ సుపరిపాలన యాత్ర కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు అమిత్ షా కు వివరించారు. దీనితోపాటు ఏపీకి సంబంధించి పలు కీలక అభివృద్ధి అంశాలతో అమిత్ షా తో వారు చర్చించారు.అనంతరం బిజెపి కేంద్ర కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబిన్ ను మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ భవనంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామి, కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర పౌర విమానయ శాఖామంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు లను శ్రీనివాస వర్మ, పివిఎన్ మాధవ్, సత్య కుమార్ యాదవ్ లు కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఏపీలోని పలు స్టేట్ హైవే లను నేషనల్ హైవేలుగా మార్పు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్రముఖ కథా రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ ను కలిశారు. మొత్తం మీద ఉదయం నుండి సాయంత్రం వరకు ఏపీ బీజేపీ నేతలు కేంద్రమంత్రులతో వరుస బేటీలు అయ్యారు.

# నెలలోపు పుట్టిన పాపకి అరుదైన చికిత్స

ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం త్రినేత్రి ఆస్పటల్ డాక్టర్ చావల నాగేంద్రబాబు ఒక నెల పూర్తయిన పాపకి అరుదైన చికిత్స నిర్వహించిన త్రినేత్ర హాస్పిటల్ ఎం.డి డాక్టర్ చవల నాగేంద్రబాబు ఆయన తెలిపిన వివరాల ప్రకారం మా త్రినేత్ర హాస్పటల్లో నెల రోజుల క్రితం నల్లజర్ల మండలానికి చెందిన సుభద్రపాలెం గ్రామానికి చెందిన బిరుదుగడ్డ మౌనిక, బిరుదుగడ్డ మంగరాజు వారి బిడ్డని 19.11.2025 నాడు తీవ్రమైన శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు మరియు ఊపిరితిత్తుల నిమ్ముతో చాలా విషమ పరిస్థితుల్లో మా హాస్పిటల్ నందు పి ఐ సి యు కి వచ్చారు పరిస్థితి చాలా విషమంగా ఉండడంతో 12 రోజులపాటు వెంటిలేటర్ సహాయం అందించడం జరిగిందని వైద్యుల క్రమమైన చికిత్సలో మరియు ప్రత్యేక సంరక్షణలో చిన్నారి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడిందని అన్నారు. డాక్టర్ చావల నాగేంద్రబాబు మరియు డాక్టర్ మేఘన సాయి పర్యవేక్షణలో వైద్యులు మరియు నర్సింగ్ సిబ్బంది 24 గంటలు శ్రద్ధగా చికిత్స అందించారు సకాలంలో చేసిన వైద్యం నిరంతర పర్యవేక్షణ మరియు ప్రత్యేక సంరక్షణ పూర్తిగా కోల్కొనే దిశగా పురోగత సాధించిందని తెలిపారు. దాదాపు ఒక నెలపాటు పి ఐ సి యు లో చికిత్స పొందిన తర్వాత చిన్నారి ప్రస్తుతం ఆరోగ్యంగా ఉందని ఈ రోజున డిశ్చార్జ్ ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. ఈ చికిత్స సమయంలో కుటుంబానికి ఆర్థిక భారం లేకుండా ఉండేందుకు గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ప్రభుత్వ సహాయంతో ఆర్థిక మద్దతు అందించారని ఈ సహాయం వల్ల చిన్నారికి ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తిస్థాయి వైద్యం అందించడం



జరిగిందని తెలిపారు. వైద్యుల కృషి ప్రత్యేక సంరక్షణ మరియు ప్రభుత్వ సహకారం వలన ఈ చిన్నారి ప్రాణాలను రక్షించగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ చవల నాగేంద్రబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది మరియు స్టాప్ పాల్గొన్నారు.

## తొలి రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం డిసెంబర్ 17 ప్రభాతవార్త :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన డిసెంబర్ 17, 18 తేదీలలో రెండు రోజులపాటు రాష్ట్ర సచివాలయంలో నిర్వహించనున్న 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, సంక్షేమం అజెండాగా కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు ప్రారంభమైనది. జీఎస్డీపీ లక్ష్యాలు, కీ పార్ఫెమెన్స్ ఇండికేటర్లు, సుస్థిరాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కేంద్ర నిధులను వివిధ ప్రభుత్వ శాఖలు ఏ విధంగా వినియోగించాయి, యూసీలను ఏ మేరకు జారీ చేశాయనే అంశాలపై సమీక్ష జరిగింది. సూపర్ సిక్స్ పథకాల అమలు, ఇ-ఆఫీస్, డేటా డ్రివెన్ గవర్నెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉగాది నాటికి ఐదు లక్షల గృహప్రవేశాలు కార్యక్రమానికి సిద్ధం చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదులకు సంబంధించి జనవరి నుంచి జిల్లాల్లో ఆకస్మికంగా తనిఖీకి వస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్ కు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన 5వ జిల్లా కలెక్టర్ల సదస్సు మొదటి రోజు కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి. ప్రభాతవార్త :

# విజ్ఞాన వీచికలు వైజ్ఞానిక ప్రదర్శనలు - ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం వై.ఎన్. కళాశాలలో నరసాపురం మండలం మరియు పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో మండల స్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్సు కళలు పర్యావరణం విద్యుత్ రంగాలపై ఆధునిక వసతులతో కూడిన భవిష్యత్తు ప్రణాళికలను చక్కటి నైపుణ్యంతో తీర్చిదిద్ది ప్రదర్శించారు. సమాజానికి సందేశాత్మకమైన ఐటమ్స్ కూడా చేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న వైజ్ఞానిక తృష్ణను వెల్లడించడానికి ఈ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ఈ విజ్ఞాన వీచికలే యువత ముందడుగు కు మార్గదర్శకంగా నిలుస్తాయని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. శాస్త్రీయ ఆలోచన, నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన ప్రోత్సహించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా



దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాధికారి (ఎంఈఓ) పుష్పరాజ్యం, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాళ్ల, డిసెంబరు 17 (ప్రభాతవార్త): మండలంలోని కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వరస్వా మివారి శాశ్వత అన్నదాన పథకానికి ఆత్రేయపురం మండలం తాడిపూడికి చెందిన వేగేశ్న ఉదయ భాస్కరరాజు రూ. లక్ష విరాళాన్ని తన మేనమామ కూసంపూడి సూర్యనారాయణరాజుచే రూ. లక్ష విరాళాన్ని అందజేయడం అభినందనీయమని కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ అన్నారు. కూసంపూడి సూర్యనారాయణ రాజు నగదును కార్యనిర్వహణ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మండల అధ్యక్షుడు అడ్డాల వెంకట శివరామరాజు (రాము)మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్న దాతలకు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రీ సర్వేలో భూముల విస్తీర్ణం తగ్గింది: రైతుల ఆందోళన

కాళ్ళ, డిసెంబర్ 17( ప్రభాతవార్త) :మండల కేంద్రమైన కాళ్లలో జరిగిన రీసర్వేలో తమ భూముల విస్తీర్ణం తగ్గిందని, ఇది భూమి యాజమాన్య హక్కులను ప్రభావితం చేస్తోందని తోట కృష్ణారావుతో పాటు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల్లో విస్తీర్ణం తగ్గించ దంపై ఉన్నత అధికారులను ఆశ్రయించడంతో వారి ఆదేశాల మేరకు వచ్చిన సర్వే సిబ్బందికి తమగోడును వెళ్ళబుచ్చుకున్నారు. వాస్తవంగా తమ భూమి క్షేత్రస్థాయిలో సక్రమంగానే ఉందని, తమ దగ్గర అన్ని రికార్డులు ఉన్నా తమ భూమిలో కొంతభాగం తగ్గించి చూపిస్తున్నారని, ఇది ముమ్మాటికీ అధికారులు తప్పిదమేనని ఆరోపించారు.

## వీరవాసరంలో నేడే జాబ్ మేళా


వీరవాసర, డిసెంబర్ 17 ( ప్రభాత వార్త) :నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో వీరవాసరం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణలో శుక్రవారం ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని జిల్లా ఉపాధి అధికారి వి వరలక్ష్మి విలేకరులకు తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో ఎల్ అండ్ టి ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలలో లోన్ ఆఫీసర్, జూనియర్ ఫార్మసీ అసిస్టెంట్ మరియు మొబైల్ అసెంబ్లర్ మొదలైన ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని వివరించారు. ఇవికాక వివిధ కంపెనీలలో మొత్తం 300 లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీటికి విద్యార్హత పదవ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ అర్హతలు కలిగి ఉండి వయసు 18 నుంచి 35 సంవత్సరాలు గల యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. ఇందులో ఆసక్తి ఉన్న వారు ఈ లింక్ https:https://bit.ly/ncsregister-wg లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, ఇతర వివరములకు 7013896277 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# మంచు మాయ

## పెరుగుతున్న దగ్గు జలుబు రోగులు ప్రయాణాల్లో తీరని ప్రమాదాలు

ప్రభాతవార్త నరసాపురం : డెల్టా ప్రాంతంలోనూ తీర ప్రాంతంలోనూ మంచు తీవ్రత పెరిగింది. బుధవారం ఉదయం 9 గంటల వరకు మంచు ప్రభావం ఉంది. మంచు పెరగడంతో జలుబు దగ్గు రోగులు కూడా పెరుగుతున్నారు. మంచు కారణంగా ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతుంది. ఉదయం వాళ్ళ ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా పెను ప్రమాదాలే సంభవిస్తున్నాయి. విపరీతమైన మంచు కారణంగా దారి కనబడక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మంచు వల్ల వాహనాలు జారిపోవడం ద్విచక్ర వాహనదారులకు బలమైన గాయాలు తగలడం జరుగుతుంది. మంచు వల్ల మామిడి



పూతకు తెగులు పెరగడం పూత మాడిపోవడం జరుగుతున్నాయి. మంచు వేళల్లో తస్మాత్ జాగ్రత్త అనే హెచ్చరికను ఎవరు విస్మరించకూడదు

## ధనుర్మాసం ప్రారంభంతో వైష్ణవాలయాల్లో సందడి.

అత్తిలి– డిసెంబర్ 17 (ప్రభాతవార్త):విష్ణుభక్తులకు పవిత్రమైన ధనుర్మాసం ప్రారంభం కావడంతో వైష్ణవాలయాలలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయాల్లో ప్రతిరోజుఆండాళ్ పాశురాలతో దేవదేవుణ్ణి మేలుకొల్పుతారు. విష్ణుమూర్తి భక్తురాలైన గోదాదేవి రచించిన పాశురాలను ప్రతిరోజూ ప్రవచనం చేస్తారు. భోగి రోజున గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అత్తిలి గొల్లపాడు తదితర గ్రామాల్లో గల వైశ్యని ఆలయాల్లో ప్రతిరోజు పాశురాల ప్రవచన కార్యక్రమం జరుగుతుంది. ఈ నెల్లాళ్లూ తెల్లవారకముందే ఇళ్ల ముంగిళ్లలో అందమైన ముగ్గులు దర్శనమిస్తాయి. సూర్యోదయానికి పూర్వమే వైష్ణవులు పూజపూర్తి చేసి బాలభోగాన్ని సమర్పిస్తారు. నియమాలతో కూడిన వివిధ నైవేద్యాలు స్వామికి సమర్పిస్తూ ఉంటారు. ధనుర్మాస వ్రతనిష్ఠతో విష్ణులోకప్రాప్తి కలుగుతుందని పెద్దలు చెబుతారు. నెల రోజులు పాటు హరిదాసుల




సంకీర్తనలతో గ్రామాల్లో సందడి నెలకొంటుంది.

## పుర వీధులలో ఊరేగుతున్న కోదండ రామయ్య



చాట్రాయి, డిసెంబర్ 17, ప్రభాతవార్త : మండలంలోని చనుబండ పురవీధులలో కోదండరామయ్య ఊరేగుతున్నారు. ధనుర్మాసం సందర్భంగా చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ రాముని ఆలయం నుండి స్వామివారిని పురవీధులలో ఊరేగించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి హారతులు పట్టారు. ధనుర్మాసం సందర్భంగా నిత్యం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి చెప్పారు.

## అక్రమ గ్యాస్ సిలిండర్లు పట్టివేత

తణుకు, డిసెంబర్ 17 ( ప్రభాత వార్త) :అక్రమంగా నిల్వ ఉంచిన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను బుధవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఏలూరు విజిలెన్స్ ఎస్పి ఆదేశాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని గవర వెంకటేశ్వర రావుపై కేసు నమోదు చేశారు. సబ్సిడి గ్యాస్ సిలిండర్లు అనధికార అమ్మకాలు జరుపుతున్నాడనే సమాచారంతో తనిఖీలు నిర్వహించగా 33 గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు గుర్తించారు. వెంకటేశ్వర రావు తణుకు పరిసర ప్రాంతాలలో గ్యాస్ వినియోగదారుల కార్డుల ద్వారా గ్యాస్ బుక్ చేసి వాటిని అధిక ధరలకు బ్లాకులో హెూటళ్లు, పలువురు గ్యాస్ రిపేర్లు చేసేవారికి, వినియోగాదారులకు సైతం ఎక్కువ ధరకు అమ్ముచున్నట్లుగా తెలియజేశారు. ఈ తనిఖీలో పట్టుబడిన రు.83,232/-లు విలువ కలిగిన 33 గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లలను సీజ్ చేసి గవర వెంకటేశ్వర రావు పై నిత్యవసరవస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు



చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కె. నాగేశ్వర రావు, విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా వాణిజ్య అవసరాలకు గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు వాడినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు ఎస్సై సీతారాము, తణుకు డిప్యూటీ తహసిల్దార్ ఎన్ శ్రీదేవి, పట్టణ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నాయకర్

ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం బస్ స్టాండ్లో ఏపీఎస్ఆర్టీసీ వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రేమ, శాంతి, ఐక్యతతో సమాజం ముందుకు సాగాలని సందేశం ఇచ్చారు. క్రిస్మస్ పండుగ మానవ విలువలను, పరస్పర సోదరభావాన్ని పెంపొందించే పండుగ అని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా, ఘనంగా నిర్వహించిన ఏపీఎస్ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ



నరసాపురం ఎండి సుబ్బన్న , ఏపీఎస్ఆర్టీసీ నరసాపురం సిబ్బంది, అలాగే నియోజకవర్గానికి చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నెక్కళపు

చాట్రాయి, డిసెంబర్ 17, ప్రభాతవార్త : ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన నెక్కళపు వెంకటేశ్వరరావును నియమిస్తూ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కీర్తి వెంకట రామ్ ప్రసాద్ ను నియమాక ఉత్తర్వులు జారీ చేశారు. చాట్రాయి మండలంలో భారతీయ జనతా పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నారు.కేంద్ర కమిటీ సభ్యులు తపనా చౌదరి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ ల ఆశీస్సులతో, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట రామ్ ప్రసాద్ సహకారంతో తనకు ఈ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పదవి వరించిందని అయన చెప్పారు. పార్టీ తనపై పెట్టిన బాధ్యతను కృతజ్ఞుడిగా పనిచేసి బీజేపీ బలోపేతానికి తన శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తానని చెప్పారు. జిల్లా కిషోర్ మోర్చా ఉపాధ్యాయ పదవికి ఎంపిక చేసినందుకు పార్టీకి అంకితభావంతో పని చేస్తానని పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు, పరసా శ్రీనివాస రావు, బజ్జూరి గోపి, కొత్తగుండ్ల రమేష్, గవర వెంకటేశ్వర రావు,కూటమి నాయకులు,కార్యకర్తలు నెక్కళపు కు అభినందనలు తెలియజేశారు.



## పాస్ పోర్ట్ పోయినది

దూలం సుమన్. తండ్రి మోహనరావు. శ్రీ సాయి దుర్గా టవర్స్ ఉండ్రాజవరం రోడ్డు తణుకు. సుమన్ అనే నాకు ఎల్ 6948066 నంబరు గల పాస్పోర్టు కలదు. ఈ పాస్పోర్ట్ ను నేను జిరాక్స్ కాపీ తీయించేందుకు తీసుకువెళుతుండగా ది 8. 12- 2025 న పోయినది. ఎవరికైనా దొరికినా లేదా సమాచారం తెలిసిన ఈ దిగువ సెల్ నెంబరుకు తెలియచేయ కోరుచున్నాను.

దూలం సుమన్, తణుకు
.సెల్ నెంబర్ 91770 69347.

## 750 కోడి కత్తులు స్వాధీనం-ఎస్పై రామకృష్ణ

చాట్రాయి, డిసెంబర్ 16, ప్రభాతవార్త : చాట్రాయి మండలం చనుబండ శివారు సూరంపాలెం గ్రామంలో 750 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పై డి.రామకృష్ణ చెప్పారు. మంగళవారం కోడిపందాలకు కోళ్లకు కట్టే కత్తులను తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు రాబడిన సమాచారం మేరకు సురంపాలెం గ్రామంలో కందుకూరి లక్ష్మణ్ బాబు ఇంటి వద్ద దాడి చెయ్యగా అతని వద్ద 750 కోడి కత్తులను మరియు కోడి కత్తులు తయారి చేయుటకు ఉపయోగించిన మోటార్ ను మధ్యవర్తుల సమక్షములో సీజ్ చేసి అతని పై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. అదే విధం గా చాట్రాయి మండలంలో రానున్న సంక్రాంతి పండుగ పురస్కరించికొని ఎవరైనా కోడి కత్తులు తయారు చేసిన, కలిగి ఉన్న అట్టి వారి పై చట్టప్రకారం కటిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు వద్దు అని హెచ్చరించారు.

**సెల్ ఫోన్లు అందజేత**



చాట్రాయి మండలంలో వివిధ గ్రామాలలో ఇటీవల చోరీ కాబడిన సెల్ ఫోన్ లను వారి ఇంటి వద్దకు వెళ్లి అప్పగించినట్లు ఎస్పై రామకృష్ణ చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చోరీ కాబడిన సెల్ ఫోన్లు రికవరీ అయిన వెంటనే వారి ఇళ్లకు వెళ్లి అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై సమావేశం.

అత్తిలి/ గణపవరం – డిసెంబర్ 17 (ప్రభాతవార్త): గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లో వైద్యాధికారి డాక్టర్ పి కిరణమయి,డాక్టర్ కే. ఓంకార్నాథ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో పై సమావేశం నిర్వహించారు.. ఈనెల 21, 22,23 తేదీలలో జరుగు పల్స్ పోలియో కార్యక్రమం పై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏ ఎన్ ఎం లు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సర వయసు గల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో అందరికీ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. ప్రాథమిక



ఆరోగ్య కేంద్రం లో 2091 ఐదు సంవత్సరముల పిల్లలు ఉండగా వారందరికీ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు సి వి సత్యవతి, పద్మజ పాల్గొన్నారు.

## వాజ్ పేయి విగ్రహావిష్కరణకు బిజెపి శ్రేణులు తరలి రావాలి,



జీలుగుమిల్లి, డిసెంబర్–17, ప్రభాతవార్త: ఈనెల 22న ఏలూరులో జరిగే మాజీ ప్రధాని వాజ్ పేయి విగ్రహ ఆవిష్కరణకు బిజెపి శ్రేణులు భారీగా తరలి రావాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, జిల్లా నాయకులు చాట్రాతి ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కామయ్యపాలెంలో భారతీయ జనతా పార్టీ సమావేశం పేరం జగదీశ్వరరావు ఇంటి వద్ద బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి, ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో వివిధ పార్టీల నుండి సుమారు 20 కుటుంబాలు బిజెపిలో చేరినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ సుపారి పాలన నచ్చి వీరంతా బిజెపిలో చేరినట్లు తెలిపారు. బిజెపి పార్టీ అన్ని విధాలాగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, కార్యదర్శులు, పీ.వీ. సుబ్బారెడ్డి, పి బాలు, ఉపాధ్యక్షులు ఏ సోమిరెడ్డి, బిసి మోర్చా అధ్యక్షులు గడ్డం రామకృష్ణ, ఎస్టి మోర్చా సూర్యచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి ఉత్సవాల నేపథ్యంలో మావూళ్ళమ్మ ఆలయం లో దర్శనం నిలిపివేత

భీమవరం డిసెంబర్ 17 ప్రభాతవార్త :పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం ఇలవేలుపు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి సంక్రాంతి మహెూత్సవముల సందర్భంగా శ్రీ అమ్మవారి గర్భాలయం లో శుద్ధి కార్యక్రమాలు, అమ్మవారి అలంకరణ పనుల నిమిత్తం శ్రీ అమ్మవారి మూలవిరాట్ దర్శనాలను డిసెంబర్ 17 నుండి డిసెంబర్ 28 వరకు నిలుపుదల చేసారు. క్రమంలో భాగముగా దేవస్థానం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండి వేద మంత్రోశ్చరణలు విశేష హెూమాలు నిర్వహించి న అనంతరం ఉదయం 11 గంటల సమయంలో కళాపకర్షణ పూజ జరిపి దర్శనాలు నిలుపుదలచేసారు. తిరిగి ఈ నెల 29 సోమవారం ఉదయం 10.30 గంటలకు కళాన్యాసము జరిపి అమ్మవారి



మూలవిరాట్ పునఃదర్శనం జరుగునని శ్రీ అమ్మవారి ప్రదక్షణ మండపంలో గర్భాలయం వెనుక పూజలు యధావిధిగా జరుగునని భక్తులు సహకరించవలసినదిగా ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.


## బడేటి చంటిని సత్కరించిన కైకలూరు టిడిపి నేతలు

కైకలూరు డిసెంబర్ 17 (ప్రభాతవార్త): ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా నియమితులైన సందర్భంగా బుధవారం కైకలూరు టిడిపి నేతలు ఏలూరులో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ), జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట కోటిలింగం బాబు(కె.కె.బాబు), కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,కైకలూరు పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాలకు పట్టుకొమ్మలు లాంటివి సొసైటి బ్యాంకులు

కైకలూరు డిసెంబర్ 17 (ప్రభాతవార్త): గ్రామాలకు పట్టుకొమ్మలు లాంటివి సొసైటి బ్యాంకులు అని,బ్యాంకులో వచ్చిన లాభాల నుండి కొంతమేర ఖాతాదారులకు పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తెలిపారు. బుధవారం సాయంత్రం కైకలూరు పట్టణంలోని విద్యాంజలి కాలేజ్ సమీపంలో శ్రీకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంకు వారు ఏర్పాటుచేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొని ఖాతాదారులకు లాభాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంకులో 2016- 2017 సంవత్సరం నుండి 2024- 2025 వరకు ఖాతాదారులు వాడిన లావాదేవీల నుండి 38 శాతం డివిడెంట్ లాభాలను పంచడం అభినందనీయమన్నారు.



ఇలా లాభాలు పంచడం ద్వారా బ్యాంకుల పై ఖాతాదారులకు మంచి అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. సొసైటీ బ్యాంకులు గ్రామాలకు పట్టుకొమ్మలు వంటివని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విట్టల్ రావు , ప్రజా ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాలో పోలవరం ప్రాంతాన్ని కలిపి కారం తమ్మన్న దొర పేరు పెట్టాలి, రామారావు దొర,

జీలుగుమిల్లి–ప్రభాతవార్త :పోలవరం జిల్లాలో పోలవరం ప్రాంతాన్ని కలిపి కారం తమ్మన్న దొర పేరుపెట్టాలని, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకలచట్టం వెంటనే చేయాలని ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర రదసారధి, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి అల్లూరి జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాలలో కొనసాగుతున్న "ఆదివాసి సత్యాగ్రహ యాత్ర"లో భాగంగా బుధవారం బర్రింకలపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి బృందం పోలవరం



శాసనసభ్యులు చిర్రి బాలరాజుని కలసి వినతిపత్రం అందజేసారు.

## వాహనాలను తనిఖీ చేసిన సిఐ జి.దుర్గాప్రసాద్



మొగల్తూరు డిసెంబర్ 17 ( ప్రభాతవార్త) వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు ఉండాలని నరసాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మొగల్తూరు 216 జాతీయ రహదారిపై వాహనాలను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వాహనాలు నడిపే వాహనదారుల నుండి రికార్డులు పరిశీలించారు. లైసెన్సు లేకుండా వాహనాలను నడపరాదని అన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే వారికి జరిమానా తప్పనిసరి అని ఆయన అన్నారు. ఈ తనిఖీలలో మొగల్తూరు మహిళా సబ్ ఇన్స్పెక్టర్ వై నాగలక్ష్మి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## అంగన్వాడి టీచర్లకు సాంసంగ్ 5జి మొబైల్ ఫోన్స్ పంపిణీ



ప్రభాత వార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మరియు కామవరపుకోట క్లస్టర్ పరిధిలో పనిచేయుచున్న 298 మంది టీచర్లకు శాసనసభ్యులు చేతుల మీదుగా 298 సాంసంగ్ 5జి మొబైల్ ఫోన్స్ అందించడం జరిగింది ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ.. ఇంకా సమర్థవంతం గా పనిచేసి డిపార్ట్మెంట్కు మరియు నియోజకవర్గానికి మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలియజేశారు, ఇప్పటివరకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద తొలి ప్రసవానికి రు.5000/- రెండవ ప్రసవం ఆడబిడ్డ అయితే రు.6000/- వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని,మరియు 29 మినీ అంగన్వాడీలకు పదోన్నతి పొందినయని శాసనసభ్యులు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సిడిపిఓలు అంగన్వాడీ సూపర్వైజర్లు కార్యకర్తలు పాల్గొన్నారు

## జీ కే చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధాశ్రమానికి వితరణ

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : జంగారెడ్డిగూడెంనకు చెందిన జీ కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గణిత ఆనంద ప్రసాద్ నిర్వహణలో స్థానిక శ్రీ సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో విజయవాడ కరెన్సీ నగర్ నివాసి నీలం శ్రీనివాసరావు ద్రవ్యసహాయంతో నిత్యావసర వస్తువులు, స్టీల్ గ్యాస్ స్టవ్ మరియు అన్నదానం బుధవారం నిర్వహించారు. గణిత ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ తమ శ్రేయోభిలాషి నీలం శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా పదివేలు విలువైన సేవాకార్యక్రమం జీ కే చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి ఆశ్రమ నిర్వాహకులు జయవరపు శేఖర్ కు అందజేశామని, దాతకు ట్రస్ట్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. జీ కే ట్రస్ట్ కోశాధికారి గణిత పద్మశ్రీ వయోవృద్దుల సేవలో



భాగంగా ట్రస్ట్ నేడు దాత తోడ్పాటుతో కార్యక్రమం నిర్వహించిందని, మరిన్ని సేవలు సమాజానికి ట్రస్ట్ ముందు ముందు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సామజికవేత్త కే ఎల్ ఎన్ ధనకుమార్, ఎస్ స్వామి, బవిరిశెట్టి హనుమాన్ తిలక్ తదితరులు పాల్గొన్నారు

## ఇప్పటికైనా రహదారి నిర్మాణం పూర్తవుతుందా?

మొగల్తూరు డిసెంబర్ 17(ప్రభాతవార్త) గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వెంప మీదుగా భీమవరం వెళ్లే ఆర్ అండ్ బి రహదారి గత కరోనా టైం లో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కరోనా సోకి మృతి చెందగా అప్పటినుంచి అసంపూర్తిగా మిగిలిపోయింది ఇదే రహదారి గుండా నిత్యం భీమవరం నుంచి పేరుపాలెం వెళ్లే పర్యటకులు వేల సంఖ్యలో వస్తుంటారు నిర్మాణ పనులు చేపట్టిన సమయం నుంచి రహదారిని జెసిబి సహాయంతో పాడుబడిన ఆర్ అండ్ బి రహదారిపై గుంతలు సరి చేయడం తప్ప రహదారి నిర్మాణం ముందుకు సాగలేదు ఈసారైనా నిర్మాణం పూర్తవుతుందా లేదా అనే సందేహంలో స్థానికులు ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

## ఘనంగా పెన్షనర్ల దినోత్సవం.

అత్తిలి/ తాడేపల్లిగూడెం –డిసెంబర్ 17 (ప్రభాత వార్త):విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్స్ ఫాదర్ ఆఫ్ ది పెన్షనర్స్ నకరా కి రుణపడి ఉంటారని సీనియర్ సిటిజన్ రాష్ట్ర అధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ ఉద్యమ నాయకుడు డి.ఎస్. నకరా పెన్షనర్స్ తరపున పెన్షన్ సవరణ చట్టం కోసం సుప్రీంకోర్టులో పిటీషన్ వేసి పెన్షనర్స్ కు అనుకూలంగా తీర్పు వచ్చిన రోజు డిసెంబర్ 17 గుర్తు గా జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవంగా తాడేపల్లిగూడెం పెన్షనర్స్ హాలు వద్ద నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సంఘ అధ్యక్షులు బి హరికుమార్ అధ్యక్షత వహించారు. అతిథులుగా తాడేపల్లిగూడెం పెన్షనర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి, తహసిల్దార్ ఎం. సునీల్ కుమార్,ఎస్ టి ఓ జయ దత్తేశ్వరరావు, ఎంపీడీఓ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. సీనియర్ పెన్షనర్స్ 20 మందిని సంఘం తరపున సత్కరించారు. పెన్షనర్, పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘ నాయకుడు భీమవరపు మహాలక్ష్మి ఆర్థిక సౌజన్యంతో హాజరైన వారందరికీ విందు,అల్పాహారం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో భాగంగా పెన్షన్ సవరణ



అంశం లోకసభలో ఆమోదింప చేసిందన్నారు. దీనివలన పెన్షనర్లకు పెద్ద ముప్పు పొంచి ఉందన్నారు. ఒకసారి రిటైర్ అయిన తర్వాత నిర్ణయించబడిన పెన్షన్ ఇక తర్వాత జీవితాంతం పెరగకుండా నిలిచిపోతుందన్నారు. దీనిని పెన్షనర్లు అందరూ సంఘటితంగా పోరాడవలసిన అవసరం ఉందన్నారు. పెన్షన్ నుండి మెడికల్ సొమ్ము మినహాయించినప్పటికిని పెన్షన్ దారులకు సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని చెబుతూ జీవితకాలం ప్రభుత్వ సేవ చేసి విశ్రాంతి పొందిన ఉద్యోగులకు ప్రభుత్వం అండదండలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## పెన్షనర్స్ పాలిట దైవం స్వర్గీయ డి ఎస్ నకారా,

పెనుమంట్ర–ప్రభాతవార్త: పెన్షనర్స్ పాలిట దైవం స్వర్గీయ డి. ఎస్. నకారా అని, కలకాలం నిలిచి ఉంటారని మండల గవర్నమెంట్ పెన్షనర్స్ సంఘం కార్యదర్శి పాలా ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగిన జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సంఘం అధ్యక్షులు కొత్త సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా నకారా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘంలో 75 సం.రాలు నిండిన రిటైర్డ్ తహసీల్దార్ చిర్ల సూర్య నారాయణ రెడ్డిని సభ్యులు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో తామాడ



సత్యనారాయణ, పడాల కేశవరెడ్డి, పి రామ చంద్రరావు, సిఎచ్. శివరామరాజు, పడాల నరిసిరెడ్డి, బావిచెట్టి సత్తిపండు, పడాల జగన్నాధ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

మండవల్లి డిసెంబర్ 17 (ప్రభాతవార్త) :మండల కేంద్రమైన మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ విశేషంగా ఆకట్టుకుంది. మండల ఎంఈఓ 2 అయిన శ్రీమతి రత్న సునాదం కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు విశేషంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచి విభిన్నంగా ఆలోచించి సృజనాత్మక నమూనాలను తయారు చేయాలని కోరారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులలో ఏడు విభాగాలు చెందిన ప్రాజెక్టులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అలాగే సైన్స్ టీచర్స్ అమీనా, నాగబాబు అజయ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## మానవత ఆత్మీయ పలకరింపు,



పెనుమంట్ర–ప్రభాతవార్త : పెనుమంట్ర మండల శాఖ మానవతా సభ్యుడు అంబులెన్సు డ్రైవర్ గుబ్బల శ్రీను తండ్రి గుబ్బల కనకం అకాల మరణానికి చింతిస్తూ వారి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించింది. మానవత ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుబ్బల కనకం మంచి మనిషి సేవ తాత్పరుడు అని కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో మానవతా మండల చైర్మన్ కదలి సుబ్రహ్మణ్యం, కో–చైర్మన్ పడాల జగన్నాధరెడ్డి, పూర్వ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, చిర్ల సూర్యనారాయణ రెడ్డి, పడాల కేశవరెడ్డి, కోనాల నర్సిరెడ్డి, ఆచంట మానవతా సభ్యులు నెక్కంటి శివన్నారాయణ తదితరులు ఉన్నారు.

## భీమవరం పట్టణంలో కార్పొరేట్ స్థాయి సంస్థలు ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం టౌన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త : భీమవరం పట్టణానికి కార్పొరేట్ స్థాయి సంస్థలు ఎన్నో వచ్చాయని మరెన్నో వస్తున్నాయని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు స్థానిక రెస్ట్ హౌస్ రోడ్లో ఏర్పాటు అయిన యువతి వస్త్ర షో రూమ్ ను ఎమ్మెల్యే, అంజిబాబు, సినీనటి అనసూయ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న పట్టణానికి ఎన్నో కార్పొరేట్ స్థాయి సంస్థలు తరలివస్తున్నాయని అన్నారు వస్త్ర రంగంలో ఎంతో ఆదరణ పొందిన యువతి షోరూం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు భీమవరంలో నాలుగవ షోరూం ప్రారంభించుకోవడం శుభ పరిణామం అన్నారు నటి అనసూయ మాట్లాడుతూ భీమవరం ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు బ్రాండెడ్ దుస్తులు అందించేందుకు యువతి షోరూం ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. మగువలు మెచ్చే టాప్ లు డ్రెస్సులు మరెన్నో అద్భుతమైన డిజైన్లలో ఉన్నాయన్నారు. స్టోర్ హెడ్ కురిసేటి సతీష్ ,బోండా రాధాకృష్ణ ,కురిసేటి నాని మాట్లాడుతూ భీమవరంలో నాలుగో బ్రాంచ్ గా యువతి షోరూం ప్రారంభించామని మచిలీపట్నం, కోదాడ



,కాకినాడ, భీమవరంలలో షోరూములు ఏర్పాటు అయ్యాయి అన్నారు .సరికొత్త మోడల్స్ లో అన్ని రకాల అధునాతనమైన డిజైన్లు తో బ్రాండెడ్ దుస్తులు ఉన్నాయన్నారు స్టోర్ సభ్యులు తేజ ,అనీష్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామ లక్ష్మి, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ సతీమణి వెంకటేశ్వరి దేవి, ఎంపీ పాకా సత్యనారాయణ సతీమణి తులసి లక్ష్మి ఎఎంసి చైర్మన్ కలిదిండి సుజాత, సోము ఎన్ వి ఎస్ కుమారి ,కొత్త నాగ పద్మావతి, ఓటమి నాయకులు, అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు

## వీధిలైట్లు పై దృష్టి సారించిన చిత్తపూరు సర్పంచ్

చాట్రాయి, డిసెంబర్ 17, ప్రభాతవార్త : చిత్తపూరు గ్రామంలో వీధిలైట్లు పై సర్పంచ్ తిరువీధి రమేష్ దృష్టి సారించారు. గతంలో ఉన్న వీధి దీపాలు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేస్తున్న విద్యుత్తు లైన్లు వేసే సమయంలో సిబ్బంది ఇష్టానుసారంగా పగలగొట్టారని దీనిపై ట్రాన్స్ కో ఏ.ఈ ని అడిగిన ఎటువంటి స్పందన లేదని అందువలన పడమట హరిజనవాడ బీసీ బజారులలో సుమారు లక్ష రూపాయలు వ్యయంతో కొత్త లైట్లు అమరుస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఉన్న వీధిలైట్లు పాడుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



## అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్లు

కాళ్ళ డిసెంబర్17 (ప్రభాతవార్త) :అంగన్వాడీ సేవలను మరింత పారదర్శ కంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు అన్నారు. మండలంలోని పెద అమిరంలో ఆయన కార్యాలయంలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ పరిధిలోని ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల 261 మంది అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కో–ఆర్డినేటర్లకు 5జీ మొబైల్ ఫోన్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రైతు బజార్ నిర్వహణ, ధరలుపై ప్రజాభిప్రాయం సేకరణ సంతృప్తి

భీమవరం డిసెంబరు 17ప్రభాతవార్త: జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచనల మేరకు భీమవరం రైతు బజార్ లో సౌకర్యాలు, కూరగాయలు ధరలు పై ప్రజల నుండి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫిర్యాదులు బాక్స్ ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్ నందు ఓపెన్ చేసి ప్రజల నుండి వచ్చిన అభిప్రాయాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. రైతు బజార్లో సైకిల్ స్టాండు ఏర్పాటు చేయాలని, స్టాల్స్ నెంబర్లను, కూరగాయల ధరలు ఎప్పటికప్పుడు డిస్ప్లేచేయాలని ఫిర్యాదుల ద్వారా తెలియజేయడం జరిగింది. అలాగే బహిరంగ మార్కెట్ కన్నా రైతు బజార్లో కూరగాయల ధరలు సంతృప్తికరంగా, తాజాగా ఉన్నవని ప్రజల అభిప్రాయాల్లో తెలియజేయడం గమనించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.



ఎటువంటి మధ్య దళారులు ప్రమేయం లేకుండా రైతు బజార్ ద్వారా విక్రయించే కూరగాయలు, ఆకుకూరలు, నిత్యవసర సరుకులు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా మార్కెటింగ్ ఏడి కె.సునీల్ కుమార్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కళ్యాణ్, తదితరులు ఉన్నారు.